నమస్తే తెలంగాణ
తాజా వార్తలు, ఈ పేపర్ కోసం ntnews.com చూడండి.

మన రాష్ట్రం మన పత్రిక

# నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ
జిల్లా టాబ్లాయిడ్ వార్తల కోసం 10, 11 పేజీలు చూడండి.

శుక్రవారం 3.4.2020 • సంపుటి 9 • సంచిక 279 • వెల. రూ. 6.50
కరీంనగర్ పేజీలు : 12
దశమి

సూర్యోదయం: 6.07, సూర్యాస్తమయం: 6.25, శార్వరి సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం దశమి అ.రా. 12.59 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: పుష్యమి సాయంత్రం 6.41 వరకు, తదుపరి ఆశ్లేష, అమృతఘడియలు: మధ్యాహ్నం 12.30 నుంచి 2.03 వరకు, రాహుకాలం: ఉదయం 10.44 నుంచి మధ్యాహ్నం 12.16 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.35 నుంచి 9.24 వరకు, తిరిగి మధ్యాహ్నం 12.41 నుంచి 1.30 వరకు, వర్జ్యం: లేదు.

PUBLISHED FROM KARIMNAGAR • HYDERABAD • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD
www.ntnews.com /ntdailyonline

## కమనీయం.. రాములోరి కల్యాణం



గురువారం భద్రాచలం రామాలయంలోని బేడా మండపంలో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవంలో అమ్మవారికి మాంగల్యధారణ దృశ్యం

2

# ఫోర్బ్స్ లిస్టులో మన పిల్లలు

- ‘30 అండర్ 30 ఆసియా’ జాబితాలో ఐదుగురు హైదరాబాద్ యువకులు
- దేశవ్యాప్తంగా 69 మంది ఎంపిక.. ట్విట్టర్‌లో మంత్రి కేటీఆర్ అభినందనలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉద్యోగం సంపాదించడంకాదు.. తామే ఇతరులకు ఉపాధి కల్పించాలనే తపన, ఆసక్తి ఉన్న యువతకు తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడూ చేయూతనందిస్తున్నది. టీహబ్ రూపంలో సరైన వేదికను ఏర్పాటుచేసి పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా ప్రోత్సహిస్తున్నది. దీన్ని తెలంగాణ యువత కూడా అదేస్థాయిలో అందిపుచ్చుకొంటున్నది. తాజాగా ‘ఫోర్బ్స్’ పత్రిక ప్రకటించిన ‘30 అండర్ 30 ఆసియా– 2020’ జాబితాలో హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు యువకులకు స్థానం లభించడమే దీనికి నిదర్శనం. ప్రపంచవ్యాప్తంగా 10 రంగాల్లో తమ సత్తాను చాటి లీడర్లు, యువపారిశ్రామికవేత్తలుగా ఎదిగిన 300 మందికి ఈ జాబితాలో చోటు కల్పించారు. ఆర్ట్స్, ఎంటర్‌టైన్‌మెంట్ అండ్ స్పోర్ట్స్, ఫైనాన్స్ అండ్ వెంచర్ క్యాపిటల్, మీడియా, మార్కెటింగ్ అండ్ అడ్వర్టయిజింగ్, రిటైల్ అండ్

మిగతా 3వ పేజీలో



మారుట్ డ్రోన్స్ వ్యవస్థాపకులు సాయి కుమార్, ప్రేమ్ కుమార్, సూరజ్

## పాటించాల్సిన దూరం

# 3 అడుగులా 30 అడుగులా?

అంత దూరం పాటిస్తేనే కరోనా సోకదు
గంటలపాటు గాలిలో ఉండే వైరస్!
ఎంఐటీ పరిశోధనలో వెల్లడి



5

కరోనా వైరస్ గంటల పాటు గాలిలో ఉంటూ.. 7 నుంచి 9 మీటర్ల దాకా ప్రయాణించగలదని అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) పరిశోధకులు వెల్లడించారు. ప్రస్తుతం అనుసరిస్తున్న మూడు అడుగుల నిర్ణీత దూరం సరిపోదని, దాన్ని పెంచాల్సిందేనని స్పష్టం చేశారు. ‘సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్’ నిబంధన ప్రకారం ఆరు ఫీట్లు, ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచన ప్రకారం మూడు ఫీట్లు నిర్ణీత దూరం పాటించాలి. అయితే తమ అధ్యయనం ప్రకారం ఆ నిబంధనలు మార్చాల్సిన అవసరం ఉన్నదని మసాచుసెట్స్ పరిశోధకులు చెప్తున్నారు.

## డాక్టర్లపై దాడి చేస్తే

# మూడేండ్ల జైలు శిక్ష

- రూ.50 వేల నుంచి 2 లక్షల జరిమానా
- ఆస్తుల ధ్వంసానికి రెట్టింపు జరిమానా
- కేసు నమోదైతే బెయిల్‌కూడా దొరకదు
- స్పష్టం చేస్తున్న మెడికేర్ సర్వీస్ చట్టం
- గాంధీ ఘటనపై అధికారులు సీరియస్
- చట్టం అమలుకు ఐఎంఏ డిమాండ్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: వైద్యులు, ఇతర సిబ్బందిపై దాడులకు పాల్పడితే మూడేండ్ల జైలుశిక్ష తప్పదు. దీంతోపాటు రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు జరిమానా కూడా విధిస్తారు. ‘మెడికేర్ సర్వీస్ పర్సన్ అండ్ మెడికేర్ సర్వీస్ ఇన్‌స్టిట్యూషన్స్ (ప్రొటెక్షన్ ఫ్రమ్ వయొలెన్స్ అండ్ డ్యామేజి ప్రాపర్టీ) చట్టం – 2008 ప్రకారం దోషులకు శిక్ష పడుతుంది. ఈ కేసు నమోదైతే బెయిల్ కూడా లభించదు. ఈ చట్టం ఇప్పటికే అమలులో ఉన్నప్పటికీ, బుధవారం గాంధీ దవాఖానలో జరిగిన వైద్యులపై దాడి ఘటన నేపథ్యంలో మరింత కఠినంగా అమలుచేయాలని

మిగతా 2వ పేజీలో



డాక్టర్లు, వైద్య సిబ్బందిపై దాడులు చేస్తే సహించేదిలేదు. గాంధీ దవాఖానలో వైద్యులపై దాడిచేసిన కరోనా పాజిటివ్ రోగులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుంది. గాంధీ దవాఖాన, నిజామాబాద్‌లో ఘటనలవంటివి సహించబోం. కరోనా వ్యాధి వారికే పరిమితం కాదు, వారి నుంచి ఇతరులకూ వ్యాపిస్తుంది. ఈ విషయాన్ని గ్రహించి చికిత్సకు, పరీక్షలకు సహకరించాలి.

-గాంధీ ఘటనపై మంత్రి కేటీఆర్



**దూరదూరంగా వస్తాం దరిజేర్చు తల్లీ..**

కరోనా మహమ్మారి నుంచి తమను కాపాడాలంటూ గురువారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం గిరివెల్లిలో పోచమ్మ తల్లికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ సమీపంలోని ఎర్రవాగు నుంచి నిర్ణీత దూరం పాటిస్తూ నీళ్లు తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. కరోనా వైరస్‌ను తరిమి కొట్టి.. ప్రజలందరినీ రక్షించాలంటూ మొక్కుకున్నారు. - దహెగాం

## ఐసీయూను మించి ఐసొలేషన్



3

‘కరోనా రోగులకు ఏర్పాటు చేసిన ఐసోలేషన్ వార్డులను మంచి ప్రమాణాలతో నిర్వహిస్తున్నారు. పేషెంట్లకు ఫోన్, వైఫై సౌకర్యం కల్పించారు. వార్డుల్లోని బెడ్స్, బెడ్‌షీట్స్ ఎప్పటికప్పుడు మార్చుతున్నారు. పేషెంట్ దగ్గరికి ఎవరినీ అనుమతించడం లేదు. ఉదయం డ్రైఫ్రూట్స్ ఇవ్వడంతో పాటు, ప్యాకేజీ ఆహారాన్ని వేడివేడిగా అందిస్తున్నారు. తాగునీటిబాటిల్స్ ఇస్తున్నారు. ప్రతి గంటకు మందులు, వైద్యసేవలు అందుతున్నాయి. వైద్యులు పూర్తిస్థాయి రక్షణతో వైద్యం అందిస్తున్నారు.’

- అఖిల్

## వార్‌రూమ్‌లా ప్రగతిభవన్

# కదం కదం కదనం



యుద్ధం చేయాలంటే ఒక వ్యూహం అవసరం. తెలిసి వచ్చే యుద్ధానికి ముందే సిద్ధం కావచ్చు. చతురంగ బలగాలను సన్నద్ధం చేసుకోవచ్చు. కానీ ఉరుములు మెరుపుల్లేకుండా పిడుగులా మీదపడే యుద్ధానికి, అదీ కంటికి కనిపించని వైరస్‌పై యుద్ధానికి?


ఈ యుద్ధాన్ని ఎదుర్కొనాలంటే పకడ్బందీ ప్రణాళిక కావాలి. ఎప్పటికప్పుడు రంగు మార్చే శత్రువును ఎదుర్కొనేందుకు ఎప్పటికప్పుడు ఎత్తుగడలు వేయాలి. ఏ క్షణం ఏమి జరిగినా ఎదుర్కొనడానికి సన్నద్ధమై ఉండాలి! యావత్తు జగత్తులో కల్లోలానికి కారణమైన కరోనా వైరస్‌పై తెలంగాణ ప్రభుత్వం ఇలాంటి యుద్ధమే చేస్తున్నది.

## కరోనా రక్కసిపై సర్కారు ఒక్కుమ్మడి పోరు

- ప్రతిరోజూ గంటలపాటు సీఎం కేసీఆర్ సమీక్షలు.. పకడ్బందీ కార్యాచరణ
- సైనికులుగా పోరాడుతున్న మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు
- రోజులో 16 గంటలకుపైగా పనిచేస్తున్న పోలీసులు, వైద్య సిబ్బంది

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణపై కరోనా కత్తి దూసి సరిగ్గా నెల రోజులైంది. మార్చి 2 న తొలి కేసు నమోదైనప్పటినుంచి, ఇప్పటిదాకా వైరస్‌కు, సర్కారుకు మధ్య ఒకరకంగా ద్వంద్వ యుద్ధమే సాగుతున్నది. పగలు, రాత్రి తేడా లేకుండా వైరస్ పంజా విసురుతుండగా, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సారథ్యంలో ప్రభుత్వం కూడా పగలు రాత్రి లేకుండా దాంతో తలపడుతున్నది. కరోనా ప్రభావాన్ని ముందే గుర్తించిన ముఖ్యమంత్రి, తొలి దశలో ప్రజలను భయోత్పాతానికి గురిచేయకుండా, మెల్లిగా విషయ తీవ్రతను జనం మనసుల్లోకి చొప్పించారు. ఆనాటి నుంచి ఈనాటి దాకా ఆయన పూర్తి స్థాయిలో కరోనాపైనే దృష్టి కేంద్రీకరించారు. కరోనాపై కేసీఆర్ సమీక్ష జరపని రోజు లేదంటే ఆశ్చర్యం లేదు. ఒకేరోజు మూడు, నాలుగు సమీక్షలు, ఏకబిగిన 12 గంటలు.. 14 గంటలు.. 16 గంటలు.. సమావేశాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వం ప్రధానంగా నాలుగు అంశాలపై దృష్టి పెట్టింది. 1.కరోనా వ్యాధిగ్రస్థులను గుర్తించి చికిత్స

మిగతా 3వ పేజీలో




విధుల్లో ఉన్న వైద్యులపై దాడి నేపథ్యంలో గురువారం గాంధీ దవాఖాన వద్ద పోలీసు బందోబస్తు

## ఫేక్‌న్యూస్ అంతుతేల్చే వెబ్‌సైట్

ప్రారంభించిన సర్కారు.. దేశంలోనే తొలిసారి
**https://factcheck.telangana.gov.in**




4

వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి మెసేజింగ్ యాప్‌లతో పాటు సోషల్ మీడియాలో వందలసంఖ్యలో వస్తున్న వార్తల్లో నిజమెంత? ఏది అసలు వార్త.. ఏది తప్పుడు వార్త..? ఇకపై ఈ విషయంలో తలబద్దలుకొట్టుకోవాల్సిన పనిలేదు. ఏది తప్పుడు వార్తో.. ఏది నిజమైనదో ధ్రువీకరించుకునేందుకు దేశంలోనే మొట్టమొదటిసారిగా తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. లాక్‌డౌన్, కరోనా వైరస్ వ్యాప్తి తదితర అంశాలపై డిజిటల్ మీడియాలో వచ్చే తప్పుడు సమాచారం, వదంతులపై https://factcheck.telangana.gov.in వెబ్‌సైట్‌ను చూడవచ్చు.

## వాహన, ఆరోగ్యబీమా పాలసీదారులకు ఊరట

ఈ నెల 21 దాకా ప్రీమియం చెల్లించకున్నా వర్తింపు

2

# 960 వీసాలు రద్దు

బ్లాక్‌లిస్ట్‌లో తబ్లిగీ విదేశీయులు.. విదేశీ, విపత్తు చట్టాల ఉల్లంఘనపై చర్యలు

రాష్ట్రాల డీజీపీలకు కేంద్ర హోంశాఖ ఆదేశాలు.. క్వారంటైన్‌లో 9,000 మంది



మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ కృష్ణాకాలనీలో తబ్లిగీ సందర్శనకు వెళ్లినట్టు భావిస్తున్నవారి వివరాలు తెలుసుకుంటున్నవైద్య సిబ్బంది, పోలీసులు

న్యూఢిల్లీ: తబ్లిగీ జమాత్ కార్యక్రమాల్లో పాల్గొన్న 960 మంది విదేశీయులను కేంద్ర ప్రభుత్వం బ్లాక్‌లిస్ట్‌లో చేర్చింది. వీరి వీసాలను రద్దు చేయడంతో పాటు విదేశీ చట్టం, విపత్తు నిర్వహణ చట్టం ఉల్లంఘన కింద చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించింది. పర్యాటక వీసాల కింద భారత్‌కు వచ్చిన వీరు మతపరమైన కార్యక్రమాల్లో పాల్గొన్నారని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ నేపథ్యంలో వీసా నిబంధనలు ఉల్లంఘించినందుకు భారత వీసాలను రద్దు చేయడంతో పాటు వారిని బ్లాక్‌లిస్ట్‌లో చేర్చినట్లు తెలిపింది. విదేశీ చట్టం, విపత్తు నిర్వహణ చట్టాన్ని ఉల్లంఘించిన 960 మంది తబ్లిగీ విదేశీయులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఢిల్లీ పోలీసులతోపాటు వారు ప్రస్తుతం ఉన్న రాష్ట్రాల డీజీపీలను ఆదేశించినట్లు వెల్లడించింది. దేశవ్యాప్తంగా సుమారు 9 వేల మంది తబ్లిగీ సభ్యులు, వారు తొలుత కలిసిన

మిగతా 4వ పేజీలో

**కొనసాగుతున్న అన్వేషణ**

- తబ్లిగీ యాత్రికుల గుర్తింపు.. పాజిటివ్ కేసులు గాంధీకి
- హైదరాబాద్‌లో 304 మంది క్వారంటైన్‌కు

4



**శవానికీ శుద్ధితప్పదు**

ముంబైలోని ఛత్రపతి శివాజీ మహరాజ్ టెర్మినస్ వద్ద పడి ఉన్న గుర్తుతెలియని మృతదేహంపై గురువారం వైరస్ నాశక రసాయనాలు చల్లుతున్న పారిశుద్ధ్య సిబ్బంది

ప్రపంచవ్యాప్తంగా
మొత్తం కేసులు: **10,02,071**
మరణాలు: **51,434**
కోలుకున్నవారు: **2,10,451**

| దేశం | కేసులు | మృతులు |
|---|---|---|
| అమెరికా | 2,35,860 | 5,626 |
| ఇటలీ | 1,15,242 | 13,915 |
| స్పెయిన్ | 1,10,238 | 10,096 |
| జర్మనీ | 84,415 | 1,090 |
| చైనా | 81,589 | 3,318 |

దేశంలో కేసులు: **2,536**
మృతులు: **72**
కోలుకున్నవారు: **189**

రాష్ట్రంలో కేసులు: **154**
మృతులు: **9**
కోలుకున్నవారు: **17**

లాక్‌డౌన్-డే 11

ఉష్ణోగ్రతలు

| | గరిష్ఠం | కనిష్ఠం | | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|---|---|---|
| హైదరాబాద్ | 39.4°c | 24.1°c | మెదక్ | 38.0°c | 26.0°c |
| కరీంనగర్ | 38.0°c | 26.0°c | ఆదిలాబాద్ | 38.3°c | 22.0°c |
| వరంగల్ | 39.0°c | 23.5°c | నిజామాబాద్ | 38.0°c | 25.0°c |
| రంగారెడ్డి | 37.0°c | 25°c | మహబూబ్‌నగర్ | 39.3°c | 25.3°c |
| నల్లగొండ | 39.8°c | 24.2°c | ఖమ్మం | 40.0°c | 26.0°c |

# కమనీయం.. రాములోరి కల్యాణం

భద్రాద్రి దివ్యక్షేత్రంలో నిరాడంబరంగా శ్రీరామనవమి

హాజరైన మంత్రులు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్

ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పణ



గురువారం సీతారాముల కల్యాణం సందర్భంగా భద్రాద్రిలో స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు తీసుకొస్తున్న మంత్రులు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్ దంపతులు, ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి తదితరులు

**భద్రాచలం, నమస్తే తెలంగాణ:** భద్రాద్రి దివ్యక్షేత్రంలో సీతారాముల కల్యాణం గురువారం నిరాడంబరంగా సాగింది. లాక్‌డౌన్ నేపథ్యంలో రామాలయం ప్రాంగణంలోని బేడా మండపంలోనే రాములవారి కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయంలోని ధ్రువమూర్తుల కల్యాణం అనంతరం శ్రీసీతారామచంద్రస్వామివారిని మంగళవాద్యాల నడుమ బేడా మండపానికి తీసుకొచ్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాఃవచనం, రక్షాబంధనం, మోక్షబంధనం నిర్వహించారు. గోదానం చేసి మహాసంకల్పం పఠించారు. సాక్షాత్ విష్ణుస్వరూపుడైన శ్రీరామునికి శ్రీమహాలక్ష్మి స్వరూపమైన సీతను జగత్కల్యాణార్థం మంత్రధార పూర్వకంగా కన్యాదానంచేశారు. మంగళవాద్యాలు మారుమోగుతుండగా, వేద మంత్రాల మధ్య అభిజిత్‌లగ్నం సమీపించగానే అర్చకులు జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని సీతారాముల శిరస్సులపై ఉంచారు. జనకమహారాజు, దశరథ మహారాజు తరఫున చేయించిన రెండు మంగళసూత్రాలతోపాటు భక్తరామదాసు సీతమ్మకు చేయించిన మరొక మంగళసూత్రం కలిపి మూడు సూత్రాలతో మాంగళ్యధారణ గావించారు. స్వామివారికి పచ్చల పతకం, సీతమ్మకు చింతాకు పతకం, లక్ష్మణస్వామికి రామమాడ అలంకరించారు. దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ప్రభుత్వ సలహాదారు రమణాచారి, దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్ ప్రభుత్వం తరఫున శ్రీసీతారామచంద్రస్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కల్యాణ తంతును ఆద్యంతం తిలకించారు. సీతారాముల కల్యాణానికి ఎంపీ మాలోతు కవిత, భద్రాద్రి కొత్తగూడెం జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, ఎమ్మెల్యే పొదెం వీరయ్య, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, ఎస్పీ సునీల్‌దత్, భద్రాద్రి ఆలయ ఈవో జీ నరసింహులు, ఆర్డీవో స్వర్ణలత, ఏఎస్పీ రాజేశ్‌చంద్ర, ఆలయ ప్రధాన అర్చకుడు సీతారామానుజాచార్యులు, విజయరాఘవన్, స్థానాచార్యులు స్థలసాయి, వేద పండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు హాజరయ్యారు.



## సీఎం కేసీఆర్ శ్రీరామనవమి శుభాకాంక్షలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. అందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండేలా దీవించాలని ఆయన భగవంతుడిని ప్రార్థించారు.



తిరుపతిలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో ఉత్సవ మూర్తులకు స్నపనతిరుమంజనం నిర్వహిస్తున్న దృశ్యం.

## తిరుపతిలో శ్రీరామనవమి ఆస్థానం

నేడు నిర్వహించాల్సిన కల్యాణం రద్దు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి శ్రీకోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనవమి ఆస్థానం గురువారం ఏకాంతంగా సాగింది. వేద పండితులు ఉదయం సీతారామచంద్రమూర్తి, లక్ష్మణుల మూలమూర్తులకు అభిషేకం, ఉత్సవ మూర్తులకు స్నపనతిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 4 నుంచి 5 గంటలవరకు పెద్దజీయర్ స్వామి తరఫున ఏకాంగులు నూతన వస్త్రాలను విమాన ప్రదక్షణగా తీసుకొచ్చి స్వామివారి మూలవర్లకు, ఉత్సవర్లకు సమర్పించారు. ఆ తర్వాత శ్రీరామ జన్మ పురాణం, ఆస్థానం నిర్వహించారు. శ్రీరామనవమి సందర్భంగా శుక్రవారం నిర్వహించాల్సిన సీతారాముల కల్యాణాన్ని రద్దు చేసినట్టు తిరుమల తిరుపతి దేవస్థానం ప్రకటించింది. కరోనా వైరస్ వ్యాప్తి నియంత్రణ చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు టీటీడీ వివరించింది.

## కరోనా కట్టడికి రూ.370 కోట్లు

- విపత్తుల నిర్వహణశాఖ ఉత్తర్వులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వ్యాప్తి నివారణకు రాష్ట్ర ప్రభుత్వం విపత్తు నిర్వహణ నిధి నుంచి వైద్యారోగ్యశాఖకు రూ.370.067 కోట్లు విడుదలచేసింది. రాష్ట్ర విపత్తుల నిర్వహణశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా గురువారం ఉత్తర్వులు జారీచేశారు. వైరస్ కట్టడికి తక్షణం అవసరమైన వస్తువుల కొనుగోలు కోసం ఈ నిధులను వినియోగించుకోవాలని ఉత్తర్వులలో పేర్కొన్నారు.

## పాలసీల చెల్లింపు గడువు పెంపు

- వాహన, ఆరోగ్యబీమా పాలసీదారులకు ఊరట

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లాక్‌డౌన్ నేపథ్యంలో వాహన, ఆరోగ్య పాలసీదారుల ప్రీమియం చెల్లింపు గడువు పెంచుతున్నట్టు ఆర్థిక మంత్రిత్వశాఖ తెలిపింది. పాలసీల గడువు ముగిసినా బీమా వర్తిస్తుందని గురువారం నోటిఫికేషన్ విడుదలచేసింది. దీంతో మార్చి 25 నుంచి ఏప్రిల్ 14 మధ్య చెల్లింపులు చేయాల్సిన వాహన, ఆరోగ్య పాలసీదారులకు భారీ ఊరట లభించనున్నది. ఈ ఉత్తర్వులు ఏప్రిల్ 1 నుంచే అమల్లోకి వచ్చినట్టు, ప్రీమియం బకాయిల మొత్తాన్ని ఏప్రిల్ 21 లేదా అంతకన్నా ముందుగానీ చెల్లించవచ్చని స్పష్టంచేశారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా పాలసీదారుల పునరుద్ధరణ ప్రీమియాన్ని సకాలంలో చెల్లించలేకపోతున్నట్టు గుర్తించారు. ఈ నేపథ్యంలో చట్టబద్ధమైన మోటారు వాహనం థర్డ్ పార్టీ బీమా కవరేజీని కొనసాగిస్తున్నట్టు పేర్కొన్నారు. ఏప్రిల్ 21ని పాలసీ పునరుద్ధరణ తేదీగా పరిగణించాలని, ఆరోగ్య బీమా పాలసీల్లో కూడా ఇదే వర్తించనున్నదన్నారు. రోడ్ ట్యాక్సీ చెల్లింపు కూడా వాయిదా వేస్తున్నట్టు రవాణాశాఖ ప్రకటించింది. కేంద్రం ఆదేశాలతో త్రైమాసిక రోడ్ ట్యాక్సీ వసూలుపై మినహాయింపునిచ్చింది.

## ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లుల చెల్లింపు

సీఎండీ ప్రభాకర్‌రావు విజ్ఞప్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విద్యుత్ వినియోగదారులు ఆన్‌లైన్‌లో బకాయిలు చెల్లించాలని జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. లాక్‌డౌన్ నేపథ్యంలో నగదురూపంలో నేరుగా బిల్లులు చెల్లించడం సాధ్యంకాదని, ఆన్‌లైన్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. వ్యయప్రయాసలకోర్చి 24 గంటలపాటు కరంట్ సరఫరా చేస్తూ.. ప్రజలంతా ఇండ్లలోనే సురక్షితంగా ఉండటానికి విద్యుత్ సంస్థలు తోడ్పాటు అందిస్తున్నాయన్నారు. అంతరాయం లేకుండా కరంట్ సరఫరా కొనసాగడానికి సకాలంలో బిల్లులు చెల్లించి వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తిచేశారు.

## ఇంజినీరింగ్ విద్యార్థులకు ఆన్‌లైన్ పాఠాలు

- ఉచిత బోధనకు కోఎమ్ట్ సాఫ్ట్‌వేర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇంజినీరింగ్ విద్యార్థులకు మూడునెలలపాటు ఆన్‌లైన్‌లో ఉచిత బోధనకు మణిపాల్ గ్రూపునకు చెందిన కోఎమ్ట్ ఎడ్యుటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ముందుకొచ్చింది. లాక్‌డౌన్ నేపథ్యంలో విద్యార్థులు సబ్జెక్టులను ప్రాక్టీస్ చేసుకునేలా ఈ బోధన ఉపయోగపడుతుందని కోఎమ్ట్ సీఈవో వీఎస్ఎన్‌రాజు తెలిపారు. వివరాలకు WWW.EduLib.inలో లాగిన్ కావాలని సూచించారు.

## రుణాలను రీషెడ్యూల్ చేయాలి

- మెప్మా డైరెక్టర్ సత్యనారాయణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్బీఐ ఆదేశాలతో టర్మ్ లోన్లను రీ షెడ్యూల్ చేయాలని పట్టణ పేదరిక నిర్మూలన (మెప్మా) మిషన్ డైరెక్టర్ సత్యనారాయణ ఆదేశించారు. వాణిజ్య, కోఆపరేటివ్ బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు స్వయం సహాయక బృందాలకు మంజూరు చేసిన రుణాలపై నెలసరి వాయిదాలను 3నెలల తర్వాత చెల్లించే అవకాశం కల్పించాలని సూచించారు. ఈ కాలానికి క్యాష్ క్రెడిట్, ఓవర్‌డ్రాఫ్ట్ వంటి వర్కింగ్ క్యాపిటల్ సదుపాయాలపై చెల్లించే వడ్డీని 3నెలల తర్వాతే వసూలు చేయాలన్నారు. ఈ సమాచారాన్ని తక్షణమే పీడీలు జిల్లా అధికారులకు స్పష్టంగా చెప్పాలని ఆదేశించారు.

### లోకం పోకడ




టీవీలో వచ్చే జనాల వల్ల కరోనా సోకదంటే వినవేం?

# వైద్యులపై దాడి హేయం

- వైద్యసిబ్బందికి అండగా ఉంటాం: మంత్రి తలసాని
- డాక్టర్లపై దాడులు సరికాదు: మాజీ ఎంపీ నర్సయ్యగౌడ్
- దాడులను తీవ్రంగా పరిగణించాలి: ఉద్యోగ సంఘాలు



గురువారం గాంధీ దవాఖానను సందర్శించి అధికారులతో మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/బన్సీలాల్ పేట్:** ప్రాణాలను పణంగాపెట్టి కరోనా బాధితులకు చికిత్స చేస్తున్న డాక్టర్లపై దాడి చేయటం హేయమని పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం గాంధీ దవాఖానను ఆయన సందర్శించి దాడి ఘటనపై సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్‌కుమార్, ఆర్ఎంవోతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వైద్యసిబ్బంది సేవలకు వెలకట్టలేమని, అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఇలాంటి ఘటనలు పునరావృతంకాకుండా చర్యలు తీసుకోవాలని గోపాలపురం ఏసీపీ వెంకటరమణను ఆదేశించారు.దవాఖాన బయట ఉన్న యాచకులు, అనాథలను షెల్టర్ హోమ్స్‌కు తరలించి భోజన వసతి కల్పించాలని నార్త్‌జోన్, సెంట్రల్‌జోన్ డీసీపీలకు సూచించారు. దీంతో 150 మందిని లాలాపేటలోని పునరావాస కేంద్రానికి తరలించారు. వైద్యసిబ్బందిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు మాజీ ఎంపీ, డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. దాడుల సంస్కృతి మానుకోవాలని సూచించారు.

### పూర్తివేతనం, బోనస్ అభినందనీయం: ఉద్యోగ సంఘాలు

వైద్యులు, సిబ్బందిపై దాడి చేయడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఉద్యోగ సంఘాల జేఏసీ ఓ ప్రకటనలో కోరింది. నిజామాబాద్‌లో విధినిర్వహణలో ఉన్న ఉద్యోగులతో అనుచితంగా ప్రవర్తించినవారిని కూడా శిక్షించాలని సూచించింది. కరోనా బాధితులకు చికిత్స చేయడంతోపాటు నిరంతరం సేవలందిస్తున్న వైద్యులకు సీఎం కేసీఆర్ అండగా పూర్తివేతనంతోపాటు బోనస్ ఇస్తామనడంపై సంఘం నేతలు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు ఉద్యోగ సంఘాల జేఏసీ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ మమత, తెలంగాణ హెల్త్, మెడికల్ జేఏసీ చైర్మన్ డాక్టర్ బరిగెల రమేశ్, కన్వీనర్ పుట్ల శ్రీనివాస్, సెక్రటరీ జనరల్ వెంకటేశ్వర్‌రెడ్డి, చీఫ్ అడ్వయిజర్ జూపల్లి రాజేందర్, కో ఆర్డినేటర్ నరహరి, కో చైర్మన్ షబ్బీర్ అహ్మద్, తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పద్మాచారి ధన్యవాదాలు తెలిపారు.

### పూర్తివేతనంపై పోలీసుల హర్షం

పోలీస్ సిబ్బందికి మార్చి నెల పూర్తి వేతనాన్ని ఇస్తున్నట్టు ప్రకటించడంపై సీఎం కేసీఆర్‌కు పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపిరెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టడంలో డీజీపీ మహేందర్‌రెడ్డి నాయకత్వంలో కీలకంగా పనిచేస్తున్న సిబ్బంది కృషికి తగిన ప్రోత్సాహకాలను సైతం ప్రకటిస్తామనడంపైనా ఆయన గురువారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. ప్రభుత్వం పోలీసులపై ఉంచిన భరోసాతో సిబ్బంది బాధ్యత పెరిగిందని, కరోనా కట్టడిలో మరింత శ్రమిస్తామని చెప్పారు.

### వైద్యారోగ్య జేఏసీ కృతజ్ఞతలు

కరోనా మహమ్మారిని తరిమికొట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని తెలంగాణ వైద్యారోగ్య జేఏసీ చైర్మన్ డాక్టర్ బొంగు రమేశ్, కన్వీనర్ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆరోగ్యశాఖ ఉద్యోగులకు పూర్తి వేతనంతోపాటు ప్రోత్సాహకాలు కూడా ఇవ్వాలని సీఎం కేసీఆర్ నిర్ణయించడంపై హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి, వైద్యశాఖ మంత్రి ఈటలకు గురువారం ఓ ప్రకటనలో ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రాణాలుపణంగా పెట్టి వైద్యసేవలు అందిస్తున్న వైద్యులకు, స్టాఫ్ నర్సులకు, పారా మెడికల్ సిబ్బందికి జేఏసీ సెక్రటరీ జనరల్ వెంకటేశ్వర్‌రెడ్డి, చీఫ్ అడ్వైజర్ జూపల్లి రాజేందర్, కోఆర్డినేటర్ డాక్టర్ నరహరి, కోచైర్మన్ షబ్బీర్ అహ్మద్ తదితరులతో కలిసి కృతజ్ఞతలు చెప్పారు.

# ప్రాణాలు కాపాడిన స్పందన

- సత్వరమే క్యాన్సర్ బాధితురాలికి ఔషధాలు
- ఢిల్లీ నుంచి హబ్సిగూడకు చేరేలా సకల ఏర్పాట్లు
- లాక్‌డౌన్ అమల్లోనూ ప్రయత్నం విజయవంతం
- బాధితుల ట్వీట్‌కు మంత్రి కేటీఆర్ సాయం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఒక్క స్పందన క్యాన్సర్ బాధితురాలి ప్రాణాలను కాపాడింది. ఒక్క ట్వీట్ రవాణా సదుపాయం లేకపోయినా గురువారం ఢిల్లీ నుంచి క్యాన్సర్ మందులను రప్పించింది. తల్లీబిడ్డ మోములో సంతోషాన్ని నింపింది. జీవితాంతం గుండెల్లో గుర్తుంచుకొనేలా చేసింది. హైదరాబాద్ హబ్సిగూడకు చెందిన ఆకుల పార్వతి క్యాన్సర్ స్టేజ్-4తో బాధపడుతున్నారు. న్యూఢిల్లీలోని క్యాన్సర్ క్లినిక్ నుంచి కొరియర్ ద్వారా మందులు తెప్పించుకుంటున్నారు. ప్రస్తుతం లాక్‌డౌన్ అమలుతో కొరియర్ సేవలు నిలిచిపోయాయి. స్థానికంగా ఆ మందులు దొరకక, ఢిల్లీ నుంచి వాటిని ఎలా తెప్పించుకోవాలో తెలియక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని పార్వతి కుమార్తె ఉషా ట్విట్టర్ ద్వారా ఐటీశాఖ మంత్రి కే తారకరామారావు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన వెంటనే స్పందించారు. బాధితురాలికి ఎలా సహాయపడగలమో చూడాలని కార్యాలయ అధికారులను ఆదేశించారు. ఉషకు ఫోన్‌చేసిన అధికారులు పూర్తి వివరాలు సేకరించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌ను సంప్రదించారు. ఆ కార్యాలయ అధికారుల సాయంతో మందులను సేకరించారు. గురువారం అత్యవసర సేవల కోసం ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు ఓ కార్గో విమానం బయలుదేరుతున్నట్టు తెలుసుకొన్నారు. తక్షణమే ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ నుంచి మందులను హైదరాబాద్‌కు పంపించారు. సాయంత్రానికి విమానాశ్రయం నుంచి పార్వతి ఇంటికి మందులు చేరేలా కేటీఆర్ కార్యాలయ అధికారులు చర్యలు చేపట్టారు. అత్యవసర సమయంలో సాయంచేసిన మంత్రి కేటీఆర్‌కు ఉషా ధన్యవాదాలు తెలిపారు.

## కేటీఆర్ @ 20,89,000!

- రాష్ట్రంలో అత్యధిక ట్విట్టర్ ఫాలోవర్స్ కలిగిన నేతగా రికార్డు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అధికార పార్టీకి వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రిగా పలు శాఖలతో నిత్యం ఊపిరి సలుపని బిజీ! అయినప్పటికీ ఆపదలో ఉన్నామని పేర్కొన్న వెంటనే అనూహ్య స్పందన! నిమిషాల వ్యవధిలోనే బాధితులకు ఫోన్‌తోనే భరోసా మొదలు! తన ఆఫీస్ బాధ్యులో, సంబంధిత అధికారుల స్థాయిలో గంటల్లోనే సమస్యకు పరిష్కారం! పల్లె, పట్నం తేడా లేదు.. దేశం, విదేశమనే పరిమితులు లేవు. ఇది ట్విటర్ వేదికగా మంత్రి కే తారకరామారావు దినచర్య! ఎందరికో ఆపద్బంధువుగా నిలిచిన మంత్రి కేటీఆర్ మరో ఘనత సాధించారు. ప్రస్తుతం ట్విటర్‌లో ఆయనను అనుసరించేవారి సంఖ్య 20 లక్షల 89 వేలు! ఈ సంఖ్య ఓ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఓటర్ల కంటే ఎక్కువే. అనేక జిల్లాల జనాభా కంటే అధికమే. రాష్ట్రంలో ఇంత పెద్దమొత్తంలో ఫాలోవర్స్ ఉన్న రాజకీయనాయకుడు కేటీఆర్ ఒక్కరే! 2010 మార్చిలో ట్విట్టర్ ఖాతాను ప్రారంభించి, అనతికాలంలోనే అత్యధిక అభిమానులను సంపాదించుకొన్నారు.

# డాక్టర్లపై దాడిచేస్తే మూడేండ్ల జైలు శిక్ష

మొదటిపేజీ తరువాయి...

నిర్ణయించారు. వైద్యులు, సిబ్బందిపై దాడులకు పాల్పడినా, దవాఖానల్లో ఆస్తులను ధ్వంసంచేసినా ఉపేక్షించేది లేదని అధికారులు స్పష్టంచేశారు. గతేడాది నిలోఫర్ దవాఖానలో వైద్యులపై దాడి కేసులో, లక్డీకాపూల్‌లోని కార్పొరేట్ దవాఖానపై జరిగిన దాడి కేసులోనూ నిందితులను జైలుకు పంపించినట్లు గుర్తుచేశారు. ఈ చట్టంలో నిబంధనలు ఇలా ఉన్నాయి.

- వైద్యులు, వైద్య విద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు, పారా మెడికల్ సిబ్బంది, దవాఖానలో పనిచేసే ఇతర సిబ్బందిపై దాడులకు పాల్పడినా లేకా వారి పట్ల అసభ్యంగా, దురుసుగా ప్రవర్తించినా, బెదిరింపులకు పాల్పడినా నాన్‌బెయిలబుల్ కేసు నమోదు.
- నేరం రుజువైతే మూడునెలల నుంచి మూడేండ్ల వరకు జైలు శిక్ష, రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం.
- దవాఖాన లేదా మెడికేర్ సర్వీస్ సంస్థల ఆస్తులను ధ్వంసంచేస్తే.. నష్టపరిచిన ఆస్తుల విలువకు రెట్టింపు జరిమానాను బాధిత సంస్థకు లేదా వ్యక్తికి కోర్టు ద్వారా చెల్లించాలి. జరిమానా చెల్లించకుంటే నిందితుల ఆస్తులను రెవెన్యూ అధికారులచే జప్తుచేస్తారు.

### ప్రజలు మారాలి

**చట్టాలు** ఎన్ని ఉన్నా వైద్యులపై దాడులు ఆగటం లేదు. ప్రజలకు వైద్యుల విలువ తెలియాలి. ఏ వైద్యుడు కూడా కావాలని రోగుల ప్రాణాలు తీయరు. గాంధీ ఘటనలో రోగి కరోనాతో బాధపడుతున్నారు. దవాఖానలో చేరే సమయానికే అతడి ఆరోగ్యం విషమించింది. గంటగంటకూ రోగి పరిస్థితిని కుటుంబసభ్యులకు తెలియజేశారు. తమ ప్రాణాలను లెక్కచేయకుండా వైద్యులు సేవచేస్తున్నారు. అలాంటివారిపై గాంధీతోపాటు, నిజామాబాద్, ఇండోర్‌లో దాడులు జరిగాయి. వైద్యులు భయాందోళనలకు గురవుతున్నారు. వారు వైద్యం అందించడానికి నిరాకరిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో ఒక్కసారి ప్రజలు ఆలోచించాలి. ప్రజలు మారాలి. వైద్యులపై దాడులను ఐఎంఏ నగర శాఖ తీవ్రంగా ఖండిస్తున్నది.

– గట్టు శ్రీనివాస్, ఐఎంఏ హైదరాబాద్ నగర అధ్యక్షుడు

### మా మనోధైర్యాన్ని దెబ్బతీస్తే మీకే నష్టం

**ప్రాణాంతకమైన** కరోనాకు ఎదురునిలిచి సేవచేస్తున్నాం. ఒక రకంగా మృత్యువుపై ఎదురుదాడిచేస్తున్నాం. ఇలాంటి సమయం లో మా వైద్యులపై దాడులకు పాల్పడటం సరికాదు. మా మనోధైర్యాన్ని దెబ్బతీస్తే అది మీకే నష్టం. మీకు మేమున్నామనే భావన కల్పించాలి కానీ, దాడులతో మా మనోధైర్యాన్ని దెబ్బతీస్తే ఎలా పనిచేస్తాం? అమెరికా, ఇటలీవంటి దేశాలు క్యూబా నుంచి వైద్యులను దిగుమతి చేసుకుంటున్నాయి. ఏ డాక్టర్ కూడా కావాలని రోగుల ప్రాణాలు తీయరు. వరుస దాడుల నేపథ్యంలో వైద్యులకు గన్‌మెన్ల అవసరం కనిపిస్తున్నది.

– డాక్టర్ శ్రావణ్‌కుమార్, సూపరింటెండెంట్, గాంధీ దవాఖాన

## జన్‌ధన్ సొమ్ము తీసుకోండిలా..

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రధానమంత్రి గరీబ్‌కల్యాణ్ యోజన పథకం కింద జన్‌ధన్ ఖాతాల్లోకి రూ.500 చొప్పున ఈ నెల నుంచి మూడునెలలపాటు జమచేయాలని కేంద్రం నిర్ణయించింది. ఏప్రిల్ డబ్బు గురువారం ఖాతాల్లో జమ అయ్యిందని రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. డబ్బులను బ్యాంకుల నుంచి డ్రా చేసుకోవడానికి కొన్ని సూచనలు చేసింది. నిర్ణయించిన తేదీల్లో డబ్బులు డ్రా చేసుకోకుంటే తొమ్మిదో తేదీ తర్వాత బ్యాంకు పనిచేసేరోజుల్లో తీసుకోవాల్సి ఉంటుంది. లబ్ధిదారులకు నగదు పంపిణీ సజావుగా జరిగేలా చూడాలని కేంద్ర హోంశాఖ కార్యదర్శి రాష్ట్రాలకు లేఖ రాశారు.

నగదు తీసుకొనే తేదీలు

| ఖాతాలోని చివరి అంకె | నగదు తీసుకొనే తేదీ |
|---|---|
| 0 లేదా 1 | 03.04.2020 |
| 2 లేదా 3 | 04.04.2020 |
| 4 లేదా 5 | 07.04.2020 |
| 6 లేదా 7 | 08.04.2020 |
| 8 లేదా 9 | 09.04.2020 |

## కరోనాను సమిష్టిగా ఎదుర్కొందాం

ప్రజలకు డీజీపీ మహేందర్‌రెడ్డి పిలుపు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా మహమ్మారిని తరిమికొట్టేందుకు ప్రజలంతా ఏకంకావాలని డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. లాక్‌డౌన్‌ను విజయవంతంగా పాటించడంలోనూ పోలీసులకు సహకరించాలని కోరారు. గురువారం డీజీపీ కార్యాలయం ఓ వీడియో సందేశాన్ని విడుదల చేసింది. మానవాళికి చాలెంజ్ విసిరిన కరోనాను ఓడించడంలో ప్రజలు అందిస్తున్న సహకారం మరువలేనిదని డీజీపీ పేర్కొన్నారు. సమాజంలో ఇలాంటి విపత్తును ఎదుర్కోవడంలో అందరి కృషి, చొరవ.. పోలీస్ సిబ్బందికి స్ఫూర్తిగా నిలుస్తున్నదని, మరింత ఉత్సాహంగా పోలీసులు పనిచేసేలా సహకరించాలని విజ్ఞప్తిచేశారు. లాక్‌డౌన్‌ను విజయవంతం చేయడంలో, కరోనా బాధితులను గుర్తించడంలో, వారి ద్వారా ఇతరులకు వైరస్ వ్యాప్తి చెందకుండా రాష్ట్ర పోలీసులు కృషి చేస్తున్నారని చెప్పారు. అందరూ నిర్ణీత దూరాన్ని తప్పక పాటించాలని డీజీపీ కోరారు.


ముఖ్యమంత్రి సహాయనిధి
meesevasupport@telangana.gov.in
ఖాతా నంబర్ : 62354157651
ఐఎఫ్ఎస్‌సీ కోడ్: ఎస్‌బీఐఎన్0020077
ఎస్‌బీఐ, సెక్రటేరియట్ బ్రాంచ్, హైదరాబాద్.
https://ts.meeseva.telangana.gov.in/covid/covidcontribution.htm
వాట్సాప్:
9121006471 /
9121006472



# ఐసీయూను మించి ఐసొలేషన్

కరోనా వైరస్ సోకిందని ఆందోళనతో కుంగిపోవద్దని, అవసరమైన వైద్యపరీక్షలు చేయించుకొని డాక్టర్ల సలహా మేరకు జాగ్రత్తలు తీసుకుంటే వైరస్ నుంచి బయటపడవచ్చని చెప్తున్నాడు వరంగల్ జిల్లాకు చెందిన యెన్నెంశెట్టి అఖిల్ (24). అధైర్యపడకుండా, మానసికంగా దృఢంగా ఉండాలని పేర్కొంటున్నాడు.

## గంట గంటకూ మందులు, వైద్యసేవలు

- ప్రతిరోజూ వేడి, బలవర్ధక ఆహారం పంపిణీ
- ఉచిత వైఫైతో ఆన్‌లైన్ తరగతులకు హాజరు..
- అధైర్యపడొద్దు.. మానసికంగా దృఢంగా ఉండాలి
- గాంధీ నుంచి డిశ్చార్జి అయిన కరోనా రోగి అనుభవాలు


గాంధీ నుంచి డిశ్చార్జి అయిన కరోనా రోగి అఖిల్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మార్చి 19న లండన్ నుంచి వచ్చిన అఖిల్ కరోనా పాజిటివ్ రావడంతో గాంధీలోని ఐసొలేషన్ వార్డులో 14 రోజులపాటు చికిత్స పొందాడు. చివరకు వైరస్ నెగెటివ్‌గా మారడంతో బుధవారం రాత్రి డిశ్చార్జి అయ్యాడు. చికిత్స అందిన విధానం, సౌకర్యాలు, రోగుల పట్ల తీసుకున్న జాగ్రత్తలపై తన అనుభవాలను పంచుకున్నాడు. 'కరోనా రోగులకు ఏర్పాటుచేసిన ఐసోలేషన్ వార్డులను మంచి ప్రమాణాలతో నిర్వహిస్తున్నారు. పేషెంట్లకు ఫోన్, వైఫై సౌకర్యం కల్పించారు. వార్డుల్లోని బడ్స్, బెడ్‌షీట్స్ ఎప్పటికప్పుడు మార్చుస్తున్నారు. పేషెంట్ల దగ్గరికి ఎవరినీ అనుమతించడం లేదు. ప్రతిరోజూ ఉదయం డ్రైఫ్రూట్స్ ఇవ్వడంతోపాటు, ప్యాకేజీ ఆహారాన్ని వేడి వేడిగా అందించారు. తాగునీరు ప్యాకింగ్ బాటిల్స్ ఇచ్చారు. గంటకోసారి మందులు, వైద్యసేవలు అందించారు. వైద్యులు పూర్తిస్థాయి రక్షణతో వైద్యం అందించారు. గుర్తుపట్టలేనంతగా డాక్టర్లు, సిబ్బంది జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వైఫై సౌకర్యం కల్పించడంతో కుటుంబసభ్యులు, స్నేహితులతో ఫోన్‌లో నిత్యం మాట్లాడుకునే అవకాశం కలిగింది. వైఫై ఉండటంతో విశ్వవిద్యాలయం నుంచి ఆన్‌లైన్ తరగతులను ఫాలో అయ్యాను. క్లింటన్ ఫౌండేషన్ ప్రాజెక్టు కూడా పూర్తిచేశా' అని పేర్కొన్నాడు.

### ఎయిర్‌పోర్టు నుంచే గాంధీ దవాఖానకు

లండన్‌లోని ఎడెన్‌బర్గ్ వర్సిటీలో మానవహక్కుల చట్టాలపై పీజీ చేస్తున్న అఖిల్ మాట్లాడుతూ.. 'ఇంగ్లాండ్‌లో కరోనా వైరస్ ప్రబలినప్పటికీ గుంపులుగా ఉంటే రోగనిరోధక శక్తి పెరుగుతుందన్న భావనతో లాక్‌డౌన్ విధించకుండా పబ్బులు, స్టేడియాలు, విశ్వవిద్యాలయాలు అన్ని యథేచ్ఛగా కొనసాగించారు. వైరస్ ఇంకా విజృంభించడంతో భారతీయ విద్యార్థులమంతా మాతృదేశానికి తిరిగి రావాలని చర్చించుకున్నాం. అదే సమయంలో మార్చి 18 నుంచి యూరప్, ఇంగ్లాండ్ దేశాల నుంచి విమానాల రాకపోకలను నిలిపివేస్తున్నట్టు మనదేశం ప్రకటించింది. ఎంతోప్రయత్నించగా మార్చి 17న నాకు ఒక టికెట్ బుక్కయింది. ఎవరినీ ముట్టుకోకుండా ప్రయాణం చేసి.. ఇండియా రాగానే కరోనా పరీక్షలు చేయించుకోవాలనుకున్నా. అమ్మనాన్నను, స్నేహితులను ఎయిర్‌పోర్టుకు రావద్దని సూచించా. 19న ఎయిర్‌పోర్టులో దిగగానే హెల్త్‌డెస్క్‌ను సంప్రదించి పరీక్షలు చేయించుకున్నా. ఆరోగ్యంగా ఉండటంతో నెగెటివ్ వస్తుందని భావించా. కానీ పాజిటివ్ వచ్చింది. వ్యక్తిగతంగా హోటల్‌లో గది తీసుకొని క్వారంటైన్ ఉందామనుకున్నప్పటికీ.. వైద్యుల సలహామేరకు గాంధీలో చికిత్స పొందా. 14 రోజుల తర్వాత నెగెటివ్ రావడంతో డిశ్చార్జి అయ్యా' అని తెలిపాడు.

# జీవంలేని మహమ్మారి!

## జీవకణాలను తాకితేనే కరోనాకు ప్రాణం

- తరచుగా గోరువెచ్చని నీరు తాగితే గొంతులోనే వైరస్ నిర్మూలన
- జన్యుకణాల్లో పరివర్తనతోనే ప్రమాదం
- ఆర్‌ఎన్‌ఏ సీక్వెన్స్ గుర్తిస్తే ఔషధం సాధ్యమే
- నమస్తే తెలంగాణతో సీసీఎంబీ మాజీ డైరెక్టర్ మోహన్‌రావు


సీసీఎంబీ మాజీ డైరెక్టర్ మోహన్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ నిర్జీవమైనదని, అది ఆహారం తీసుకోదు, విభజన చెందదు, పెరుగదని సీసీఎంబీ మాజీ డైరెక్టర్, ప్రముఖ శాస్త్రవేత్త సీహెచ్ మోహన్‌రావు చెప్పారు. అయితే అది ఏదైనా శరీరంలోకి వెళ్లగానే ప్రాణం పోసుకుంటుందని పేర్కొన్నారు. గోరువెచ్చని నీటిని తరచుగా తాగడం వల్ల గొంతులోనే వైరస్‌ను నిర్మూలించవచ్చని తెలిపారు. ఒకవేళ అది కడుపులోకి చేరినా కూడా అక్కడ ఉండే ఆమ్లాల వల్ల వెంటనే యాక్టివ్ కాబోదని వివరించారు. అధిక ఉష్ణోగ్రతల వల్ల వైరస్ వ్యాప్తి మందగిస్తుందని.. అయితే దీనికి ఎటువంటి శాస్త్రీయ ఆధారాలు లేవని ఆయన గురువారం 'నమస్తే తెలంగాణ'తో చెప్పారు. కరోనా పరీక్షలు చేసే కిట్లు సీసీఎంబీ వద్ద ఉన్నాయని తెలిపారు. ప్రైమర్స్‌ను ఉపయోగించి ఆర్టీపీసీఆర్ పరీక్ష ద్వారా ప్రాథమిక దశలోనే వైరస్‌ను గుర్తించవచ్చని చెప్పారు. చైనా, అమెరికా, ఇటలీ తదితర దేశాల్లోని వైరస్ ఆర్‌ఎన్‌ఏ సీక్వెన్స్‌కు, మన దేశంలోని వైరస్ ఆర్‌ఎన్‌ఏ సీక్వెన్స్‌కు మధ్యనున్న తేడాను గుర్తించాల్సి ఉందన్నారు. ఒకవేళ తేడా ఉంటే జీవకణాలను పెంచి వైరస్ వ్యాప్తిని అడ్డుకునే మందులను తయారుచేయవచ్చని మోహన్‌రావు వివరించారు.


### జన్యు పరివర్తనం వల్లే వైరస్ వ్యాప్తి..

'కరోనా కూడా అన్నిరకాల వైరస్‌వంటిదే. సాధారణంగా వైరస్‌లు జంతువుల్లో వుంటాయి. మనుషులకు వచ్చే అవకాశాలు తక్కువ. వైరస్‌లో జన్యు పరివర్తన వల్ల దాని లక్షణాలు మారుతాయి. అవి జీవకణాలను తాకగానే జీవం పొందుతాయి. అప్పుడు మనుషులకు వచ్చే అవకాశం ఉంటుంది. చైనాలో రకరకాల జంతువులు, పక్షులను వందల ఏండ్లుగా తింటున్నారు. ఇన్నేండ్లు వారికి వైరస్ సోకలేదు. ఇప్పుడు రావడానికి వైరస్‌లో జన్యు మార్పులే కారణం. అవి ఊపిరితిత్తుల్లోని టైప్-2 కణాలను తాకగానే ప్రమాదం ప్రారంభమవుతుంది. వెంటనే ఊపిరితిత్తుల సామర్థ్యం తగ్గుతుంది. ఆ తరువాత రక్తపీడనం తగ్గుతుంది, ఆపై గుండె సమస్యలు తలెత్తి చివరగా మల్టీ ఆర్గన్ ఫెయిల్ అయి రోగి చనిపోతాడు' అని మోహన్‌రావు వివరించారు.

## నిపుణుల మాట

### దేశంలో ఆందోళనకర పరిస్థితులు

'మొన్నటి వరకు మన దేశం కరోనా కట్టడిలో ముందుంది. వైరస్ బారినుంచి తప్పించుకుంటున్నట్లే భావించాం. లాక్‌డౌన్ వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని అనుకున్నాం. కానీ రెండు మూడు రోజులనుంచి జరుగుతున్న పరిణామాలు కొంత ఆందోళనకు గురిచేసేలా ఉన్నాయి. ప్రజలు కచ్చితంగా నిర్ణీత దూరం పాటిస్తూ అన్ని జాగ్రత్తలు తీసుకుంటే మనం పెను ప్రమాదం నుంచి తప్పించుకోవటం సాధ్యమవుతుంది' అని ఆయన చెప్పారు.




# కదం కదం కదనం

మొదటిపేజీ తరువాయి...

చేయించడం, అందుకు ఏర్పాట్లు చేయడం. 2. విదేశాల నుంచి వచ్చే కరోనా వాహకుల ద్వారా స్థానికులకు వైరస్ సోకకుండా కట్టడిచేయడం. 3. వైరస్ పట్ల తెలంగాణ ప్రజల్లో చైతన్యం తెచ్చి వారికై వారు లాక్‌డౌన్ వంటి చర్యలు తీసుకోవడం 4. లాక్‌డౌన్ వల్ల ఇబ్బందులకు గురయ్యే వర్గాలకు నిత్యావసరాల వంటి సదుపాయాలు కల్పించి సమాజంలో అశాంతి తలెత్తకుండా చూడడం. వ్యాధి తీవ్రతను ముందే గుర్తించి, పకడ్బందీ వ్యూహం రచించడం వల్లే దేశంలో లాక్‌డౌన్ ప్రకటించిన తొలి రాష్ట్రం తెలంగాణ అయింది. పేదలు ఇబ్బంది పడకుండా రేషన్ సరకులు, నగదు సాయం ప్రకటించిన తొలి రాష్ట్రం తెలంగాణ అయింది. చివరికి ఢిల్లీలో కరోనా కేంద్రంగా మారిన నిజాముద్దీన్ గురించి కేంద్రాన్ని మొట్టమొదట అప్రమత్తం చేసింది తెలంగాణనే. దేశమంతా వలస కూలీలు స్వస్థలాలకు పయనమవగా, ఆ దృశ్యం కనిపించని ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ. స్థానికుల్లాగే వలస కూలీలకు కూడా నిత్యావసరాలు, నగదు అందించి తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచింది. కరోనాపై పోరులో సీఎం కేసీఆర్ తన క్యాంప్ ఆఫీసు ప్రగతిభవన్‌నే వార్‌రూంగా మార్చివేశారు. ఆయన ప్రధానంగా మూడు అంశాల ఆధారంగా పనిచేస్తున్నారు. 1.అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో కరోనా తీవ్రతను అంచనా వేస్తూ, వెన్వెంటనే తగిన నిర్ణయాలు తీసుకోవడం. ఆ మేరకు వివిధ విభాగాలను సమాయత్తంచేయడం. కరోనాపై పోరులో పాల్గొంటున్న ప్రభుత్వ సిబ్బందికి భరోసా కల్పించడం. 2. పరిస్థితిని ఎప్పటికప్పుడు మీడియా ద్వారా ప్రజలకు వివరిస్తూ వారిలో అవగాహన కల్పించడం. వైరస్ సామూహిక వ్యాప్తి జరగకుండా వివిధ సామాజిక వర్గాలతో స్వయంగా సమావేశమై, ఎట్టి పరిస్థితుల్లోనూ గుమి కూడవద్దని ఒప్పించడం. 3. ప్రజాప్రతినిధులను, అధికారులను క్షేత్ర స్థాయిలో పనిచేయిస్తూ ప్రజల్లో విశ్వాసాన్ని పెంచడం. 4. కేంద్రంతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవడం.

సీఎం అనుసరిస్తున్న నాలుగంచెల వ్యూహం వల్ల రాష్ట్రంలోని అన్ని సామాజిక , ప్రభుత్వ విభాగాలు వాటికి శక్తికి మించి పని చేస్తూ, ఆశించిన ఫలితాలు సాధిస్తున్నాయి. వైద్యఆరోగ్యశాఖ, పోలీసు, పారిశుద్ధ్యం, వ్యవసాయం, పురపాలక, పంచాయతీరాజ్.. ఇలా ఒకటేమిటి.. ఇప్పుడు ప్రభుత్వ విభాగాలన్నీ కరోనాపై యుద్ధంలో మునిగి ఉన్నాయి. సకాలంలో స్పందించి పకడ్బందీగా వ్యూహరచన చేయడం, ప్రజలను ఒప్పించి వారి సహకారం పొందడం వల్లే రాష్ట్రంలో కరోనా వ్యాప్తి తక్కువగా ఉందని నిపుణులు ప్రశంసిస్తున్నారు. నిజాముద్దీన్ ప్రార్థనల ఘటన కనుక లేకపోతే కరోనా బాధితుల సంఖ్య చాలా తక్కువగా ఉండేదని, మరణాలకు ఆస్కారమే ఉండకపోయేదని వారు పేర్కొంటున్నారు. కరోనాపై పోరాటంలో ముఖ్యమంత్రితో పాటు తెలంగాణ ప్రభుత్వంలో పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు కీలక పాత్ర పోషిస్తున్నారు.

### కే తారకరామారావు

కరోనా వార్‌లో అత్యంత కీలకమైన పాత్ర నిర్వహిస్తున్న పురపాలక, ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కే తారకరామారావు.. సహజంగానే రోజూ 14 గంటలు పనిచేస్తారు. హైదరాబాద్ కేంద్రంగా పనిచేయాలన్న ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఇప్పుడు 16 గంటలు పనిచేస్తున్నారు. కరోనాకు సంబంధించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఏం జరుగుతుందనే విషయాలపై క్రమం తప్పకుండా ఫాలో అవుతున్నారు. వైద్యశాలల్లో అవసరమైన వెంటిలేటర్లకోసం డీఆర్డీవోతో మాట్లాడుతున్నారు. ట్విట్టర్లో ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి పరిష్కారంచూపిస్తున్నారు. అధికారులతో సమావేశం కావడంతోపాటు క్షేత్రస్థాయిలో పర్యటనలకు వెళ్తున్నారు. లాక్‌డౌన్ అమలును పర్యవేక్షిస్తున్నారు. ప్రజలతో నేరుగా మాట్లాడుతున్నారు. వారి బాగోగులను ఆరాతీస్తున్నారు. మేయర్లు, మున్సిపల్ కమిషనర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్లతో ప్రతిరోజూ మాట్లాడుతారు. నగరాలు, పట్టణాల్లో శానిటేషన్ పక్కాగా జరిగేలా చూస్తున్నారు. పారిశ్రామిక వర్గాలు, భవన నిర్మాణ రంగ ప్రతినిధులతో చర్చించి కార్మికుల ఉపాధి కోల్పోకుండా, వేతనాలు సక్రమంగా ఇచ్చేవిధంగా చర్యలు తీసుకొంటారు. లాక్‌డౌన్ పక్కాగా అమలయ్యేలా సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు పనిచేస్తున్నారు.

### సోమేశ్‌కుమార్

రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి సోమేశ్‌కుమార్ ప్రతిరోజు తెల్లవారుజామునే మొత్తం సమాచారం తెప్పించుకొని సీఎంకు ఫోన్‌లోనే పరిస్థితిని వివరిస్తున్నారు. సీఎం ఆదేశాలమేరకు జిల్లా కలెక్టర్లు, శాఖల కార్యదర్శులకు సూచనలుచేస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. సీఎం నిర్వహించే సమీక్ష సమావేశాలకు వెళ్లడం, ఆ సమావేశాల్లో తీసుకొన్న నిర్ణయాల మేరకు ఉత్తర్వులు జారీచేస్తున్నారు. వలసకూలీలు ఎంతమంది ఉన్నారో లెక్క కావాలంటే ఒక్క రోజులో సర్వే చేయించి లెక్కలు అందజేశారు.

### కంట్రోల్‌రూం

సచివాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్‌రూం 24 గంటలూ పనిచేస్తున్నది. దీనిలో ఇద్దరు సీనియర్ ఐఏఎస్ అధికారులు 24 గంటలు డ్యూటీ చేస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఒకరు, రాత్రి 8 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు మరో అధికారి కంట్రోల్‌రూంలో ఉంటున్నారు. వీరికి షిఫ్ట్‌లవారీగా ఓ ఐఏఎస్ అధికారి, ఓ ఐపీఎస్ అధికారితో మరో గెజిటెడ్ అధికారి సహకరిస్తున్నారు. ఈ కంట్రోల్ రూంకు ఫోన్‌చేస్తే సమస్యను తెలుసుకొని వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేసి, పరిష్కారమయ్యేలాచూస్తున్నారు.

### పద్మవ్యూహం

కరోనాపై యుద్ధంచేయడంలో వైద్యారోగ్యశాఖ కీలకంగా పనిచేస్తున్నది. ఈ శాఖకు కార్యదర్శి, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ), డైరెక్టర్ ఆఫ్ హెల్త్ (డీహెచ్)లు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇటు సీఎంతో సమావేశాలు, అటు మంత్రితో చర్చలు.. ఇటు కింది స్థాయి అధికారులకు ఆదేశాలు.. మరోవంక ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుని.. విశ్లేషించి పైస్థాయికి తీసుకుపోవడం, వ్యాధి ప్రభావాన్ని అంచనావేసి.. అరికట్టేందుకు వైద్యపరంగా ఎలాంటి చర్యలు తీసుకోవాలో సీఎం స్థాయిలో విశ్లేషించడం.. అక్కడి నుంచి వచ్చిన ఆదేశాలను అమలుచేయడంవంటి కీలకమైన బాధ్యతలను వీరు చూస్తున్నారు.

### ఈటల రాజేందర్

కరోనా నియంత్రణలో వైద్యారోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ ముఖ్య భూమిక నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి మార్గదర్శనంలో ఎప్పటికప్పుడు సీఎం ఆదేశాలమేరకు నిర్ణయాలను అమలుచేస్తున్నారు. ఉదయం ఆరు గంటలనుంచే వైద్యాధికారులతో మాట్లాడటం.. తగిన సూచనలు ఇచ్చి.. ఆరోజు పరిస్థితిని సీఎం కేసీఆర్‌కు నివేదించి.. ఆయన ఆదేశాల మేరకు కార్యాచరణ పాటిస్తున్నారు.

### నిరంజన్‌రెడ్డి

వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెల్లవారుజామునే తన పని మొదలుపెడుతున్నారు. లాక్‌డౌన్ ఉన్న నేపథ్యంలో ప్రజలకు నిత్యావసర సరుకులు, కూరగాయలు, పండ్లు తదితరాల సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ధాన్యం సేకరణ మొత్తం ప్రభుత్వమేచేయాలని నిర్ణయించిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ యంత్రాగాన్ని సిద్ధంచేస్తున్నారు. ఓవైపు జిల్లాల పర్యటనలు చేస్తూనే, నిత్యం సీఎంకు అందుబాటులో ఉంటున్నారు.

### మహేందర్‌రెడ్డి

డీజీపీ మహేందర్‌రెడ్డి ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల ఆధారంగా క్షేత్రస్థాయిలోపోలీస్ సిబ్బందికి సూచనలు ఇస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను సీఎం దృష్టికి తీసుకువెళుతున్నారు. కరోనా కట్టడిపై సీఎం నిర్వహించే సమీక్ష సమావేశాలకు హాజరుకావడం, ఆయన ఇచ్చే ఆదేశాలు తూచ తప్పకుండా క్షేత్రస్థాయిలో అమలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు.

# ఫోర్బ్స్ లిస్టులో మనపిల్లలు

మొదటిపేజీ తరువాయి...

ఈ-కామర్స్, ఎంటర్‌ప్రైజెస్ టెక్నాలజీ, పరిశ్రమలు, మ్యానుఫాక్చరింగ్, ఎనర్జీ, హెల్త్‌కేర్ అండ్ సైన్స్, సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్స్ అండ్ కన్స్యూమర్ టెక్నాలజీ రంగాల్లో ఒక్కో క్యాటగిరీ నుంచి 30 మంది చొప్పున ఈ జాబితాకు ఎంపికచేశారు. దేశవ్యాప్తంగా 69 మందికి ఈ జాబితాలో చోటు లభించింది. వీరిలో ఐదుగురు హైదరాబాద్ యువకులుండటం విశేషం. భారత్ తర్వాత ఈ జాబితాలో చైనా (41 మంది), జపాన్ (31 మంది) వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. ఈ జాబితాలో హైదరాబాద్ నుంచి చోటు దక్కించుకొన్న ప్రేమ్‌కుమార్ విస్లవత్ (మారుట్ డ్రోన్స్), అశ్విన్ మోచర్ల (ది థిక్ షేక్ ఫ్యాక్టరీ), సందీప్ బొమ్మి (యాడ్ ఆన్ మో), విహారి కనుకొల్లు (అర్బన్ కిసాన్), పవన్‌కుమార్ చందన (స్కైరూట్ ఏరోస్పేస్) వేర్వేరు రకాల స్టార్టప్‌లను స్థాపించి అత్యుత్తమ ప్రతిభను కనబరచడంతోపాటు పెట్టుబడిదారుల విశ్వాసాన్ని చూరగొన్నారు. టీహబ్ సహాయ సహకారాలతో ప్రారంభమైన ఈ స్టార్టప్‌లకు ఇప్పటికే ఫండింగ్‌తోపాటు అనేక అవార్డులూ లభించాయి.

### మంత్రి కేటీఆర్ అభినందనలు

ఈ ఐదుగురు యువకులకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అభినందనలు తెలిపారు. ఆసియా ఖండంలో అత్యంత ప్రతిభావంతులుగా 'ఫోర్బ్స్' గుర్తించిన 30 మంది 30 ఏండ్లలోపు యువకుల్లో హైదరాబాద్‌కు చెందినవారు ఐదురుగు ఉండటం అత్యంత హర్షదాయకమన్నారు. వీరంతా భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రస్తుత తరం యువత తమ ఆలోచనలకు అనుగుణంగా వినూత్న మార్గాల్లో సాగుతూ అద్భుత ఆవిష్కరణలతో దూసుకెళ్తున్నారని ట్విట్టర్ ద్వారా సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వపరంగా సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటామన్నారు. టీహబ్, వీహబ్ చేపడుతున్న వినూత్న కార్యక్రమాలతో హైదరాబాద్‌లో స్టార్టప్ ఎకోసిస్టంను బలోపేతంచేసేందుకు వీలుకలిగిందని, భవిష్యత్తులోనూ ఈ రంగంలో ఆలోచనలను, ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లవేళలా కృషిచేస్తుందని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు.

### దేశంలోనే తొలిసారి

ప్రేమ్‌కుమార్ విస్లవత్ (29) నేతృత్వంలో సూరజ్ పెద్ది (28), సాయికుమార్ చింతల (28) బృందం మారుట్ డ్రోన్స్ సంస్థ స్థాపించి దేశంలోనే తొలిసారి డ్రోన్ టెక్నాలజీని అభివృద్ధిచేశారు. చెరువుల్లో దోమల లార్వాలను నిర్మూలించేందుకు డ్రోన్లను తయారుచేశారు. డ్రోన్లలోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీతో దోమ జాతులను, లార్వాల సంఖ్యను గుర్తించే వీలుంది. మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా వంటి వ్యాధుల వ్యాప్తిని గుర్తించగలిగే ఈ డ్రోన్‌తో రోజుకు 6.7 హెక్టార్లను కవర్ చేయవచ్చు. ఈ విధంగా 'మారుట్' సంస్థ ఇప్పటివరకు హైదరాబాద్‌లో 4,230 హెక్టార్లను కవర్ చేసింది.

### సామాజిక సమస్యల పరిష్కారమే లక్ష్యం

సామాజిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా డ్రోన్ టెక్నాలజీని అభివృద్ధిచేశాం. ఇండస్ట్రీ, మ్యానుఫాక్చరింగ్, ఎనర్జీ క్యాటగిరీలో ఫోర్బ్స్ '30 అండర్ 30 ఆసియా' మేం చోటుదక్కించుకోవడం గర్వకారణం. ఈ స్ఫూర్తితో కరోనా నేపథ్యంలో కాంటాక్ట్‌లెస్ డెలివరీ టెక్నాలజీ, క్రిమిసంహారక మందుల స్ప్రేయింగ్ టెక్నాలజీ అభివృద్ధి చేస్తున్నాం.

**- ప్రేమ్‌కుమార్, మారుట్ డ్రోన్స్ సీఈవో**



### 70 లక్షల మందికి చేరువ

అశ్విన్ మోచెర్ల (29) 2013లో థిక్ షేక్ ఫ్యాక్టరీని ప్రారంభించారు. ఇది ఒక ప్రత్యేకమైన పాల రిటెయిలర్. స్థాపించిన నాటి నుంచి ఇప్పటివరకు 125 ఔట్‌లెట్ల ద్వారా దేశవ్యాప్తంగా 70 లక్షల మంది వినియోగదారులకు సేవలందించారు. ఈ ఏడాది పెప్సికో ఇమేజెస్ ఫుడ్ సర్వీస్ నుంచి 'మోస్ట్ అడ్మయిర్ చైన్ ఆఫ్ ద ఇయర్: కేఫ్స్ అండ్ జూస్ బార్స్'అవార్డును, గతేడాది 'క్యూఎస్ఆర్(క్విక్ సర్వీస్ రెస్టారెంట్)అవార్డు'ను గెలుపొందారు.

### ఉద్యోగుల సహకారంతోనే సాధ్యమైంది

ఈ విజయానికి కృషిచేసిన వారందరికీ కృతజ్ఞతలు. మా సోదరుడు, ఉద్యోగుల సహకారంతోనే ఇది సాధ్యమైంది. గతేడాది రూ.55 కోట్ల టర్నోవర్ సాధించాం. కష్టపడుతున్నామని తెలియకుండా పనిచేసుకోవాలంటే ఇష్టమైన రంగంపై దృష్టిసారించాలి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభంతోపాటు, ఆరోగ్యపరంగా కూడా సంక్షోభం ఏర్పడింది. అందుకే ప్రతిఒక్కరూ కఠినంగా ఉండాల్సిన అవసరం ఉన్నది.

**- అశ్విన్ మోచెర్ల, థిక్ షేక్ ఫ్యాక్టరీ సహ వ్యవస్థాపకుడు**

### కొత్త రకం అడ్వర్టయిజింగ్...



కార్లు, బస్సులపై డిజిటల్ స్క్రీన్లు అమర్చి వాటి ద్వారా అడ్వర్టయిజింగ్ చేసేందుకు సందీప్ బొమ్మినేని (27) యాడ్ ఆన్ మో స్టార్టప్‌ను ప్రారంభించారు. సమయం, ప్రాంతాల ఆధారంగా ఈ యాడ్‌లుంటాయి. ఇటీవల ఈ స్టార్టప్ 3 మిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించింది.

### ప్రజలకు ఉపయోగపడేలా

డిజిటల్ యాడ్‌లు కేవలం వాణిజ్య అవసరాలకే కాకుండా ప్రజలకు ఉపయోగపడేలా కృషిచేస్తున్నాం. హ్యాక్ ఐ అడ్వర్టయిజ్‌మెంట్‌ను కూడా యాడ్ ఆన్ మో ద్వారానే ప్రజలకు చేరవేశాం. ప్రజలకు ఉపయోగపడే ట్రాఫిక్ అప్‌డేట్‌తోపాటు ప్రస్తుతం ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనాపై కూడా యాడ్ ఇవ్వాలని ప్లాన్ చేస్తున్నాం. ఫోర్బ్స్ అవార్డు రావడం మా కంపెనీలోని ప్రతిఒక్కరి కృషి ఫలితమే.

**- సందీప్ బొమ్మిరెడ్డి, 'యాడ్ ఆన్ మో' సహ వ్యవస్థాపకుడు**

### ఉపగ్రహాలను మోసుకెళ్లే రాకెట్ల తయారీ

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)లో సిస్టమ్స్ ఇంజినీర్‌గా పనిచేసిన పవన్‌కుమార్ చందన (29) స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థను స్థాపించి ఉపగ్రహాలను మోసుకెళ్లే రాకెట్లను తయారుచేస్తున్నారు. దేశంలో ఇలాంటి మొదటి ప్రైవేట్ కంపెనీ ఇదే. 2021లో తమ తొలి రాకెట్‌ను ప్రయోగించి వాణిజ్య ఉపగ్రహాలను అంతరిక్షంలోకి తీసుకెళ్లే దిశగా స్కైరూట్ ఏరోస్పేస్ కృషిచేస్తున్నది.

### భవిష్యత్‌కు మంచి ప్రోత్సాహం



పారిశ్రామికవేత్తగా నా ప్రయాణంలో ఎంతో త్వరగా ఫోర్బ్స్ జాబితాలో చోటు లభించినట్లుగా భావిస్తున్నా. ఈ గుర్తింపుతో మరింత కృషిచేసేందుకు ప్రోత్సాహం లభిస్తుంది. వాణిజ్య ఉపగ్రహాలను అంతరిక్షంలోకి తీసుకెళ్లే రాకెట్లను అభివృద్ధిచేస్తున్నాం. రానున్న 18 నెలల్లోగా మా సబ్‌సిస్టమ్‌లను పరీక్షించి 2021 చివరినాటికి రాకెట్లను ప్రయోగిస్తాం. ఇందులో 50 శాతం పని తెలంగాణలో, మిగిలిన పని మహారాష్ట్రలో చేస్తున్నాం.

**- పవన్‌కుమార్, స్కైరూట్ ఏరో స్పేస్ సీఈవో**

### భూమి లేకుండా సాగు

విహారి కనుకొల్లు (26) 2017లో అర్బన్ కిసాన్ సంస్థను స్థాపించి సేంద్రియ ఉత్పత్తుల పెంపకానికి ఇండోర్ వర్టికల్ ఫామ్స్‌ను అభివృద్ధి చేశారు. ఈ విధానంలో భూమి అవసరంలేకుండా నీటిలోని ఖనిజాల ద్వారా మొక్కలను పెంచుతారు. సంప్రదాయ సాగులో వినియోగించే నీటి కంటే 95 శాతం తక్కువ నీటిని వినియోగించి 30 రెట్ల అధిక దిగుబడి సాధించడం దీని ప్రత్యేకత. అర్బన్ కిసాన్ స్టార్టప్ ఇటీవల 'వై కాంబినేటర్స్ వింటర్- 2020'బ్యాచ్‌కు ఎంపికైంది. దీని ద్వారా 10 లక్షల డాలర్ల ఆదాయం సమకూరుతున్నది.

### నా కల సాకారమైంది..



ఫోర్బ్స్ జాబితాలో చోటు దక్కించుకోవాలన్న చిన్ననాటి కల నెరవేరినందుకు ఎంతో సంతోషంగా ఉన్నది. మరిన్ని లక్ష్యాల సాధనకు ఇది ప్రేరణగా నిలుస్తుంది. ఆదరణ కోల్పోతున్న వ్యవసాయ రంగాన్ని అప్‌గ్రేడ్ చేసేందుకు కృషిచేస్తున్నాం. హైదరాబాద్‌లో మాకు 15 ఫామ్‌లున్నాయి. స్వచ్ఛమైన ఉత్పత్తులు కావాలనుకునేవారితోపాటు రైతులతో అనుసంధానం చేసుకొని దిగుబడిని, ఆదాయాన్ని పెంచుకొనేలా వారికి అవగాహన కల్పిస్తాం.

**- విహారి కనుకొల్లు, అర్బన్ కిసాన్ సహ వ్యవస్థాపకుడు**

లాక్‌డౌన్-డే 11

| | హైదరాబాద్ | ముంబై | ఢిల్లీ |
|---|---|---|---|
| పెట్రోల్ | రూ. 73.97 | రూ. 75.30 | రూ. 69.59 |
| డీజిల్ | రూ. 67.82 | రూ. 65.21 | రూ. 62.29 |

# భారత్@2500

- ఒక్కరోజే 556 కొత్త కేసులు, 17 మంది కరోనాకు బలి
- మహారాష్ట్రలో 400దాటిన కేసులు

**న్యూఢిల్లీ:** కరోనా మహమ్మారి దేశంలో వేగంగా విజృంభిస్తున్నది. గురువారం ఒక్కరోజే 556 కొత్త కేసులు, 17 మరణాలు నమోదయ్యాయి. దీంతో కేసుల సంఖ్య 2,507కు చేరిందని, మృతుల సంఖ్య 76కు పెరిగినట్టు కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. ఢిల్లీలోని తబ్లిగీ జమాత్‌కు హాజరైన వారి ద్వారా దేశవ్యాప్తంగా 500 మందికిపైగా వైరస్ వ్యాపించినట్లు పేర్కొన్నది. ఆ కార్యక్రమంలో పాల్గొన్నవారి గుర్తింపు, నిర్ధారణ పరీక్షలు, వ్యాప్తి నిరోధక చర్యలపై యుద్ధప్రాతిపదికన స్పందించాలని కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని రాష్ట్రాల ముఖ్యకార్యదర్శులు, డీజీపీలకు సూచించినట్లు కేంద్ర ఆరోగ్యశాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ తెలిపారు. మహారాష్ట్రలో కరోనా కేసులు 400 దాటాయి. కొత్తగా 81 కేసులు నమోదయ్యాయి. ఢిల్లీ సహా తెలంగాణ, తమిళనాడు, ఏపీ, తదితర రాష్ట్రాల్లో తబ్లిగీ జమాత్ ప్రభావం స్పష్టం కనిపించింది. మరింత మందికి పరీక్షలు నిర్వహిస్తుండటంతో కేసుల సంఖ్య పెరిగే అవకాశమున్నది. రూ. 1.5 కోట్ల విలువైన వ్యక్తిగత రక్షణ పరికరాలకు ఆర్డర్ ఇచ్చామని, వీటి సరఫరా మొదలైందని లవ్ అగర్వాల్ తెలిపారు. దేశీయంగా ఎన్-95 మాస్కుల తయారీ ఊపందుకుందన్నారు. వైద్యుల్లో కొందరికి వైరస్ సోకడంతో దవాఖానల్లో వైరస్ నియంత్రణ చర్యలను కచ్చితంగా పాటించాలని అధికారులు సూచించినట్లు వివరించారు. మరోవైపు ఎయిరిండియా విమానయాన సంస్థకు చెందిన ఎయిర్‌హోస్టెస్‌కు కరోనా సోకినట్టు తేలింది. ఆమె గతనెల 20న న్యూయార్క్ నుంచి ముంబైకి వచ్చిన విమానంలో సేవలు అందించారు. ప్రస్తుతం ఆమెకు చికిత్స అందిస్తున్నారు.



కరోనా విజృంభణ నేపథ్యంలో భారత ప్రభుత్వం మాల్దీవులుకు 6.2 టన్నుల అత్యవసర ఔషధాలను పంపింది. ఆపరేషన్ సంజీవినిలో భాగంగా గురువారం వాయుసేన విమానంలో వీటిని తీసుకెళ్లారు

**సీఆర్పీఎఫ్ వైద్యాధికారికి కరోనా**

ఢిల్లీకి చెందిన సీఆర్పీఎఫ్ వైద్యాధికారికి కరోనా పాజిటివ్ అని తేలింది. సీఆర్‌పీఎఫ్‌కు చెందిన ఏడీజీ కార్యాలయంలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ హోదాలో పనిచేస్తున్న అతనికి హర్యానాలోని ఝుజ్జర్‌లో ఉన్న ఎయిమ్స్‌లో చికిత్స అందిస్తున్నారు. అతనుండే దక్షిణ ఢిల్లీ సాకేత్ ప్రాంతంలోని సీఆర్పీఎఫ్ ట్రాన్సిట్ మెస్‌ను ప్రస్తుతం దిగ్బంధంలో ఉంచారు.

**లాక్‌డౌన్ తర్వాతే అంతర్జాతీయ విమానాలు**

లాక్‌డౌన్ ఈ నెల 15న ముగిసిన తర్వాత అంతర్జాతీయ విమానాలకు అనుమతిస్తామని కేంద్ర ప్రభుత్వం గురువారం తెలిపింది. పౌర విమానయానశాఖ మంత్రి హర్దీప్ సింగ్‌పురి మాట్లాడుతూ.. విదేశాల్లో ఉన్న భారతీయులు దేశంలోకి రావడానికి లాక్‌డౌన్ ముగిసేవరకు వేచి ఉండాలని తెలిపారు.

## అదుపుతప్పిన ఆగ్రహం.. రెండునెలలు జైలుశిక్ష

*సింగపూర్:* కరోనా.. కరోనా అని అరుస్తూ హోటల్లో ఉమ్మినందుకు సింగపూర్‌లో భారత సంతతి వ్యక్తి జస్వీందర్ సింగ్‌కు రెండు నెలల జైలు శిక్ష పడింది. జస్వీందర్ సింగ్ గత నెల 3న ఓ రెస్టారెంట్‌కు వెళ్లాడు. ఆహారం కావాలని వెయిటర్‌కు చెప్పాడు. హోటల్ మూసివేశామని వెయిటర్ సమాధానమివ్వటంతో తీవ్ర ఆగ్రహానికి గురైన జస్వీందర్ ఒక ప్లేట్‌ను తీసుకొని నేలకేసి కొట్టాడు. అనంతరం ఉమ్ముతూ కరోనా.. కరోనా అని అరిచాడు. హోటల్ యాజమాన్యం ఫిర్యాదుతో పోలీసులు అరెస్టు చేశారు. కోర్టు రెండు నెలల జైలు శిక్ష విధించింది.




## 'కరోనా' హెచ్చరిక కోసం ఆరోగ్యసేతు

*న్యూఢిల్లీ:* కరోనా వైరస్ సోకిన వ్యక్తి సమీపిస్తే అప్రమత్తం చేసే మొబైల్ యాప్‌ను కేంద్రప్రభుత్వం ప్రారంభించింది. దీనికి ఆరోగ్యసేతు అని పేరు పెట్టింది. కరోనా పాజిటివ్ వ్యక్తుల ఫోన్ నంబర్ల ఆధారంగా వారి కదలికలను పరిశీలిస్తూ ఈ యాప్ పని చేస్తుంది. ఆ వ్యక్తులకు సమీపంలో ఉన్నవారిని హెచ్చరించేలా దీనిలో తగిన ఏర్పాట్లు చేశారు.

# ఏపీలో 143 కేసులు

**గురువారం ఒక్కరోజే 32 మందికి కరోనా పాజిటివ్**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్‌లో కరోనా కేసులు రెండు రోజుల నుంచి వేగంగా పెరిగిపోతున్నాయి. ఢిల్లీలోని నిజాముద్దీన్ మత కార్యక్రమానికి హాజరై తిరిగి రాష్ట్రానికి వచ్చిన వాళ్లతో వైరస్ వేగంగా వ్యాప్తిచెందుతుండటంతో కేసుల సంఖ్య పెరిగిపోతున్నది. బుధవారం వరకు 111 పాజిటివ్ కేసులు ఉండగా.. ఈ సంఖ్య గురువారం నాటికి 143కి చేరింది. గురువారం ఒక్కరోజే 32 పాజిటివ్ కేసులు నమోదయ్యాయని అధికారులు వెల్లడించారు. ఢిల్లీకి మత ప్రార్థనల కోసం వెళ్లి వచ్చిన వారి కుటుంబాలను క్వారంటైన్‌కు తరలించామని, ఇప్పటి వరకు 1800 మంది నమూనాలను పరీక్షించగా.. 1321 మందికి నెగిటివ్‌గా నిర్ధారణ అయ్యిందని తెలిపారు. 409 మంది పరీక్షల ఫలితాల కోసం ఎదురుచూస్తున్నామన్నారు. మరోవైపు గుంటూరులోకరోనా కేసులు వెలుగుచూడటంతో దాదాపు 3 కిలోమీటర్ల పరిధితోపాటు మంగళగిరిని కూడా రెడ్‌జోన్‌గా ప్రకటించారు.



విజయవాడలో సిద్ధమవుతున్న రైలు ఐసొలేషన్ వార్డులు

**21 మంది ఆచూకీ లేదు**

ఢిల్లీ మత ప్రార్థనలకు వెళ్లి వచ్చిన వారిలో ఇంకా 21 మంది ఆచూకీ లభించలేదని ఏపీ ప్రభుత్వం వెల్లడించింది. వారి కోసం తీవ్రంగా గాలిస్తున్నామని తెలిపింది. హిందూపురానికి చెందిన ఒక మహిళ బెంగళూరులో ఇటీవల కరోనాతో మృతిచెందారు. ఆమె కోడలు, మనుమరాలికి కూడా వైరస్ సోకినట్లు తేలింది. ఆ మహిళ కుటుంబంలో ఒకరు ఢిల్లీ మత ప్రార్థనలకు వెళ్లి వచ్చినట్లు తెలుస్తున్నది. దీంతో అనంతపురం నుంచి ఎంతమంది బెంగళూరు వెళ్లారనే దానిపై కూడా అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

# 960 వీసాలు రద్దు

మొదటిపేజీ తరువాయి...

వారిని క్వారంటైన్‌లో ఉంచినట్లు కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి పుణ్యసలిల శ్రీవాస్తవ తెలిపారు. ఇందులో 1,306 మంది విదేశీయులు ఉన్నట్లు తెలిపారు. ఢిల్లీలోని 2000 మంది జమాత్ సభ్యుల్లో 1,804 మందిని క్వారంటైన్‌కు తరలించామని, వైరస్ లక్షణాలున్న 334 మందిని దవాఖానల్లో చేర్చామని ఆమె వివరించారు. వైరస్ వ్యాప్తిపై తప్పుడు వార్తలు, వదంతుల నియంత్రణకు కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఓ ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. వార్తల్లోని వాస్తవాలను గుర్తించే ఫ్యాక్ట్ చెక్ యూనిట్ (ఎఫ్‌సీయూ) గురువారం నుంచి అందుబాటులోకి వచ్చిందని, ప్రజలు pibfactcheck@gmail.comకు మెయిల్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు. రాష్ట్రాల స్థాయిల్లోనూ ఇలాంటి వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించామన్నారు.

**స్వీయనిర్బంధంలో ఉన్నా: జమాత్ నేత**

వైద్యుల సలహా మేరకు తాను స్వీయ క్వారంటైన్‌లో ఉన్నట్లు తబ్లిగీ జమాత్ నేత మౌలానా సాద్ కంధల్వి తెలిపారు. ఈ సంక్షోభ సమయంలో ప్రభుత్వానికి సహాయ సహకారాలను అందించాలని, అధికారులు, వైద్యుల సూచనలు పాటించాలని జమాత్ సభ్యులకు పిలుపునిచ్చారు. ఈ జాగ్రత్త చర్యలు మత విశ్వాసాలకు ఏ మాత్రం వ్యతిరేకం కాదన్నారు. మానవుల పాపాల వల్లే మహమ్మారి వచ్చిందన్న సాద్, విముక్తి, మానవ జాతి రక్షణ కోసం అల్లాను ప్రార్థించాలని వారికి సూచించారు. ఈ మేరకు ఓ ఆడియో సందేశాన్ని విడుదల చేశారు.

**నిజాముద్దీన్ ప్రాంతంలో శుద్ధి చర్యలు**

నిజాముద్దీన్ ప్రాంతంలో వైరస్ నిర్మూలన చర్యలను ఢిల్లీ ఫైర్ సర్వీస్ (డీఎఫ్‌ఎస్) చేపట్టింది. ఆ ప్రాంతంలో 20 వేల లీటర్ల రసాయన మందును పిచికారి చేసినట్లు డీఎఫ్‌ఎస్ డైరెక్టర్ అతుల్ గార్గ్ తెలిపారు.

# 10లక్షలకు చేరువలో..

- వారంలోనే రెట్టింపయిన కరోనా కేసులు.. 50 వేలుదాటిన మృతులు
- డబ్ల్యూహెచ్‌వో ఆందోళన

**జెనీవా:** ప్రపంచవ్యాప్తంగా కరోనా మహమ్మారి వ్యాప్తి తీవ్రతపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఆందోళన వ్యక్తం చేసింది. వారం రోజుల్లో మృతుల సంఖ్య రెట్టింపు అవుతుండటం కలవరపరుస్తున్నదని డబ్ల్యూహెచ్‌వో అధిపతి టెడ్రోస్ అధనామ్ గ్రేబియేసస్ తెలిపారు. వైరస్ కేసులు పది లక్షలకు, మరణాలు 50 వేలు దాటడం వ్యాప్తి తీవ్రతను తెలియజేస్తున్నదన్నారు. 'కొవిడ్-19 వ్యాప్తి ఆరంభం నుంచి నాలుగో నెలలోకి ప్రవేశించాం. ప్రపంచవ్యాప్తంగా వైరస్ శరవేగంతో విజృంభించడం ఆందోళన కలిగిస్తున్నది. గత కొన్ని వారాల్లోనే లక్షల సంఖ్యలో కొత్త కేసులు నమోదయ్యాయి. వారం రోజుల్లోనే మరణాలు రెట్టింపయ్యాయి' అని టెడ్రోస్ చెప్పారు. ఆఫ్రికా, మధ్య, దక్షిణ అమెరికా దేశాల్లో కరోనా కేసులు తక్కువగా నమోదయ్యాయని, వైరస్ నిర్ధారణ సరిగ్గా జరుగకపోతే ఆయా దేశాల్లో సామాజిక, ఆర్థిక, రాజకీయ సంక్షోభాలు తలెత్తే ప్రమాదమున్నదని హెచ్చరించారు. సురక్షిత టీకా అందుబాటులోకి వచ్చేందుకు ఏడాదిన్నర సమయంపట్టవచ్చని తెలిపారు. ఈ సంక్షోభ సమయంలో ప్రజలకు ఆహార కొరత లేకుండా అన్ని ప్రభుత్వాలు సామాజిక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాలని సూచించారు.

# కొనసాగుతున్న అన్వేషణ

- తబ్లిగీ యాత్రికుల గుర్తింపు
- హైదరాబాద్‌లో 304 మంది క్వారంటైన్‌కు

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** రాష్ట్రంలో కరోనావ్యాప్తికి కారణమైన తబ్లిగీ యాత్రికులను గుర్తించే పని ముమ్మరంగా కొనసాగుతున్నది. హైదరాబాద్‌తోపాటు అన్ని జిల్లాల్లోనూ ప్రత్యేక బృందాలు వీరికోసం అన్వేషిస్తున్నాయి. గుర్తించిన యాత్రికులను హోం, ప్రభుత్వ క్వారంటైన్ కేంద్రాలకు తరలిస్తున్నారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారిని హైదరాబాద్ గాంధీ దవాఖానకు పంపిస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో ఢిల్లీకి వెళ్లివచ్చిన ఆరుగురికి పాజిటివ్‌గా తేలగా హైదరాబాద్ తరలించారు. మరో 15 మందిని దగ్గర్లోని ఎమ్మెన్నార్ దవాఖానలో క్వారంటైన్‌లో ఉంచారు. ఈ విషయం తెలుసుకొన్న ఆర్థిక మంత్రి హరీశ్‌రావు సంగారెడ్డి కలెక్టరేట్ చేరుకొని ఉన్నతాధికారులతో సమీక్షించారు. నల్లగొండ జిల్లాలో ఢిల్లీ నుంచి వచ్చిన వారిలో ఆరు కేసులు నమోదుకాగా ఒక మహిళ కూడా ఉన్నారు. మార్చి 30న గాంధీ దవాఖానలో మరణించిన వ్యక్తి నిర్మల్ జిల్లా జవహర్‌లాల్ నగర్‌కు చెందినవాడు కావడంతో జిల్లాలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. జవహర్‌నగర్ వార్డు ప్రజలు బయటకు రాకుండా ఇండ్లను సీజ్‌చేశారు. కామారెడ్డిలో తబ్లిగీకి వెళ్లివచ్చిన వారిలో ఇద్దరికి పాజిటివ్ రిపోర్టు వచ్చింది. హుజూరాబాద్‌లో ఇద్దరికి పాజిటివ్ రావడంతో వారితోపాటు కుటుంబసభ్యులను క్వారంటైన్‌కు తరలించారు. సూర్యాపేటలో ఒక పాజిటివ్ కేసు నమోదైంది. ఢిల్లీకి వెళ్లి వచ్చిన వారిలో 304 మందిని హైదరాబాద్‌లో క్వారంటైన్‌చేశారు. రైళ్లల్లో, బస్సుల్లో, విమానాల్లో ఢిల్లీకి ఎంత మంది వెళ్లారు? వారు కలుసుకున్నవారిని సీసీ కెమెరాల ఫుటేజీ ద్వారా ట్రాక్‌చేసి వాళ్లందరినీ క్వారంటైన్‌చేశారు.

## కొత్తగా 27 మందికి పాజిటివ్

- కోలుకున్న ముగ్గురు బాధితులు
- ఆయా కేంద్రాల్లో 128 మందికి చికిత్స

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో కొత్తగా 27 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయని వైద్యారోగ్యశాఖ గురువారం బులెటిన్‌లో పేర్కొన్నది. దేశ, విదేశాల నుంచి రాష్ట్రానికి వచ్చినవారు, వారితో సన్నిహితంగా మెలిగినవారిలో ఇప్పటివరకు 154 మందికి వైరస్ సోకినట్టు ప్రకటించింది. వీరిలో 14 మంది ఇప్పటికే కోలుకోగా, పలువురు డిశ్చార్జి కూడా అయ్యారని, గురువారం మరో ముగ్గురు బాధితులు కోలుకున్నారని వివరించింది. ఇప్పటి వరకు 9 మంది మృతి చెందారని పేర్కొన్నది. ప్రస్తుతం ఆయా కేంద్రాల్లో 128 మంది చికిత్స పొందుతున్నారని తెలిపింది.

## ఢిల్లీ తెలంగాణభవన్‌లో కంట్రోల్ రూం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇతర రాష్ట్రాల్లో ఉన్న తెలంగాణ వలస కూలీలు, తెలంగాణలోని ఇతర రాష్ట్రాల వలస కూలీల వివరాల కోసం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో కొవిడ్-19 కంట్రోల్‌రూంను ఏర్పాటుచేసినట్టు రెసిడెంట్ కమిషనర్ గౌరవ్‌ఉప్పల్ గురువారం చెప్పారు. కూలీలకు వసతి, భోజనం అందించేందుకు ముందుకొచ్చే అభ్యర్థులను పరిశీలించి ఆయారాష్ట్రాల అధికారులతో సమన్వయంచేస్తామని అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే అభ్యర్థనల మేరకు తెలంగాణలోని ఆయా జిల్లాల నోడల్ అధికారులతో మాట్లాడుతామని తెలిపారు. వివరాలకు కంట్రోల్ రూం నంబర్ 011- 23380556 ను సంప్రదించాలని కోరారు.

# ఆ నలుగురికి దిక్కెవరు!

- అనారోగ్యంతో తల్లి కన్నుమూత
- రోజంతా ఇంటిఎదుటే మృతదేహం
- అంత్యక్రియలు పూర్తిచేసిన జీహెచ్‌ఎంసీ సిబ్బంది
- చిలుకలగూడలో విషాదం

**సికింద్రాబాద్, నమస్తే తెలంగాణ:** నిండా పన్నెండు ఏండ్లు లేని నలుగురు పిల్లలు అనాథలయ్యారు! తండ్రి లేడు, పెద్దదిక్కుగా ఉన్న తల్లి సైతం ఒంటరివాళ్లను చేసి వెళ్లిపోయింది! అనారోగ్యంతో కన్నుమూస్తే, కరోనా వైరస్ భయంతో కనీసం పట్టించుకొనేవారే కరువయ్యారు. 24 గంటల తర్వాత దుర్వాసన రావడంతో జీహెచ్ఎంసీ సిబ్బంది అంత్యక్రియలు పూర్తిచేశారు. లాక్‌డౌన్ వేళ రాజధానిలో కంటతడి పెట్టించిన ఘటన ఇది. చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మేడిబావిలో నెల కిందట రాధ (38) నలుగురు 12 ఏండ్లలోపు పిల్లలతో ఓ ఇల్లు కిరాయికి తీసుకున్నది. ఆమెకు భర్తలేడు. కూలి పనులుచేసి పిల్లల బాగోగులు చూస్తూ కాలం గడుపుతున్నది. లాక్‌డౌన్ కారణంగా పదిరోజులుగా ఆమె ఇంటి నుంచి బయటికిరాలేదు. బుధవారం మధ్యాహ్నం అనారోగ్యంతో మృతిచెందింది. స్థానికుల సహాయంతో మృతదేహాన్ని ఇంటిబయట పెట్టారు. నెలకిందటే కిరాయికి రావడంతో పూర్తి వివరాలేవీ ఇంటి యజమానికి కూడా తెలియదు. బంధువులకు సమాచారం ఇచ్చేందుకు కూడా అవకాశం లేకుండాపోయింది. ఆడుకొనే వయస్సులో ఉన్న నలుగురు పిల్లలకు ఏమిచేయాలో పాలుపోలేదు. గురువారం మధ్యాహ్నం వరకు ఇంటి వెలుపలే మృతదేహాన్ని ఉంచడంతో దుర్వాసన వ్యాపించింది. కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో దహన సంస్కారాలు జరిపేందుకు బస్తీవాసులు కూడా ముందుకురాలేదు. సమాచారం అందుకొన్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది మృతదేహాన్ని అల్వాల్ శ్మశానవాటికకు తరలించి అంత్యక్రియలు పూర్తిచేశారు. పిల్లలను బంధువులకు అప్పగించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.



చిలుకలగూడలోని ఇంటి బయట రాధ మృతదేహంతో పిల్లలు

## స్వీయ నిర్బంధమే శ్రీరామ రక్ష

- కరోనాపై ఎంపీ సంతోష్‌కుమార్ ట్వీట్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా కట్టడికి స్వీయ నిర్బంధమే శ్రీరామరక్ష అని రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. కరోనా నుంచి రక్షించేది స్వీయ నిర్బంధమేనని, అదే రామబాణం వంటిదని శ్రీరామనవమి సందర్భంగా గురువారం ట్విట్టర్‌లో తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ సూచనలను విధిగా పాటించాలని కోరారు. పోలీసులు తమ విధులను నిర్వర్తిస్తూ అన్నార్తులకు రక్షణగా నిలుస్తూ అవసరమైన సహాయాన్ని అందిస్తున్నారని ప్రశంసించారు. కరీంనగర్‌లో వికలాంగులకు, యాచకులకు భోజనాలు అందిస్తున్న పోలీస్ కమిషనర్, కలెక్టర్‌ను సంతోష్‌కుమార్ అభినందించారు.

## వన్‌ప్లస్ సంస్థ మెడికల్ సూట్స్ విరాళం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా బాధితులకు చికిత్స అందించే వైద్యులు, సిబ్బంది కోసం 7,050 మెడికల్ సూట్స్, 6,220 గాగుల్స్ పంపిణీకి వన్‌ప్లస్ సంస్థ ముందుకొచ్చింది. గురువారం ప్రగతిభవన్‌లో ఆ సంస్థ ఆర్‌అండ్‌డీ హెడ్ రామ్‌గోపాల్ రెడ్డి మంత్రి కేటీఆర్‌కు వాటిని అందజేశారు. నిరుపేదల ఆకలితీర్చేందుకు నేషనల్ పోలీస్ అకాడమీలోని 150 మంది ట్రైనీ ఐపీఎస్‌లు ప్రజ్వల సంస్థకు రూ.1.75 లక్షల విరాళం ఇచ్చారు. అకాడమీ సిబ్బంది రూ.1.26 లక్షల విరాళం అందించారు.

## పోలీసులకు సైయెంట్ డ్రోన్ టెక్నాలజీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లాక్‌డౌన్ నేపథ్యంలో రాష్ట్ర పోలీసులు నిఘా పెట్టేందుకు డ్రోన్ ఆధారిత టెక్నాలజీని అందజేస్తున్నట్టు సైయెంట్ ఐటీ కంపెనీ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. నిఘా కెమెరాలు, థర్మల్ ఇమేజింగ్ పేలోడ్స్, స్కై స్పీకర్స్, సైయెంట్ డ్రోన్లను పోలీసులకు అందించనున్నట్టు పేర్కొన్నది. మారుమూల ప్రాంతాల్లోనూ పరిస్థితులను సమర్థంగా పర్యవేక్షించేందుకు ఈ డ్రోన్లు ఉపయోగపడుతాయని వెల్లడించింది.

## శానిటైజర్ల తయారీలో డిస్టిలరీలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లాక్‌డౌన్‌తో మద్యం తయారీ నిలిచిపోవడంతో డిస్టిలరీలు శానిటైజర్ల తయారీకి మొగ్గుచూపుతున్నాయి. దేశంలోనే అతిపెద్ద ఆల్కహాల్ ఉత్పత్తి కంపెనీ డియాజియో మల్కాజిగిరిలోని తమ యూనిట్‌లో శానిటైజర్లను ఉత్పత్తి చేస్తున్నది. దేశవ్యాప్తంగాఉన్న 15 యూనిట్లలో వీటిని తయారు చేస్తున్నట్టు ఎండీ, సీఈవో ఆనంద్ కృపాల్ తెలిపారు. మరో ఆల్కహాల్ ఉత్పత్తి కంపెనీ రాడికో ఖైతాన్ కూడా తెలంగాణలోని తిమ్మాపూర్ యూనిట్‌లో శానిటైజర్ల ఉత్పత్తిని ప్రారంభించింది.

## ఖైదీల రక్షణకు చర్యలు

- తీసుకోవాలని హైకోర్టులో పిల్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా నేపథ్యంలో ఖైదీలు, విచారణ ఖైదీల రక్షణకు చర్యలుతీసుకోవాలని హైకోర్టులో పిల్ దాఖలైంది. అత్యధిక జనసాంద్రత ఉన్న జైళ్లలో కొవిడ్-19 ముప్పు పొంచి ఉన్నదని, నిర్ణీతదూరం, ఇతర రక్షణ చర్యలకువీలుగా చిన్న నేరస్థులను విడుదలచేయాలని పిటిషనర్ ప్రొఫెసర్ జీ హరగోపాల్ కోరారు. కార్మికులు, పేదలు, ఆచకులు, అంతర్రాష్ట్ర వలస కార్మికులకు ఆహారం, వసతి కల్పించేలా ఆదేశాలు జారీచేయాలని హైకోర్టులో ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్‌రావు పిల్ దాఖలుచేశారు.

# ఆహారం అందించండిలా..

- అన్నార్తులు, అన్నదాతల అనుసంధానం
- పోలీసుల కొత్త వాట్సాప్ గ్రూప్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లాక్‌డౌన్ కారణంగా ఆకలితో అలమటిస్తున్న పేదలు, వలసకూలీలు, యాచకులకు ఆహారం అందించేందుకు దాతలు ముందుకొస్తున్నారు. కానీ, వారికి ఆహారాన్ని ఎక్కడికి తీసుకెళ్లాలి.. అన్నార్తులు ఎక్కడ ఉంటారు? అనే సమాచారం తెలుసుకోవడం కష్టమవుతున్నది. అలాంటివారిని కలిపేందుకు పోలీసులు వారధిగా మారారు. ప్రజలకు ఏ రకమైన ఇబ్బందులు లేకుండా అన్ని అత్యవసర, నిత్యావసర వస్తువులు, కూరగాయలు ఇతరాల రవాణాలో ఇబ్బందులు లేకుండా చూసేందుకు డీజీపీ కార్యాలయంలో ఇప్పటికే ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటుచేశారు. ఈ సెంటర్ ద్వారా 9490617523 నంబర్‌తో పోలీసులు వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేశారు. ఇందులో అన్నార్తుల కోసం ఆహార పదార్థాలు, భోజనం సమకూరుస్తున్న ఎన్జీవోలు, వలంటీర్లతోపాటు, ఆహారం అవసరమైనవారి వివరాలు తెలియజేసే సంస్థలు, వలస కార్మికుల సమాచారం ఇచ్చేవారిని జతచేస్తున్నారు. ఎవరికైనా ఎక్కడైనా ఆహారం అవసరం ఉంటే ఆ వివరాలను పైన తెలిపిన వాట్సాప్ నంబర్‌కు పంపవచ్చు. ఆ ప్రాంతంలోని దాతలెవరైనా స్పందించి వారికి ఆహారం పంపేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం పోలీసులు మహిళా శిశుసంక్షేమశాఖ అధికారులు, పలు ఎన్జీవోలతో కోఆర్డినేట్ చేస్తున్నారు. ఆకలికోసం అలమటించేవారికి సకాలంలో భోజనం అందించేందుకు వీలు కలుగుతుందని అధికారులు చెప్తున్నారు.

## కరోనా నియంత్రణకు అఖిలపక్షం: చాడ వెంకట్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఢిల్లీలో ప్రార్థనలకు హాజరైనవాళ్లు వైద్యపరీక్షలకు నిరాకరిస్తున్న నేపథ్యంలో ముస్లిం మతపెద్దలతో సీఎం కేసీఆర్ సమావేశం నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి కోరారు. గురువారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో కరోనాపై పోరాడేందుకు అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని సూచించారు. కరోనా పాజిటివ్‌తో దేశానికి వచ్చిన విదేశీయుల వల్లే వైరస్ వ్యాప్తి చెందిందని, కేంద్రం దీనితీవ్రతను అంచనావేయడంలో విఫలమైందని ఆరోపించారు.

# ఫేక్‌న్యూస్‌కు చెక్

## నిజానిజాల ధ్రువీకరణకు ప్రత్యేక వెబ్‌సైట్

- దేశంలోనే తొలి రాష్ట్రంగా తెలంగాణ ఘనత
- వాస్తవాలపై నిరంతరం బులెటిన్ విడుదల
- ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ వెల్లడి
- అందుబాటులో https://factcheck.telangana.gov.in



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సోషల్‌మీడియాలో ఒకడు ఓ వార్త పెడుతాడు.. ఆ వెంటనే అది నిజమేనని మరొకడు చెప్తాడు. తప్పని ఇంకొకడు వాదిస్తాడు.. ప్రభుత్వ వైఫల్యంతోనే ఇలా జరిగిందని వేరొకడు విమర్శలు గుప్పిస్తాడు. కొన్నిసార్లు ఇది సామాజిక పరమైన ఉద్రిక్తతలకూ దారితీస్తుంది. పెనుఉపద్రవాలకు కారణమవుతుంది. అసలు ఆ వార్త, వీడియో తాజాదా.. లేదా పాతదా అన్న విషయం కూడా తెలియదు. నిత్యం ఇలాంటి ఎంతో చెత్త సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నది. వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి యాప్‌లతోపాటు సోషల్‌మీడియాలో వందలసంఖ్యలో వస్తున్న వార్తల్లో నిజమెంత? ఏది అసలు వార్త.. ఏది తప్పుడు వార్త.. అనేది ధ్రువీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. దేశంలో ఫేక్‌న్యూస్ కట్టడి, నిజనిర్ధారణ కోసం ప్రత్యేకంగా పోర్టల్‌ను ప్రారంభించిన తొలి రాష్ట్రంగా తెలంగాణ ఘనత సాధించింది. కరోనాపై ఫేక్‌న్యూస్‌కు చెక్‌పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. లాక్‌డౌన్, కరోనా వైరస్ వ్యాప్తి తదితర అంశాలపై డిజిటల్ మీడియాలో వచ్చే తప్పుడు సమాచారం, వదంతులపై నిజనిర్ధారణ చేసుకొనేందుకు గురువారం https:// factcheck.telangana.gov.in వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. దీనిద్వారా ఏది నిజం, ఏది అబద్ధం అనేది ధ్రువీకరించుకోవచ్చని ఐటీశాఖ తెలిపింది. ఫ్యాక్ట్‌లీ మీడియా అండ్ రిసెర్చ్ సంస్థతో కలిసి ఈ వెబ్‌సైట్‌ను తీసుకొచ్చామని ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యే సమాచారానికి సంబంధించిన నిజానిజాలపై నిరంతరం బులెటిన్‌ను విడుదలచేయనున్నట్టు తెలిపారు. సోషల్‌మీడియాలో సమాచారం షేర్‌చేసే ముందు నిజనిర్ధారణ చేసుకోవాలని సూచించారు. ఫేక్‌న్యూస్ కట్టడికి కేంద్రం అధికారంగా మార్గదర్శకాలు ఇవ్వడానికి ముందే రాష్ట్ర ప్రభుత్వం ఈ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చిందని అధికారులు చెప్పారు. అధికారిక ధ్రువీకరణ లేకుండా సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తలను వైరల్ చేయడం శిక్షార్హమైన నేరమని ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొన్నది.

### అవి తప్పుడు వార్తలు

**ఐటీశాఖ మీడియా బులెటిన్ విడుదల**

సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న పలు కథనాలపై స్పష్టతనిస్తూ తెలంగాణ ఐటీ శాఖ గురువారం మీడియా బులెటిన్‌ను విడుదలచేసింది. కొంతమంది ముస్లిం యువకులు కరోనా వ్యాప్తి చేయడానికి ప్లేట్లు, చెంచాలు నాకుతున్నారని సోషల్‌మీడియా వేదికగా జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని ఐటీశాఖ పేర్కొన్నది. ఆహారం వృథాకాకుండా అలా చేయడం ఓ ఆచారమని, ఈ వీడియో 2018 నుంచి ఇంటర్నెట్‌లో ఉన్నదని తెలిపింది. ప్రాణాలే లేనప్పుడు డబ్బు ఎందుకని.. ఇటలీ దేశంలో ధనికులు డబ్బును రోడ్లమీద పారేస్తున్నారని వైరల్ అవుతున్న ఫొటో నిజంకాదని, అవి వెనిజులా దేశానికి చెందిన ఫొటోలని స్పష్టతనిచ్చింది. ప్రధాని మోదీ లాక్‌డౌన్‌ను మే 4 వరకు పొడిగించారని ఇండియా టుడే స్క్రీన్ షాట్లు పెట్టి వైరల్ చేస్తున్నారని, అందులో వాస్తవంలేదని తెలిపింది. కరోనా వ్యాప్తికి ముస్లింలు ఒకేసారి తుమ్ముతున్నట్టు వీడియో వైరల్ అవుతున్నదని, అది నిజంకాదని ఐటీశాఖ పేర్కొన్నది. ఆ వీడియోలో ఉన్నదాన్ని సూఫీ ఆచారం ప్రకారం చేసే జిక్ర్ అంటారని వివరించింది.



పశ్చిమబెంగాల్‌లోని నదియా జిల్లా నవద్వీప్‌కు చెందిన ఈయన.. ఇటీవల తన బంధువుల ఇంటికి వెళ్లివస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. దీంతో ఇలా పడవలో 14 రోజులు స్వీయ నిర్బంధం విధించుకున్నారు.



మధ్యప్రదేశ్‌లోని భోపాల్ సీఎంహెచ్‌వో డాక్టర్ సుధీర్ ధరియానా.. కరోనా వార్డులో విధులు నిర్వర్తిస్తున్నారు. ఐదురోజుల తర్వాత భార్యాపిల్లలను చూడాలనిపించి ఇంటికి వెళ్లినా.. ఇలా బయటే కూర్చొని పలుకరించారు.



రాష్ట్రంలో కొనసాగుతున్న పారిశుద్ధ్య చర్యలను పర్యవేక్షించేందుకు అసోం ముఖ్యమంత్రి సర్బనంద సోనోవాల్ స్వయంగా రంగంలోకి దిగారు. గువాహటిలో పర్యటిస్తూ ఇలా రసాయనాలను పిచికారి చేశారు.



స్పెయిన్‌లో కరోనా మృత్యుకేళికి అద్దం పట్టే దృశ్యమిది. బార్సిలోనా పట్టణంలోని ఓ విద్యుత్ దహనవాటిక వద్ద పోగుబడిన మృతదేహాలతో కూడిన శవపేటికలు

### 90 ఏండ్ల వయసులో..

# కరోనాపై విజయం

**వైరస్ బారి నుంచి కోలుకున్న కేరళ వృద్ధ జంట**



**తిరువనంతపురం:** కేరళకు చెందిన ఓ వృద్ధ జంట తమదైన ఆరోగ్య జీవనంతో కరోనాను జయించారు. పతనంతిట్ట జిల్లాకు చెందిన థామస్ అబ్రహం (93), ఆయన భార్య మరియమ్మ (88)కు ఇటలీ నుంచి వచ్చిన వారి కుమారుడు, కోడలు, మనుమడి ద్వారా కరోనా సోకింది. దీంతో కొట్టాయం వైద్య కళాశాల దవాఖానలో ఐసోలేషన్ వార్డులో ఉంచి చికిత్స అందించారు. ఆ వృద్ధ జంట ఈ మహమ్మారిని జయించడంపై వైద్యులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వారి ఆరోగ్య జీవనమే దీనికి కారణమని పేర్కొన్నారు. రైతు అయిన థామస్‌కు మద్యపానం, ధూమపానం వంటి అలవాట్లు లేవు. జిమ్‌లో ఎక్సర్‌సైజ్‌లు చేయకపోయినా ఆయన శరీరం సిక్స్‌ప్యాక్ మాదిరిగా దృఢంగా ఉంటుంది. దవాఖానలోనూ రోజూ తినే కేరళ సంప్రదాయ జావతో పాటు చిరుతిండిగా పనస పండ్లు మాత్రమే తీసుకున్నారు. ఆరోగ్య సమస్యలున్నప్పటికీ వైద్యుల సహకారంతో తాతనానమ్మలు కోలుకున్నారని మనుమడు రిజో తెలిపారు. ఇటలీ నుంచి తిరిగొచ్చిన తన సోదరి, ఆమె భర్త, పెద్దనాన్నకు కరోనా సోకిందన్నారు.

## ప్రిస్క్రిప్షన్‌తోనూ మద్యం వద్దు

**కేరళ ప్రభుత్వ నిర్ణయంపై హైకోర్టు స్టే**

**కొచ్చి:** మద్యం తాగకుండా ఉండలేనిస్థితిలోనివారికి డాక్టర్ ప్రిస్క్రిప్షన్‌పై మద్యం ఇవ్వాలని, ప్రత్యేక పాస్‌లు జారీచేయాలని కేరళ ప్రభుత్వం ఇటీవల నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీనిపై కేరళ గవర్నమెంట్ మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ హైకోర్టులో పిటిషన్ వేసింది. ఆ పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై గురువారం స్టే విధించింది. వారంలోగా ప్రతిస్పందనను తెలుపాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

## మా దేశం.. కరోనారహితం: ఉత్తర కొరియా

**సియోల్:** ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనా వైరస్ తమ దేశంలోకి ప్రవేశించలేదని, తమది పూర్తిగా కరోనారహిత దేశమని ఉత్తర కొరియా ఆరోగ్యశాఖకు చెందిన సీనియర్ అధికారి ఒకరు గురువారం ప్రకటించారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 10 లక్షల మంది ప్రజలు కరోనా బారిన పడినట్టు స్పష్టమవుతున్నప్పటికీ ఆయన ఈ ప్రకటన చేయడం అనుమానాలను రేకెత్తిస్తున్నది. పొరుగునే ఉన్న చైనాలో తొలి కరోనా పాజిటివ్ కేసు బయటపడిన వెంటనే సరిహద్దులన్నీ మూసి వైరస్ వ్యాప్తిని నిరోధించేందుకు కఠినమైన చర్యలు చేపట్టడంతో తమ దేశంలో ఒక్కరికి కూడా కరోనా వైరస్ సోకలేదని ఉత్తర కొరియా యాంటీ-ఎపిడెమిక్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ పాక్ మియాంగ్ సు తెలిపారు.

### కరోనా క్లాక్ 2-4-2020

| | |
|---|---|
| ప్రపంచవ్యాప్తంగా ప్రభావిత కేసులు | 10.01 లక్షలు |
| కోలుకున్నవారు | 2,10,191 |
| మరణాలు | 51,376 |

| దేశం | కేసులు | మరణాలు |
|---|---|---|
| అమెరికా | 2,35,747 | 5,624 |
| ఇటలీ | 1,15,242 | 13,915 |
| స్పెయిన్ | 1,10,238 | 10,096 |
| జర్మనీ | 83,875 | 1,066 |
| చైనా | 81,589 | 3,318 |
| ఫ్రాన్స్ | 59,105 | 4,503 |
| ఇరాన్ | 50,468 | 3,160 |
| యూకే | 33,718 | 2,921 |
| స్విట్జర్లాండ్ | 18,475 | 522 |
| టర్కీ | 18,135 | 356 |


| | |
|---|---|
| దేశవ్యాప్తంగా ప్రభావిత కేసులు | 2,507 |
| కోలుకున్నవారు | 177 |
| మరణాలు | 76 |

**దేశంలో కరోనా కేసులు**

| | | |
|---|---|---|
| మహారాష్ట్ర 416 | తమిళనాడు 309 | ఢిల్లీ 293 |
| కేరళ 286 | తెలంగాణ 154 | ఏపీ 149 |
| రాజస్థాన్ 133 | కర్ణాటక 124 | ఉత్తరప్రదేశ్ 121 |
| మధ్యప్రదేశ్ 107 | గుజరాత్ 88 | ప. బెంగాల్ 53 |
| కశ్మీర్ 48 | హర్యానా 47 | పంజాబ్ 46 |

# క్షయ టీకా బ్రహ్మాస్త్రం!

- బీసీజీ వ్యాక్సిన్‌తో కరోనా వైరస్‌ను అదుపు చేయవచ్చంటున్న శాస్త్రవేత్తలు
- సుదీర్ఘకాలంగా టీకా వాడుతున్న దేశాల్లో కొవిడ్-19 ప్రభావం తక్కువే
- మరణాల రేటు జపాన్‌లో 0.28%.. ఇటలీలో 19.7 శాతంగా నమోదు
- ఎన్‌వైఐటీ అధ్యయనంలో వెల్లడి




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా కల్లోలానికి ప్రపంచమే కకావికలమవుతున్న సమయంలో బీసీజీ వ్యాక్సిన్ శాస్త్రవేత్తల్లో కొత్త ఆశలు రేపుతున్నది. వేలసంఖ్యలో ప్రజల ప్రాణాలు బలిగొంటున్న మందులేని వైరస్‌కు.. కండ్ల ముందు ఇదొక పరిష్కారంగా కనిపిస్తున్నది. వైద్యుల పర్యవేక్షణలో ఉండటం (ఐసొలేషన్).. స్వీయ నిర్బంధం (క్వారంటైన్) మాత్రమే ఇప్పటివరకు కరోనా వైరస్ వ్యాప్తి నిరోధానికి శాస్త్రీయంగా నిర్ధారణ అయిన మార్గాలు. కానీ, క్షయ వ్యాధి నిర్మూలనకు ఇచ్చే బీసీజీ వ్యాక్సిన్ కరోనాపై పోరాటాన్ని మలుపు తిప్పుతున్నదని (గేమ్ చేంజర్) అమెరికన్ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. బీసీజీ టీకాకు సంబంధించి సుదీర్ఘమైన సార్వత్రిక విధానాలు (నేషనల్ పాలసీ) అమలులో ఉన్న దేశాల్లో కరోనా తీవ్రత తక్కువగా ఉన్నదని, అవి లేని దేశాల్లో ప్రభావం తీవ్రంగా ఉన్నదని తెలిపారు. టీకాల ద్వారానే శ్వాసకోశ వ్యాధుల నుంచి శాశ్వత ఉపశమనం ఉంటుందని భావించడం సహజమైనందున.. ప్రస్తుత పరిస్థితుల్లో బీసీజీ ఆశాజనకంగా కనిపిస్తుందని పేర్కొంటున్నారు.


### వ్యాక్సిన్ కోసం విస్తృత అధ్యయనాలు

కరోనాకు వ్యాక్సిన్ కనిపెట్టేందుకు అనేక దేశాల శాస్త్రవేత్తలు అహర్నిశలు శ్రమిస్తున్నారు. దాదాపు 187 దేశాలు వినియోగించిన బీసీజీ టీకాపైనా విస్తృత అధ్యయనాలు జరుగుతున్నాయి. శతాబ్దానికిపైగా పురాతనమైన బీసీజీ వ్యాక్సిన్ కరోనాపై పోరులో సరైన అస్త్రంగా పనిచేస్తుందనే ఆశాభావం చాలా దేశాల శాస్త్రవేత్తల్లో వ్యక్తమవుతున్నది. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ శాస్త్రవేత్తలు తమ ఆరోగ్య సిబ్బందిని కరోనా నుంచి రక్షించేందుకు.. వారికి బీసీజీ టీకాలిచ్చి అధ్యయనాన్ని మొదలుపెట్టారు. తాజాగా న్యూయార్క్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్‌వైఐటీ) పరిశోధకులు కూడా బీసీజీ వ్యాక్సిన్ కరోనాపై పోరులో 'గేమ్ చేంజర్'గా మారనున్నదని చెప్తున్నారు. బీసీజీ టీకాపై సుదీర్ఘ సార్వత్రిక విధానాలు అమలులో ఉన్న దేశాల కంటే.. అమలులోలేని దేశాలు ప్రస్తుతం కరోనా తీవ్రతను ఎక్కువగా చవిచూస్తున్నాయని ఎన్‌వైఐటీ శాస్త్రవేత్త గొంఘాలో ఒటాజు తెలిపారు. ఇందుకు ప్రపంచంలోనే అత్యధిక కరోనా పాజిటివ్ కేసులు, మరణాలు చోటు చేసుకుంటున్న అమెరికా, ఇటలీ, నెదర్లాండ్స్‌ను ఉదహరించారు. ఎన్‌వైఐటీ అధ్యయనంలో గుర్తించిన అంశాలు ఆసక్తికరంగా ఉన్నప్పటికీ శాస్త్రీయ వివరాలు చాలా అవసరం ఉన్నాయని సీసీఎంబీ డైరెక్టర్ రాకేశ్ మిశ్రా చెప్తున్నారు.

### మరణాల రేటు తక్కువ

- ☞ఎన్‌వైఐటీ శాస్త్రవేత్తల విశ్లేషణ ప్రకారం.. జపాన్‌లో 1947లో బీసీజీ టీకా వ్యాక్సినేషన్‌ను ప్రారంభించగా, అక్కడ కరోనా మరణాల రేటు 0.28 శాతంగా ఉన్నది.
- ☞బ్రెజిల్‌లో 1920లో జాతీయ వ్యాక్సినేషన్‌ను మొదలుపెట్టగా.. అక్కడ కరోనా మరణాల రేటు 0.0573 శాతంగా నమోదైంది.
- ☞1984లో బీసీజీ వ్యాక్సినేషన్ ప్రారంభించిన ఇటలీలో మాత్రం కరోనా మరణాల రేటు ఏకంగా 19.7 శాతంగా ఉన్నది.
- ☞1948లో భారతదేశం బీసీజీ మాస్ ఇమ్యునైజేషన్‌ను ప్రారంభించింది.
- ☞క్షయవ్యాధి కేసులు 20వ శతాబ్దంలో ప్రపంచవ్యాప్తంగా గణనీయంగా తగ్గుముఖం పట్టడంతో యూరప్‌లోని పలు సంపన్న దేశాలు 1963 నుంచి 2010 మధ్య బీసీజీ టీకాలపై ఉన్న తమ సార్వత్రిక విధానాలను ఉపసంహరించుకున్నాయి.
- ☞180 దేశాల్లో బీసీజీ టీకాలకు సంబంధించిన సమగ్ర వివరాలు ఉన్నాయి. ఇందులో 157 దేశాలు ఇప్పటికీ యూనివర్సల్ బీసీజీని ప్రతిపాదిస్తున్నాయి. కేవలం 23 దేశాల్లో మాత్రమే టీబీ కేసులు తగ్గడంతో బీసీజీ వ్యాక్సిన్‌ను నిలిపివేశాయి.

### ఇదొక ఆశాకిరణం



సార్స్ అనే వైరస్‌ను ఎదుర్కోవడంలోనూ బీజీసీ వ్యాక్సిన్ ప్రభావవంతంగా పనిచేసింది. కరోనా విషయంలోనూ ఇదొక ఆశాజనకంగా ఉన్నది. ఈ టీకా కరోనా తీవ్రతను తగ్గించవచ్చేమోగానీ పూర్తిగా నిర్మూలించలేదు. ప్రపంచవ్యాప్తంగా కరోనా ప్రభావాన్ని విశ్లేషిస్తే.. బీసీజీ వ్యాక్సిన్‌ను వినియోగించిన దేశాల్లో కరోనా తీవ్రత ఇతర దేశాల కంటే తక్కువగా ఉండటం తాజా ఎన్‌వైఐటీ అధ్యయన ఫలితానికి బలాన్ని చేకూరుస్తుంది.

– మౌనిక గులాటి, లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ ఫ్యాకల్టీ, పంజాబ్

# లాక్‌డౌన్ తర్వాత జాగ్రత్త

- ప్రజలు ఒకేసారి రోడ్లమీదికి రాకుండా చూడాలి
- రాష్ట్రాల సీఎంలకు ప్రధాని మోదీ సూచన
- వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న సీఎం కేసీఆర్




గురువారం పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:** లాక్‌డౌన్ ఎత్తివేత అనంతర పరిస్థితులను ఎదుర్కొనేందుకు పక్కా వ్యూహం రూపొందించాల్సిన అవసరం ఉన్నదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. కరోనా వైరస్‌ను అదుపుచేయడానికి రాబోయే కొన్ని వారాలపాటు 'పరీక్ష (టెస్టింగ్), నిఘా (ట్రాకింగ్), నిర్బంధం (ఐసొలేషన్), దవాఖాన పర్యవేక్షణ (క్వారంటైన్)' సూత్రాలను ఆచరించాలని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు సూచించారు. మహమ్మారి బారి నుంచి తక్కువ ప్రాణనష్టంతో బయటపడటమే లక్ష్యమని చెప్పారు. మోదీ గురువారం అన్ని రాష్ట్రాల సీఎంలతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. కరోనా కట్టడికి ఆయా రాష్ట్రాలు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలను ప్రధాని మోదీ ప్రశంసించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు అభినందనలు తెలిపారు.

### సమన్వయం అభినందనీయం

విశ్వమారి కరోనా వ్యాప్తిని అడ్డుకోవడానికి సీఎంలందరూ సమన్వయంతో పనిచేస్తున్నారని ప్రధాని మోదీ అభినందించారు. లాక్‌డౌన్‌కు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. బాధితులను యుద్ధప్రాతిపదికన గుర్తించి చికిత్స అందించాలని, తద్వారా వైరస్ వ్యాప్తి చెందకుండా నియంత్రించాలని సూచించారు. ఈ నెల 14వ తేదీతో లాక్‌డౌన్ గడువు ముగుస్తున్నదని గుర్తుచేస్తూ.. ప్రజలంతా ఒకేసారి రోడ్లమీదికి రాకుండా చూడాల్సిన అవసరం ఉన్నదన్నారు. లాక్‌డౌన్ ఎత్తివేత తర్వాతి పరిస్థితులను ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యూహంపై సలహాలు, సూచనలు ఇవ్వాలని ముఖ్యమంత్రులను కోరారు. ప్రపంచవ్యాప్తంగా వైరస్ ఉధృతి ఇంకా తగ్గలేదని, రెండోసారి విజృంభించే అవకాశాలున్నాయని కొందరు అంచనా వేస్తున్నారన్నారు. ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకైనా సిద్ధంగా ఉండాలని, ప్రత్యేకంగా దవాఖానలు, వైద్యసిబ్బంది, తగినన్ని మందులు వంటివి సమకూర్చుకోవాలని మోదీ సూచించారు. ఇదే సమయంలో రాష్ట్రాల్లో శాంతి భద్రతలను కాపాడాలన్నారు. గరీబ్ కల్యాణ్ యోజన కింద ప్రకటించిన ప్యాకేజీ ప్రయోజనాలు పేదలకు అందేలా చూడాలన్నారు. ఆహారధాన్యాల కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని, ఆయుష్ డాక్టర్లు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలు వినియోగించుకోవాలని సూచించారు. ప్రస్తుతం పంట నూర్పిడికాలం కావడంతో ప్రజలు నిర్ణీత దూరం పాటించేలా చూడాలని, నిజాముద్దీన్ పరిణామాల నేపథ్యంలో అనుమానిత కేసుల గుర్తింపు, క్వారంటైన్‌కు తరలింపు, వైరస్ వ్యాప్తి చెందకుండా తీసుకుంటున్న చర్యల గురించి సీఎం కేసీఆర్‌తోపాటు ఇతర రాష్ట్రాల సీఎంలు ప్రధానికి వివరించారు.

### నేడు ప్రధాని వీడియో సందేశం

దేశ ప్రజలను ఉద్దేశించి శుక్రవారం వీడియో సందేశం విడుదల చేయనున్నట్టు ప్రధాని మోదీ పేర్కొన్నారు. అయితే ఏ అంశంపై మాట్లాడుతారో మాత్రం వెల్లడించలేదు. లాక్‌డౌన్, అనంతర పరిస్థితులపై మోదీ సందేశం ఇస్తారని ప్రచారం సాగుతున్నది.

## వ్యాక్సిన్ పరీక్షలు ప్రారంభం

**ఆస్ట్రేలియా శాస్త్రవేత్తల వెల్లడి**

**మెల్‌బోర్న్:** కరోనాను నియంత్రించేందుకు రెండు సమర్థవంతమైన వ్యాక్సిన్‌లను అభివృద్ధి చేస్తున్నట్టు, అవి ఎలా పనిచేస్తాయోనన్న అంశాన్ని తెలుసుకోవడానికి వ్యాక్సిన్ పరీక్షల్ని కూడా మొదలు పెట్టినట్టు ఆస్ట్రేలియాకు చెందిన శాస్త్రవేత్తలు గురువారం వెల్లడించారు. కరోనాను కట్టడి చేసే ఔషధ పరీక్షల్లో ఇదో మైలు రాయి అని ఆస్ట్రేలియా నేషనల్ సైన్స్ ఏజన్సీకి చెందిన 'కామన్వెల్త్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసర్చ్ ఆర్గనైజేషన్(సీఎస్ఐఆర్‌వో)' శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. వైరస్ సోకిన వారిలో వ్యాధిని తగ్గించేందుకు కండరాల ద్వారా వ్యాక్సిన్‌ను ప్రవేశపెట్టాలా? లేక నాజల్ స్ప్రేతో (ముక్కుతో పీల్చుకునే విధంగా) వ్యాక్సిన్‌ను రోగులకు అందించాలా? అనే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు ఆ శాస్త్రవేత్తలు వెల్లడించారు.




మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఢిల్లీ నుంచి వచ్చిన కరోనా అనుమానితులకు పరీక్షలు నిర్వహించేందుకు వెళ్లిన వైద్య సిబ్బందిపై స్థానికులు కర్రలు, రాళ్లతో దాడిచేశారు. ఈ ఘటనలో ఇద్దరు వైద్యులు గాయపడ్డారు. పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు.

### మూడు అడుగులు కాదు..

# ముప్పై అడుగులు

- అంత దూరం పాటిస్తేనే కరోనా సోకదు
- వైరస్ గంటలపాటు గాలిలో ఉండే అవకాశం
- ఎంఐటీ పరిశోధనలో వెల్లడి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ సోకకుండా ఉండాలంటే నిర్ణీత దూరం పాటించాలన్నది అత్యంత కీలకం. అయితే ఇప్పటి వరకు మూడు ఫీట్ల దూరం పాటిస్తే సరిపోతుందని చాలా మంది చెప్తున్నారు. ఎందుకంటే వైరస్ బారిన పడిన వ్యక్తి తుమ్మినా, దగ్గినా అతడి నోటి నుంచి వచ్చే తుంపిర్లు అంతదూరం మాత్రమే ప్రయాణించగలవని వారి అభిప్రాయం. కానీ ఈ మూడు అడుగుల దూరం పాటిస్తే సరిపోదని.. దాదాపు ముప్పై అడుగుల దూరం పాటించాలని అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి (ఎంఐటీ) చెందిన పరిశోధకురాలు డాక్టరు లైడియా బౌరిబా తాజాగా తెలిపారు. తుమ్ము లేదా దగ్గు నుంచి వెలువడే ఏ రకం తుంపర బిందువైనా 23 నుంచి 27 అడుగులు (7 నుంచి 8 మీటర్లు) ప్రయాణించగలదని, తమ వెంట సూక్ష్మ జీవులను కూడా మోసుకెళ్లగలవని ఆమె తమ పరిశోధనలో వెల్లడించారు. నిర్ణీత దూరానికి సంబంధించి ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలు తుంపర బిందువుల సైజు (పెద్ద లేదా చిన్న) ఆధారంగా రూపొందించారని ఆమె పేర్కొన్నారు. కానీ ఇటీవల జరిపిన పరిశోధనల వల్ల తెలిసిందేమిటంటే.. తుమ్ము, దగ్గు తుంపరలు ఒక చిన్నపాటి మేఘంలాగా వ్యాపిస్తున్నాయని దీంట్లో తుంపర్ల సైజు రకరకాల పరిమాణాల్లో ఉంటున్నాయని చెప్పారు. ఈ మేఘంలో ఉండే గాలి, తేమ కారణంగా తుంపర బిందువులు అంత తొందరగా కూడా ఆవిరి కాకుండా ఉంటాయని ఆమె తెలిపారు. దీని వల్లే కరోనా సూక్ష్మ క్రిములు మనం ఊహిస్తున్నదానికన్నా ఎక్కువ సమయం పాటు ఉనికిలో ఉండే ప్రమాదముందని చెప్పారు. కొవిడ్-19 వ్యాప్తి నియంత్రణకు అమలు చేస్తున్న నిర్ణీత దూరం విధానాలు 1930 నాటివని చెప్పారు. వీరి పరిశోధన 'జర్నల్ ఆఫ్ అమెరికన్ మెడికల్ అసోసియేషన్'లో ప్రచురితమైంది. అయితే ఈ పరిశోధనను అమెరికాకు చెందిన మరో శాస్త్రవేత్త డాక్టర్ ఆంథోని ఫౌసి తోసిపుచ్చారు. ఇది పూర్తిగా తప్పుదారి పట్టించేలా ఉన్నదని పేర్కొన్నారు.

### కాలుష్యాన్ని తగ్గించిన కరోనా

**న్యూఢిల్లీ:** లాక్‌డౌన్ మొదలైన నాటి నుంచి దేశవ్యాప్తంగా వాయు నాణ్యతలో గణనీయమైన మార్పు కనిపించిందని కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సీపీసీబీ) తెలిపింది. మార్చి 29వ తేదీ నాటికి 91 నగరాల్లో పరిస్థితి మెరుగుపడిందని చెప్పింది. సాధారణంగా రవాణా, పరిశ్రమలు, విద్యుదుత్పత్తి ప్లాంట్లు, నిర్మాణ పనులు వంటివి గాలి కాలుష్యానికి ప్రధాన కారకాలు. జనతా కర్ఫ్యూ, లాక్‌డౌన్ కారణంగా అవన్నీ మూతపడటంతో గాలిలోకి కలుషితాలు చేరడం తగ్గి, వాయు నాణ్యత పెరిగింది. మార్చి 21న 54 నగరాల్లో మాత్రమే వాయు నాణ్యత 'బాగుంది, సంతృప్తికరం' స్థాయిల్లో ఉండగా, 29 నాటికి 91కి పెరిగింది. తొమ్మిది నగరాల్లో గాలికాలుష్యం తీవ్రంగా ఉండగా, ప్రస్తుతం అవన్నీ మెరుగుపడ్డాయి.



### కరోనాతో పద్మశ్రీ గ్రహీత నిర్మల్‌సింగ్ మృతి

**అమృత్‌సర్:** సిక్కు ఆధ్యాత్మికగీతాలను ఆలపించే ప్రఖ్యాత గాయకుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత నిర్మల్‌సింగ్ (62) కరోనాతో మరణించారు. ఇటీవలే ఆయన లండన్ నుంచి రాగా బుధవారం వైద్య పరీక్షలు చేయడంతో కరోనా పాజిటివ్ అని తేలింది. మార్చి 19న చండీగఢ్‌లో భారీఎత్తున జరిగిన కీర్తన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

### ఆరువారాల పసికందు మృత్యువాత

**న్యూయార్క్:** కరోనా వైరస్ ఆరువారాల పసికందును సైతం బలితీసుకున్నది. ఈ హృదయవిదారకర ఘటన అమెరికాలోని న్యూయార్క్‌లో చోటుచేసుకుంది. 'గత వారం అపస్మారకస్థితికి చేరిన పసికందును దవాఖానకు తీసుకొచ్చారు. కానీ, శిశువును బతికించలేకపోయాం. ఈ ఘటన మా హృదయాలను ద్రవింపజేసింది. కొవిడ్-19 కబళించినవారిలో అతి చిన్న వయసున్న పేషంట్ ఈ శిశువేనని భావిస్తున్నాం' అని అధికారులు తెలిపారు. ఏడాది వయసున్న శిశువు కరోనా బారిన పడి మృతిచెందినట్టు గతవారం లినోయిస్ అధికారులు తెలిపారు.



### స్టార్ వార్స్ నటుడు ఆండ్రూజాక్ మృతి

**న్యూఢిల్లీ:** స్టార్ వార్స్ సిరీస్ సినిమాల నటుడు ఆండ్రూ జాక్ (76) కరోనాతో మంగళవారం కన్ను మూశారు. వైరస్ సోకిన రెండు రోజులకే ఆయన మరణించారు. ఆండ్రూ జాక్ అప్పుడప్పుడూ సినిమాల్లో నటించే వారు. గ్రామీ అండ్ ఎమ్మీ అవార్డు విజేత, సినీ గాయకుడు-రచయిత ఆడం స్లెసింగర్ (52) కరోనా వైరస్‌తో గురువారం మరణించారు.

### సహాయక చర్యల్లో లక్షమంది ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

**నాగ్‌పూర్:** తమ సంస్థకు చెందిన లక్ష మందికిపైగా స్వచ్ఛంద సేవకులు సహాయక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) తెలిపింది. శ్రీరామనవమి సందర్భంగా గురువారం ఆన్‌లైన్ ప్రసారంలో ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి భయ్యాజీ జోషి మాట్లాడుతూ.. లక్షమందికిపైగా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు దేశవ్యాప్తంగా పదివేల ప్రదేశాల్లో సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఆరోగ్యకార్యకర్తలకు, భద్రతాసిబ్బందికి ఆహారం అందిస్తూ, రక్తదాన శిబిరాల్లో పాల్గొంటున్నారని అన్నారు.



### ఇజ్రాయెల్ ఆరోగ్య మంత్రికి కరోనా

**జెరూసలెం:** ఇజ్రాయెల్ ఆరోగ్యశాఖ మంత్రి యాకొవ్ లిట్జ్‌మన్‌కు కరోనా వైరస్ సోకడంతో ఆయనను ఐసొలేషన్‌లో ఉంచారు. దీంతో ఇటీవల ఆయనను కలిసిన ఇజ్రాయెల్ గూఢచార సంస్థ 'మొస్సాద్' అధిపతి యోసీ కోహెన్, జాతీయ భద్రతా సలహాదారు మెరిన్ బెన్ షబ్బాట్ సహా ఉన్నతాధికారులంతా స్వీయనిర్బంధంలోకి వెళ్లాల్సి వచ్చింది.

### యోగిపై కామెంట్లు.. 'ది వైర్' ఎడిటర్‌పై కేసు

**అయోధ్య:** యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌పై కామెంట్లు చేసిన 'ద వైర్' ఎడిటర్ సిద్ధార్థ్ వరదరాజన్‌పై కేసు నమోదైంది. ఢిల్లీలో తబ్లిగీ జమాత్ జరుగుతున్న సమయంలోనే.. రామనవమి వేడుకలు యథాతథంగా జరుగుతాయని, 'రాముడు తన భక్తులను కరోనా నుంచి కాపాడుతాడు' అని యోగి ప్రకటించారని సిద్ధార్థ్ ట్వీట్ చేశారు. లాక్‌డౌన్ అమలులో ఉన్న సమయంలో అయోధ్యలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం పాల్గొనడాన్ని ప్రశ్నించారు. దీంతో సీఎంపై అనుచిత కామెంట్లు చేశారంటూ సిద్ధార్థ్‌పై కేసు నమోదైంది.

### ధారావిలో కరోనా రోగి మృతి

**ముంబై:** ఆసియాలోనే అతిపెద్ద మురికివాడగా పేరొందిన ముంబైలోని ధారావిలో ఒకరు కరోనా వైరస్ సోకి మృతి చెందారు. దీంతో మరణించిన వ్యక్తి నివసించిన ప్రాంతాన్ని అధికారులు 'నియంత్రిత జోన్' గా ప్రకటించారు. 300 మందిని పరీక్షించి క్వారంటైన్‌లో ఉంచారు. ప్రజల కదలికలపై ఆంక్షలు విధించారు. ధారావిలో 15 లక్షల మంది నివసిస్తున్నారు.

**యాది - 1948**

అమెరికా వాషింగ్టన్ డీసీలో
'నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్' (నాటో) ప్రారంభం.





కరోనా వైరస్ ఏ మూలన ఉన్నా.. ప్రపంచమంతటా
ఉన్న వారందరికీ ప్రమాదకరమే.
–ఎలెన్ జాన్సన్ సర్‌లీఫ్, లైబీరియా మాజీ అధ్యక్షురాలు

**నమస్తే తెలంగాణ**

# సమిష్టి పోరాటం

**కరోనాపై** ప్రధాని మోదీ రెండు విధాలైన పోరాటానికి సమాయత్తమవుతున్నారు. ఒకటి దేశంలో ఈ వైరస్‌ను కట్టడి చేయడమైతే, రెండవది అంతర్జాతీయ సమాజాన్ని సమష్టి పోరాటానికి సమాయత్తం చేయడం. సమాంతరంగా సాగుతున్న ఈ రెండు ప్రయత్నాలూ పరస్పర పూరకాలు. అంతర్జాతీయంగా సమష్టి పోరాటమంటే, ఇతర దేశాలకు తోడ్పడటమే కాదు, మనకు కావలసిన సహాయాన్ని పొందడం కూడా. ప్రధాని ఇటీవల 130 దేశాలలోని మన రాయబార కార్యాలయాలతో జరిపిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఇతర దేశాల అనుభవాన్ని మనం ఏ విధంగా స్వీకరించగలమనేది తెలుసుకోవలసిందిగా కోరారు. ఇటలీలో కరోనా సోకినవారిలో మృతులు పదకొండు శాతం ఉంటే, జర్మనీ ఒక శాతం దగ్గరే నియంత్రించగలిగింది. కరోనాపై పోరులో చైనాది ఒక విధానమైతే, దక్షిణ కొరియాది మరొక తరహా వ్యూహం. ఏయే దేశాల నుంచి ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని, వైద్య పరికరాలను సమకూర్చుకోవచ్చుననేది రాయబార కార్యాలయాల ద్వారా మన దేశం చర్చిస్తున్నది. దక్షిణ కొరియా, జర్మనీ, చైనా అనుసరించిన అత్యాధునిక సాంకేతిక విధానాలు, ఉత్తమ ఆచరణలు ఎటువంటివి అనే విషయమై భారత్ ప్రత్యేక ఆసక్తిని ప్రదర్శిస్తున్నది.

ఇటలీ ఇతర దేశాల సహాయాన్ని అర్థిస్తే, సాటి యూరప్‌దేశాలు పెద్దగా స్పందించకపోగా, వైద్య పరికరాల ఎగుమతిపై నిషేధాన్ని విధించుకున్నాయనే ఆరోపణ ఉన్నది. ఇదే అవకాశంగా చైనా రంగంలోకి దిగి యూరప్ దేశాలకు వైద్య సిబ్బందిని, పరికరాలను తరలించింది. ఇది చైనా తన ప్రాబల్యాన్ని పెంచుకోవడానికి ఆస్కారం కల్పించిందనే అభిప్రాయం వినబడుతున్నది. ఈ వివాదాలకు అతీతంగా భారత్ గుంభనంగా అంతర్జాతీయ సహకారానికి పాటుపడుతున్నది. సార్క్, జి20 దేశాల నాయకులతో ప్రధాని మోదీ జరిపిన వీడియో కాన్ఫరెన్స్ ప్రాధాన్యం సంతరించుకున్నది. కరోనాపై పోరులో చైనా కొట్టుమిట్టాడుతున్నప్పుడు పదిహేను టన్నుల వైద్య సంబంధ సామాగ్రిని భారత్ తనవంతుగా అందించింది. ఇటీవలే నేపాల్, మాల్దీవులకు వైద్యులను పంపించింది. అఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్, భూటాన్, శ్రీలంక తదితర దేశాలకు వైద్య సామాగ్రిని సరఫరా చేస్తున్నది. ఇటలీ, ఇరాన్ అభ్యర్థనలను పరిశీలిస్తున్నది. మాస్కులు, వైద్య పరికరాలు కావాలని భారత్‌ను ఇజ్రాయెల్ కోరుతున్నది. కరోనాను ప్రపంచ సమస్యగా గుర్తించడం ద్వారానే ఈ వ్యాధిని ఎదుర్కొనగలమనేది భారత్ అభిప్రాయం.

మొదట తమ దేశంలో వ్యాపించిన కరోనాను కట్టడి చేసుకున్న చైనా ప్రభుత్వం ఆ తరువాత ఇతర దేశాలకు సహాయం అందిస్తూ తన ప్రాబల్యం పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నది. మోదీ ప్రభుత్వం కూడా మన దేశంలో కరోనాను ఎంతగా కట్టడి చేయగలిగితే, అంతగా ఇతర దేశాలకు తోడ్పడగలదు. చైనాకున్నంత శక్తి సామర్థ్యాలు భారత్‌కు ఉన్నాయా అనే సందేహం కలుగవచ్చు. కానీ గతంలో అలీనోద్యమానికి నాయకత్వం వహించడానికీ, ప్రచ్ఛన్నయుద్ధం మూలంగా తలెత్తిన పలు సంక్షోభాలలో స్పష్టమైన వైఖరి తీసుకోవడానికి కారణం భారత్‌కున్న ధర్మబద్ధత, నైతిక బలమే. అమెరికా చైనాలతో పోలిస్తే, వర్ధమాన దేశమైన భారత్ ఆసియా–ఆఫ్రికా దేశాలకు సులభంగా దగ్గర కాగలదు. సార్క్ సమాజాలతో కూడా చైనా కన్నా భారత్‌కే సారూప్యమెక్కువ. అమెరికా, యూరప్ దేశాలు కోవిడ్ కోరల్లో చిక్కి అల్లాడిపోతున్నాయి. అమెరికా, చైనా కలహాలతో కాలం గడుపుతున్నాయి. ఈ నేపథ్యంలో వర్ధమాన, పేద దేశాలు కరోనాను ఎదుర్కొనడానికి వీలుగా సూచనలు ఇస్తూ, ప్రపంచ దేశాల సహాయాన్ని కూడగట్టవలసిన నైతిక బాధ్యత భారత్‌పై ఉంది. చారిత్రకంగా భారత్ నిర్వహిస్తున్న పాత్రకు ఇదొక కొనసాగింపు.

# సమరంలోనూ ఆగని సంక్షేమం

**వ్యవసాయం**



**డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి**

> తెలంగాణలో అడుగు పెట్టిన కరోనా వైరస్‌ను కట్టడి చేస్తూ, ప్రజలకు మార్గదర్శనం చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ మరోవైపు బంగారు తెలంగాణను సాకారం చేయవలసిన తన బాధ్యతను విస్మరించకపోవడం ప్రశంసనీయం. ఇంత ఒత్తిడిలోనూ ఆయన వ్యవసాయదారుల కష్టసుఖాలను పట్టించుకుంటున్న తీరు ఆశ్చర్యకరం.

**కొత్త రాష్ట్రంలో** నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణాన్ని అత్యంత వేగంగా సాగించడం, కరెంటు కొరత తీర్చడం, రైతులకు పెట్టుబడి ఖర్చు ఇవ్వడం మొదలైన కేసీఆర్ విధానాల వల్ల వ్యవసాయం పండుగగా మారింది. లక్షల ఎకరాల బీడు భూములు పంటపొలాలుగా మారాయి. అయితే ఆ పంట కోతకు వచ్చిన ప్రస్తుత తరుణంలో కరోనా వైరస్ వ్యాప్తి కారణంగా లాక్‌డౌన్ పాటిస్తున్నందు వల్ల మార్కెట్లను మూసివేయ వలసి వచ్చింది. తమ పంటలు ఎలా అమ్ముకోవాలో తెలియక రైతాంగం మనోవేదనకు గురైంది. కానీ ఉద్యమనాయకుడు కేసీఆర్ ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో సైతం తక్షణమే ఆదుకోవడానికి చేపట్టిన చర్యలు రైతుల పాలిట వరంగా మారాయి.

ప్రస్తుత పరిస్థితులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు సవాలుగా ఉన్నాయి. అయినప్పటికీ అన్నదాతలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా కేంద్రం ప్రకటించిన మద్దతు ధర ప్రతి రైతుకు అందే విధంగా పంట మొత్తాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసేలా ముఖ్యమంత్రి ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం ఇప్పటికే మార్క్‌ఫెడ్‌కు 3200 కోట్లు, పౌరసరఫరాల శాఖకు 25 వేల కోట్లు కేటాయించడం కేసీఆర్ అంకిత భావానికి నిదర్శనం.

తెలంగాణ రాష్ట్రంలో ఈ రబీ సీజన్ లో 53 లక్షల ఎకరాల్లో పంట వచ్చే అవకాశం ఉన్నది. ఇందులో 39 లక్షల ఎకరాలలో కోటి మెట్రిక్ టన్నుల వరి, 6 లక్షల ఎకరాల్లో 15 లక్షల టన్నుల మక్క, లక్ష ఎకరాల్లో మిర్చి పండుతున్నది. వరికి 1815 నుంచి 1835 రూపాయలు, మక్కకు 1760 రూపాయలతో కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిలువ చేయడానికి ప్రభుత్వం దగ్గర 24 లక్షల మెట్రిక్ టన్నుల స్థోమత ఉండగా ఇంకా అవసరం అయితే బడులు, కాలేజీ భవనాలలో నిలువ చేయడానికి చర్యలు తీసుకున్నారు. ధాన్యం కొనుగోలుకు దాదాపు 16 కోట్ల గోనె సంచులు అవసరం కాగా, ఇప్పటికే 8 కోట్ల గోనె సంచులు మన దగ్గర అందుబాటులో ఉన్నాయి. అయితే ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో సైతం మిగిలిన వాటిని సమకూర్చేందుకు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంతో మాట్లాడి, తెచ్చేందుకు కేసీఆర్ చర్యలు చేపట్టారు. పంట కోతకు కూలీలు అవసరం కనుక వారిని బిహారు, ఛత్తీస్ గఢ్ తదితర రాష్ట్రాల నుంచి పిలిపించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తెలంగాణలో ఉన్న వరికోత యంత్రాలు సరిపోకపోతే తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి తెప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

కరోనా విలయతాండవం చేస్తున్న తరుణంలో రైతులందరూ ఒకేసారి ధాన్యాన్ని మార్కెట్ యార్డులకు తీసుకురాకుండా పక్కా వ్యూహంతో, రైతులు భౌతిక దూరం పాటించేలా చూడాలనేది కేసీఆర్ ఆలోచన. ఇందుకు పట్టణాలలో ఉన్న వ్యవసాయ మార్కెట్లను మూసివేసి గ్రామాల్లోనే ధాన్య సేకరణ జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దాదాపు 6వేల కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఇక్కడ కూడా రైతులందరూ ఒకేసారి గుమిగూడకుండా ఉండేందుకు టోకెన్ వ్యవస్థ ఏర్పాటు చేశారు.

వచ్చే ఖరీఫ్‌సీజన్‌కు సైతం ఎటువంటి సమస్య లేకుండా విత్తనాలు, ఎరువులు తయారు చేసే కంపెనీలు పనిచేస్తూనే ఉన్నాయి. ప్రస్తుతం ప్రపంచం, దేశం కరోనా నివారణ చర్యల్లో నిమగ్నమైంది. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో సైతం అటు నివారణ చర్యలు చేపడుతూనే, ఇటు రైతాంగానికి అండగా ఉంటున్న ముఖ్యమంత్రి దేశంలో కేసీఆర్ ఒక్కరే.



తెలంగాణలో భిన్నప్రాంతాల, సంస్కృతుల ప్రజలు జీవిస్తున్నారు. కూలి పనుల కోసం, వ్యాపారం కోసం అనేక ప్రాంతాల నుంచి తెలంగాణకు వలస వస్తుంటారు. అసంఘటిత రంగంలో ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా, మధ్యప్రదేశ్, జార్ఖండ్, బిహార్ తదితర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారి సంఖ్య దాదాపు 8 లక్షలు ఉంటుంది. తెలంగాణ రైస్ మిల్లుల్లో 95 శాతం కార్మికులు బిహార్ రాష్ట్రం నుంచి వచ్చిన వారే. కరోనా కారణంగా వారు సొంత ప్రాంతాలకు వెళ్లడం కుదరదు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో ఒక రాజనీతిజ్ఞుడిగా కేసీఆర్ ఆలోచించారు. విపత్తులప్పుడే మానవ స్వభావం బయట పడుతుంది. కేసీఆర్ ఇలాంటి నిరుపేద కూలీలను తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములుగా గుర్తించి, వారు ఆకలితో అలమటించకుండా కడుపులో పెట్టుకొని చూసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ విధంగా యావత్ దేశానికి మార్గదర్శకంగా నిలిచారు. ఈ వలస కార్మికులకు ఒక్కొక్కరికి 12 కిలోల బియ్యం, 500 రూపాయల నగదుతోపాటు, వారు నివసించడానికి అన్ని రకాల సదుపాయాలు కల్పించారు. పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశాలతో ఇతర రాష్ట్రాల కూలీలకు 'అక్షయ పాత్ర' ద్వారా ఉచితంగా భోజన సదుపాయం కల్పించడం విజయవంతంగా జరుగుతున్నది.

> భారత దేశంలో వైద్యుడు – రోగుల నిష్పత్తి చాలా తక్కువ. ఆస్పత్రుల కొరత కూడా ఎక్కువే. ఇటువంటి అనుకోని తీవ్ర విపత్తులు సంభవించినప్పుడు ఆసుపత్రులు, వైద్యుల అవసరం ఎక్కువ అవుతుంది. దూరదృష్టి కలిగిన మన ముఖ్యమంత్రి భవిష్యత్తులో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా, దవాఖానలలో కావలసిన మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నారు. డాక్టర్ల కొరత తీర్చేందుకు డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది తాత్కాలిక నియామకానికి ఆదేశాలు ఇచ్చారు.

భారత దేశంలో వైద్యుడు – రోగుల నిష్పత్తి చాలా తక్కువ. ఆస్పత్రుల కొరత కూడా ఎక్కువే. ఇటువంటి అనుకోని తీవ్ర విపత్తులు సంభవించినప్పుడు ఆస్పత్రులు, వైద్యుల అవసరం ఎక్కువ అవుతుంది. దూరదృష్టి కలిగిన మన ముఖ్యమంత్రి భవిష్యత్తులో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా, దవాఖానలలో కావలసిన మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నారు. డాక్టర్ల కొరత తీర్చేందుకు డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది తాత్కాలిక నియామకానికి ఆదేశాలు ఇచ్చారు.

ప్రజల్లో ఉన్న భయాన్ని, వదంతులను తొలిగించి వారికి భరోసా కల్పించే విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ సాగిస్తున్న కృషిని చూస్తూనే ఉన్నాం. ఇందులో మూడు విషయాలను స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు. 1. ప్రపంచంలో ఏ నాయకుడు చేయని రీతిలో విపత్తును దాని పరిణామాలను వర్తమానంలో, భవిష్యత్తులో ఎలా ఎదుర్కోవాలో వివరిస్తూ వాస్తవాలను అంకెలతో వెల్లడి చేస్తూ అప్రమత్తం చేశారు. 2.ఈ విపత్తు కాలంలో ఆర్థిక వ్యవస్థ, అభివృద్ధి, సంక్షేమ రంగంలో ఎదురయ్యే సవాళ్లను ఎలా ఎదుర్కొంటామో తెలియజేస్తూ, ప్రత్యామ్నాయ మార్గాలను అశేష జన బాహుళ్యం నుంచి బుద్ధి జీవుల వరకు వివరించి ఆత్మ విశ్వాసం కల్పించారు. 3. క్షేత్ర స్థాయిలో ప్రజాప్రతినిధులతో పాటు రెవెన్యూ, వైద్య, పోలీస్ శాఖలను, స్థానిక సంస్థలను సమన్వయంతో పనిచేసేలా సత్వర చర్యలకు సన్నద్ధం చేస్తూ ముందుకు తీసుకు పోవడంలో సీఎం నూటికి నూరు శాతం విజయం సాధించారు. కరోనా కరాల నృత్యాన్ని నియంత్రిస్తూ , వైద్యం ద్వారా మన ప్రాణాన్ని కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు సామాజిక భద్రతను యుద్ధ ప్రాతిపదికన కల్పిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ మనకు దన్నుగా నిలుస్తున్నారు. ఈ తరుణంలో రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ ప్రభుత్వం చెబుతున్న జాగ్రత్తలను విధిగా పాటించాల్సిన అవసరమున్నది. ఏమరుపాటు, దుస్సాహసాలు ప్రాణంమీదికే తెస్తాయన్నది గ్రహించాలి. ఇది వ్యక్తి స్థాయి నుంచి సామాజికంగా అందరూ అనుసరించాలి.

(వ్యాసకర్త: ఎమ్మెల్సీ,
ఛైర్మన్ రైతు బంధు సమితి)

# కేంద్రం కన్నా ముందే అప్రమత్తం

> దుబాయిలో పని చేసే రాజన్న సిరిసిల్లా జిల్లాకు చెందిన కటుకం రవి ఫిబ్రవరిలో వచ్చినప్పుడు హైదరాబాద్ విమానాశ్రయంలో దిగిన తర్వాత ఆయనకు ఎటువంటి వైద్య పరీక్షలు చేయలేదు. అప్పటికి కరోనా మహమ్మారి పీడిస్తున్న చైనా, ఇటలీ, జర్మనీ, స్పెయిన్, ఇరాన్ దేశాల నుంచి వచ్చే ప్రయాణికులకు మాత్రమే పరీక్షలు నిర్వహించారు, అప్పుడు దుబాయి, ఇతర గల్ఫ్ దేశాలలో కూడా కరోనా ప్రభావం ఉన్నట్లుగా కేంద్ర ప్రభుత్వం గుర్తించలేదు.

**విశ్లేషణ**

**ముజఫర్ శేఖ్**

**హైదరాబాద్‌కు** చెందిన 24 ఏండ్ల సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఒక ప్రాజెక్టు పని నిమి త్తం దుబాయికి వెళ్ళి బెంగుళూరుకు వచ్చా రు. ఆయనకు అక్కడ ఎటువంటి పరీక్షలు నిర్వహించలేదు. ఆయన అక్కడి నుంచి హైదరాబాద్‌కు వచ్చి ఆనారోగ్యం పాలైన తర్వాత గానీ కరోనా సోకినట్టుగా తెలియలే దు.ఈ ఉదంతం తర్వాత, గల్ఫ్ దేశాల నుంచి వచ్చే వారి ద్వారా ఇక్కడ కరోనా సోకే ఆవకాశాలున్నట్లుగా ముఖ్యమంత్రి కేసీఆర్ గుర్తించారు. అప్పటికి కేంద్రం ఈ దిశగా అడుగులు వేయలేదు. విమానాల రాకపోకలు కొనసాగుతూనే ఉన్నాయి. అందుకే ఢిల్లీ నుంచి తమిళనాడు వరకు పలు రాష్ట్రాలలో మరణించిన కరోనా రోగులలో అనేకులకు గల్ఫ్ సంబంధం ఉన్నది.

సౌదీఅరేబియా నుంచి వచ్చిన 76 ఏం డ్ల వ్యక్తి కర్ణాటకలో చనిపోయిన తర్వాత గానీ కేంద్ర సర్కారు ఈ ప్రమాదాన్ని అంచ నా వేయలేకపోయింది! గల్ఫ్‌తో పాటు విదేశాల నుంచి వచ్చిన ప్రయాణికుల జాబితాను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ రాష్ట్రాలకు అందజేసింది. తద్వారా తెలంగాణ రాష్ట్రానికి చెందిన 19,313 మంది ప్రయాణికుల వివరాలను అందించింది. కానీ ముందు చూపు కలి గిన తెలంగాణ ప్రభుత్వం కేంద్రం ఇచ్చే జాబితా కోసం వేచి చూడకుండా క్షేత్ర స్థాయిలో ఉన్న తన పటిష్ట యంత్రాంగం ద్వారా విదేశాల నుంచి వచ్చిన వారి వివరాలను సేకరిం చింది. వారి ఇండ్లకు వెళ్ళి స్వీయ నిర్బంధంలో ఉండాల్సిన అవశ్యకతను చెప్పింది. అదే విధంగా, కరీంనగర్‌లో బయటపడ్డ ఇండోనేషియా మతప్రచారకుల విషయమై కూడా ముఖ్యమంత్రి సత్వర చర్యలు తీసు కున్నారు. వీసా వ్యవహారాలు కేంద్ర ప్రభు త్వ పరిధిలోని ఆంశం అయినా.., వారు బస చేసిన ప్రాంత పరిసరాలను పూర్తిగా దిగ్బంధం చేసింది. అనుమానితులను 'క్వారంటైన్'కు తరలించి తమ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించింది.

పోలీసులు, ఆశావర్కర్లు, గ్రామ సచివాలయం ఉద్యోగులు తరచుగా విదేశాల నుంచి భారత్‌కు తిరిగి వచ్చిన వారిని సందర్శిస్తూ వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొంటున్నారు. ఈ రకమైన ముందు జాగ్రత్త చర్యలకు దేశంలో అందరి కన్నా ముందు శ్రీకారం చుట్టిన ఘనత తెలంగాణ సర్కారుకు దక్కుతుంది.ఈ విధంగా కటు కంరవిని కూడా కలిసిన వైద్య సిబ్బంది అతడిని స్వీయ నిర్బంధంలో ఉండాల్సిందిగా విజ్ఞప్తి చేసి ఒప్పించారు. అందుకు ఆంగీకరించిన రవి గ్రామంలో 'హోం క్వారంటైన్'లో గడుపుతున్నాడు.

విదేశాల నుంచి వచ్చిన వారు ముంద స్తు జాగ్రత్త చర్యలు పాటించాలని ఇప్పటికే అనేక సార్లు ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పినంతగా కేంద్ర ప్రభుత్వ పెద్దలు కూడా చెప్పలేదు. ప్రవాసీయులు, వారి సమస్యల విషయంలో ఎంతో అవగాహన కలిగి ఉన్న రాష్ట్రంగా కేరళకు పేరున్నది.కానీ కేరళ ప్రభుత్వం కూడ తమ ప్రవాసీల ద్వారా కరోనా వ్యాపించే ప్రమాదాన్ని అంచనా వేయలేక పోయింది. అందుకే కేరళలో నమోదైన మొదటి కరోనా మరణానికి దుబాయి కోణం ఉన్నదన్నది వెలుగు చూసింది. దీంతో గల్ఫ్ వలసలకు కేంద్ర మైన కాసర్గోడ్ ప్రాంతం అతాలకుతలమైంది. ఈ పరిస్థితి గల్ఫ్ హబ్‌గా పేరు గాంచిన ఉత్తర తెలంగాణలో లేకపోవడానికి కారణం ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు చూపే అనటంలో సందేహం లేదు. ఆయన సూచనలను అనుసరించి ప్రవాసీయులు తమ నివాసంలోనే ఉంటూ భౌతిక దూరా న్ని పాటిస్తూ కరోనా కట్టడిలో భాగస్వా ములవుతున్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు పుణ్యమా అని ఒకప్పటి



తమ కరువు గ్రామంలో ఇప్పుడు వరి పంటలు కళకళాడుతున్నాయి. వ్యవసాయ పనులు చూడటానికి తన మనస్సు పరవళ్ళు తొక్కుతున్నదనీ, కానీ సామాజిక శ్రేయస్సు దృష్ట్యా ఇంట్లో ఉంటున్నానని ఇదే జిల్లాకు చెందిన మరో దుబాయి ప్రవా సీ పేర్కొనటం గమనార్హం.

గల్ఫ్ దేశాలలో బుధవారం వరకు నాలుగు వేలకు పైగా కరోనా కేసులు నమోదయ్యాయి. పదుల సంఖ్యలో మరణించారు. కరోనా పీడితుల్లో సౌదీ అరేబియా అగ్రస్థానంలో ఉన్నది. అమెరికాలో, యూరప్ దేశాలలో తెలంగాణ, అంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వారు అనేక మంది ఉన్నారు. గల్ఫ్ దేశాల ఖతర్ ఏయిర్ వేస్, ఇత్తేహాద్, ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ ద్వారా వీరు ప్రయాణిస్తుంటారు. దీంతో ఏ దేశం వారైనా గల్ఫ్ మీదుగా వచ్చే అవ కాశం ఉన్నది.అందువల్ల తెలంగాణ రాష్ట్రం ముందు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో మంచిదైంది. ■


## బతుకు పుట్టి ముంచుకోకు

ప్రపంచాన్ని ఊగించి
యుద్ధభేరి మోగించి
కరోనా నవ్వుతోంది
మనుషులనే విభజించి!

చేయి చేయి కలుపుకోకు
చేటును కొని తెచ్చుకోకు
నిర్లక్ష్యంగ నువ్వుండి
బతుకు పుట్టి ముంచుకోకు!

కౌగిలింత కరువాయెను
పలకరింత చేదాయెను
ఎదురు తిరిగినోడి శవము
పాడెకైన బరువాయెను!

అది తాగిన రాదన్నరు
ఇది వాడిన చాలన్నరు
సుద్ది చెప్పినోళ్లంతా
తమ ఇండ్లే మేలన్నరు!!



**వెన్నెల సత్యం,**
**9440032210**

## జర పయిలం



ఏడుంటివి ఎట్టుంటివి
ఏందయ్యా ఇదేందయ్యా?
పోరగాడు పల్లెనొదలి
విదేశాలు బోయాడని
డప్పుగొట్టి సెప్పుకోని
గొప్పలెన్నొ బోయినాము!

గుబులు గుబులవుతున్నది
కనపడని బయటపడని
కరోనా మహమ్మారి
ఊపిరి పట్టేత్తుందంట
ఆయువు తీసేత్తుందంట
దానిజోలి నీవెల్లబాక
పక్కోల్ల కలువబాక!


ఏడుంటివో ఆడేవుండు
గత్తిరి బిత్తిరిగాడివయ్యి
మూటముల్లె సదురుకోని
మాస్కుగట్టి ఫ్లైటునెక్కి
మనదేశం రాబాక!

ఏదారిన కాపుకాచి
ఆ దెయ్యం ఎక్కేనో
క్వారెంటైన్ సెంటర్లల్ల
పరేషాను జేస్తరేమో!

కన్నభూమి తల్లిరుణం
పాలించిన ఈ దేశరుణం

తీర్చే ఆరోజొచ్చింది
ఏడుంటివో అట్టనే
ఎట్టుంటివో అట్టనే
పెండ్లం పిల్లలతో
ఎపుడూ పాడేపాట
దొరకని దొంగకాలం
దాన్ని లాక్‌డౌన్ జెయ్యి
కిర్రాక్ పార్టీ జెయ్యి!

ఏడుంటివో ఎట్టుంటివో
కరోనాతో జర పయిలం బిడ్డా!!



**రవి కిషోర్ పెంట్రాల**
**లాంగ్లీ లండన్**

# ఆదర్శ మహిళ సీత



**నమస్తే.. నమస్తే.. నమః**

**- డాక్టర్ రంగి కమల**

మహాభారత, రామాయణాలలోని కథానాయికల పాత్రల (ద్రౌపది, సీత)ను తారతమ్య పరంగా చూసినప్పుడు దేని ప్రత్యేకత దానిదిగా, రెండింటిలోనూ విశేష లక్షణాలు కనిపిస్తాయి. ఈ రెండూ మహేతిహాసాలే. వీటికీ కథా సంవిధానంలో, పాత్రచిత్రణలో ఎంతో భేదం కనిపిస్తుంది. త్రేతా యుగంలోని ధర్మాలకు, ద్వాపరయుగంలోని ధర్మాలకు గల భేదమే ఇందుకు ప్రధాన కారణం. మహాభారతంలోని పాత్రలన్నీ సాధారణ మానవులుగానే స్ఫురిస్తాయి. మనుషుల్లో వుండే బలహీనతలన్నీ వారిలోనూ కనిపిస్తాయి. కానీ, రామాయణం అలా కాదు. ఇందులో గొప్ప ఆదర్శవాదం గోచరిస్తుంది. ఆదర్శ దంపతులకు ఉండవలసిన సకల సలక్షణాలు అన్నీ సీతారాములలో కనిపిస్తాయి. అందుకే, భారతీయులకు వారిద్దరూ మార్గదర్శకులైనారు.

పురుషులలో రాముని వలెనే, స్త్రీల లో సీతయే ఆదర్శమహిళ. సీతా సౌశీ ల్యం, పాతివ్రత్యం, కష్ట సహిష్ణత, భర్తపై అచంచల విశ్వాసం.. వంటివన్నీ ఆమెకు నారీలోకంలో సమున్నతమైన స్థానాన్ని కల్పించాయి. 'సీత–ద్రౌపది'.. వీరిద్దరూ రామాయణ– మహాభారతాల్లో కథానాయికలు. ఇద్దరూ 'అయోనిజలు'గా పేరు పొందిన వారే. ఇద్దరూ భర్తలతో అడవులకేగి అనేక కష్టాలను అనుభవించిన వారే. కానీ, సహనశీలంలో సీతకు సీతయే సాటి. ద్రౌపది బహుభర్తృత్వ ధర్మం వేరు. 'భర్త తోడిదే లోకమని నమ్మిన మహా పతివ్రత' సీత. వన వాసానికి వెళ్లే భర్తతో తానుకూడా వస్తానని బతిమాలి మరీ ఆయనను ఒప్పించింది. 'చచ్చినా బతికినా సతికి పతియే గతి. భర్తకెలాంటి కష్టమూ కలిగించకుండా అతనికి నీడవలె అడవులలోనే ఉండాలి. మగనితో ఉన్నప్పుడు అరణ్యమే అంత:పురం. భర్త లేని స్వర్గమైనా నరకమే. అర్థాంగిగా భర్త సుఖదు:ఖాలలో భాగస్వామి కావాలి. వీరుడైన పురుషుడు తన భార్యను పరుల పంచన వుంచరాద'న్నది ఆమె మార్గం. రావణుడు తన ఐశ్వర్యాన్ని ఘనంగా చెప్పి, ఎంత ప్రలోభ పెట్టినా ఆమె పాతివ్రత్యం అణుమాత్రమైనా సడలలేదు.

సీతాదేవి సహనానికి మారు పేరు. తన భర్త పట్టాభిషేకానికి కైకేయి అంతరాయం కలిగించినా, ఎన్నడూ పల్లెత్తు మాట అనలేదు. మామను నిందించలేదు. భోగభాగ్యాలకు దూరమైనా బాధ పడలేదు. బంధువులకు దూరమయ్యానని అలుక పూనలేదు. భర్తను అనుసరించడమొక్క టే తన కర్తవ్యంగా భావించింది. పర నిం ద ఆమె ఎరుగదు. అరణ్యంలో తనను ఆదరించిన అనసూయతో తన జన్మ, వివాహ వృత్తాంతాలను చెప్పిందే కానీ, తమ వనవాసానికి కారణభూతులైన వారిని గురించి ఒక్కమాటైనా చెప్పలేదు. భరతుని రాకను చూసి లక్ష్మణుడు కోపించాడు. కానీ, సీతమ్మ ముఖంలో చిన్న అసూయకూడా కనిపించలేదు. అరణ్యవాసాన్ని ఆమె కష్టంగానూ భావించలేదు.

ముగ్గురు అత్తలపట్ల సీత ఎంతో గౌరవ మర్యాదలనే చూపింది. వారి ఆదరాన్ని చూరగొన్నది.



రామలక్ష్మణుల స్థితికంటే తన రాకకోసం ఎదురు చూసే కౌసల్యాదేవిని తలచిన తన హృదయం తల్లడిల్లుతున్నదంటూ దు:ఖించింది. ఎట్టి పరిస్థితులలోను భర్త శ్రీరాముని కీర్తి ప్రతిష్ఠలకు భంగం కలుగరాదన్నది సీతమ్మ అభిమతం. తన శాపంతో రావణుని రూపుమాపగల శక్తి కలిగి ఉండికూడా 'ఈ విధంగా చేస్తే రాముని శౌర్య పరాక్రమాదులు లోకానికి వెల్లడి కావనే' ఉద్దేశ్యంతోనే ఆమె రావణుని శపించలేదు. తనను 'వీపుపై ఎక్కించుకొని లంకనుంచి తీసుకొని వెళ్తానని' హన్మంతుడు అన్నప్పుడు.., సీత నిరాకరించింది. 'హనుమా! నేను నీ వెంట రాను. ఎందుకంటే, రావణుని చంపి నన్ను కొనిపోయిన కీర్తి రామునికే దక్కాలి. నువ్వు నన్ను తీసుకొా ని వెళితే రామునికి ఆ కీర్తి ఎలా వస్తుంది? ఆయన శత్రు సంహారం చేయాలన్నదే కదా నా లక్ష్యం' అని అన్నదామె.

రాముడు శీలపరీక్ష కోసం తనను అగ్ని ప్రవేశం చేయమన్నప్పుడు.. లోకనిందకు వెరచి పరిత్యాగం చేసినప్పుడు కూడా సీత హృదయంలో రామునిపైన వున్న అవ్యాజమై న ప్రేమ ఏ మాత్రం సడల లేదు. సీత జీవితమంతా కష్టాలతోనే గడిచింది. భారతీయ స్త్రీ సౌశీల్యానికి ఆమె ఒక సమున్నత ప్రతీక. ఎన్ని కష్టాలు వచ్చినా పాతివ్రత్యం ఇంచుకైనా వీడని ఆదర్శ స్త్రీ మూర్తి ఆమె.

| లాక్‌డౌన్ సమస్యలపై టోల్‌ఫ్రీ నంబర్లు | పౌరసరఫరాలశాఖ ఉ.10 నుంచి సా.5 వరకు 1967 | హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ 100 24/7 | సైబరాబాద్ కమిషనరేట్ 9490617440 | రాచకొండ కమిషనరేట్ 9490617234 | కొవిడ్-19 కాల్‌సెంటర్ 040-23434343 |
|---|---|---|---|---|---|

- గీత దాటితే జరిమానా



కరోనా కట్టడిలో భాగంగా వినూత్న నిర్ణయం తీసుకున్నారు ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముక్రా(కే) గ్రామస్థులు. లాక్‌డౌన్ కొనసాగినన్ని రోజులు తమ ఊరివారు బయటకు వెళ్లినా, ఇతర గ్రామాలవారు ఊళ్లోకి వచ్చినా రూ.వెయ్యి జరిమానా విధిస్తామని నిర్ణయించారు. ఈ మేరకు గ్రామ సర్పంచ్ మీనాక్షి గాడ్గే గురువారం గ్రామ పొలిమేరలో కర్ర చేతపట్టుకొని రాకపోకలు సాగకుండా కాపలా ఉన్నారు. - ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ ప్రతినిధి

- రాజన్న సన్నిధిలో రామయ్య కల్యాణం



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న సన్నిధిలో గురువారం శ్రీసీతారాముల కల్యాణమహోత్సవాన్ని నిరాడంబరంగా నిర్వహించారు. ఆలయం ఎదుట పలువురు శివపార్వతులు దేవుడి వివాహాన్ని తమ పెండ్లిగా భావించి తలువాలు పోసుకున్నారు. - వేములవాడ కల్చరల్

- 'మీ కోసం మేమున్నాం'




లాక్‌డౌన్‌లో భాగంగా పలు శాఖల వారు సేవలందిస్తున్న తీరును కళ్లకు కట్టినట్టు చిత్రీకరించారు మంచిర్యాల జిల్లా సీసీసీకి చెందిన బైరి నరేశ్. ఓ చేతిలో రాష్ర్టాన్ని మోస్తున్న సీఎం కేసీఆర్.. మరోవైపు విధుల్లో వైద్యులు, పోలీసులు, పారిశుద్ధ్య సిబ్బంది, మీడియా పాత్రను కీర్తిస్తూ గీసిన చిత్రం విశేషంగా ఆకట్టుకున్నది. - మంచిర్యాల అగ్రికల్చర్

# మద్దతు ధరకే మక్కలు

## కొనుగోళ్లకు రూ.3,243 కోట్లు కేటాయింపు

- వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి
- వరంగల్ రూరల్ జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**హైదరాబాద్/వరంగల్‌రూరల్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో యాసంగి మక్కల కొనుగోలు కోసం ప్రభుత్వం రూ.3,213 కోట్లు కేటాయించినట్టు వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చెప్పారు. మద్దతు ధర క్వింటాల్‌కు రూ.1,760 చెల్లించి ప్రభుత్వమే నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నదన్నారు. వరంగల్ రూరల్ జిల్లా నెక్కొండ, చెన్నారావుపేట మండలం అమీనాబాద్, నర్సంపేట మండలం ముథోజిపేటలో గురువారం మక్కజొన్న కొనుగోలు కేంద్రాలను పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. యాసంగి సీజన్‌లో 14 లక్షల టన్నుల మక్కల కొనుగోలుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందని చెప్పారు. 53వేల ఎకరాల్లో మక్క జొన్న సాగుచేసి రాష్ట్రంలో నర్సంపేట నియోజకవర్గం ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు నిర్ణీత దూరం పాటించాలని పిలుపునిచ్చారు. రైతులు విడుతలవారీగా కేంద్రాలకు వచ్చేలా అధికారులు కూపన్లు ఇవ్వాలని మంత్రి సూచించారు. అనంతరం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ కాళేశ్వరం నీటితో ఎస్సారెస్పీ కాల్వల ద్వారా చెరువులు నింపడం వల్ల అన్నిచోట్ల పంటలు బాగా పండాయన్నారు. రైతుకు భరోసా ఇవ్వడానికే ప్రభుత్వం మక్కలను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్న దన్నారు. ఆయా కార్యక్రమాల్లో నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ హరిత పాల్గొన్నారు.



వరంగల్ రూరల్ జిల్లా నెక్కొండలో మక్కల కొనుగోళ్లను ప్రారంభిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

### మొబైల్ రైతు బజార్లను పెంచాలి

**నక్కలగుట్ట:** కరోనా నేపథ్యంలో ప్రజలు రోడ్లపైకి రాకుండా మొబైల్ రైతు బజార్ల సంఖ్యను పెంచాలని మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశించారు. గురువారం వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండ ఎక్సైజ్ కాలనీలోని రైతుబజార్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్‌లో క్రయవిక్రయాలు జరిపే ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించాలని కోరారు. నగరంలో ఇప్పటికే 20 మొబైల్ రైతు బజార్లతో కూరగాయలు విక్రయిస్తున్నామని ఏనుమాముల మార్కెట్ కమిటీ చైర్మన్ చింతం సదానందం మంత్రుల దృష్టికి తీసుకెళ్లగా మరిన్ని రైతుబజార్లను అందుబాటులోకి తేవాలని వారు సూచించారు.

## విరివిగా మొబైల్ రైతుబజార్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రజలకు సజావుగా కూరగాయలు, పండ్లు అందించడానికి వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖలు గట్టి నిఘాపెట్టాయి. వాహన డ్రైవర్లు, హమాలీల సమన్వయంతో రైతుబజార్లు, మార్కెట్లు, క్లస్టర్ల మధ్య వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు, ఎస్టేట్ ఆఫీసర్లు పటిష్ఠ రవాణా వ్యవస్థ రూపొందించారు. 18 క్లస్టర్లు, 15 మార్కెట్లు, 43 రైతుబజార్ల ద్వారా నిత్యం 29 వేల క్వింటాళ్ల కూరగాయలు పంపిణీచేస్తున్నారు. ఒక్క జీహెచ్‌ఎంసీ పరిధిలోని బోయిన్‌పల్లి, గుడిమల్కాపూర్ మార్కెట్ల నుంచే 12 రైతుబజార్ల పరిధిలో 20 లక్షల కుటుంబాలకు కూరగాయలు సరఫరాచేస్తున్నారు. రైతుబజార్లలో రద్దీ ఏర్పడకుండా మొబైల్ రైతుబజార్లను అందుబాటులోకి తెచ్చారు. 200 వాహనాలతో మొబైల్ రైతుబజార్లను నిత్యం 500 ప్రాంతాల్లో, ప్రతివారం 3,500 ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారు. అగ్రికల్చర్, హార్టికల్చర్, మార్కెటింగ్‌తోపాటు పోస్టల్‌శాఖ వాహనాలను కూడా కూరగాయల రవాణాలో భాగస్వామ్యం చేస్తున్నారు.



కారులోంచి ప్రజలకు సూచనలిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

## స్వీయ నిర్బంధమే మందు

### స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

**బాన్సువాడ, నమస్తేతెలంగాణ:** ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా మహమ్మారికి స్వీయ నిర్బంధమే మందు అని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం ఆయన కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణం, చిన్నరాంపూర్, ఇబ్రహీంపేట్, పోచారం, బీర్కూర్, కోటగిరి, రుద్రూర్ మండలాల్లో పర్యటించారు. వాహనంలో తిరుగుతూ మైక్ ద్వారా కరోనా వైరస్ నియంత్రణ చర్యలను ప్రజలకు వివరించారు. కూరగాయలు, నిత్యావసర వస్తువుల కొనుగోలుకు గుంపులు గుంపులుగా రావొద్దని, నిర్ణీత దూరాన్ని పాటించాలని కోరారు.



గజ్వేల్‌లో పట్టణంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

## హరీశ్ నోట.. 'హదిస్' పంక్తులు

- లాక్‌డౌన్‌లో గడప దాటొద్దని పిలుపు
- సంగారెడ్డి, గజ్వేల్‌లో పర్యటించిన మంత్రి

**సంగారెడ్డి ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు నోట 'హదిస్' పంక్తులు వినిపించాయి. రాష్ట్రంలో రోజురోజుకు కరోనా పాజిటివ్ కేసులు పెరుగుతుండటంతో ఎక్కడివారు అక్కడే ఉండాలని మైనార్టీలకు అర్థమయ్యేలా 'హదిస్' (నీతి వ్యాఖ్యలు బోధించే ఒక గ్రథం)లోని పంక్తులను ఉటంకించారు.

**అగర్ ఆప్ తావూన్‌కి వబాకే బారేమే సున్‌తే హై..**
**అగర్ తావూన్ తూట్ జాతా హై ఆప్‌కి జగాహ్ మే..**
**ఆప్‌కీ జగాహ్ ఛోడ్‌కే నహీ జాయే..**

**సారాంశం:** 'మీరు ఒక దేశంలో ప్లేగు వ్యాప్తి గురించి విన్నట్టయితే.. అక్కడికి వెళ్లొద్దు..

మీరు అక్కడ ఉన్నప్పుడు ప్లేగు ఆ ప్రదేశంలో చెలరేగితే.. ఆ స్థలాన్ని వదిలిపోవద్దు.'

సంగారెడ్డిలో గురువారం కరోనా పాజిటివ్ కేసులు నమోదవడంతో హుటాహుటిన అక్కడికి చేరుకొన్న మంత్రి హరీశ్‌రావు.. ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి కలెక్టర్ హనుమంతరావు, ఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. అంతకుముందు మంత్రి గజ్వేల్‌లోనూ పర్యటించారు. అనంతరం సంగారెడ్డిలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో ఒకేరోజు ఆరు కేసులు నమోదైన నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈ ఆరుగురి కుటుంబాల్లోని 43 మందిని పర్యవేక్షణ కేంద్రానికి పంపించినట్టు చెప్పారు. వీరి ఇండ్లకు దాదాపు 2 కిలోమీటర్ల పరిధిలో నివసిస్తున్నవారికి వైద్యసిబ్బంది పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. మైనార్టీలు నివసించే ప్రాంతాల్లో ఎక్కువ కేసులు నమోదవుతున్నందున ఆయా పరిధిలో ఉండేవారు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. లాక్‌డౌన్ నేపథ్యంలో ఎవరూ గడపదాటవద్దని, ఇంటికే పరిమితం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, వైద్యసిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తిచేశారు. రోజురోజుకు పాజిటివ్ కేసులు పెరుగుతున్నందున ఎక్కడివారు అక్కడే ఉండాలని మైనార్టీలకు అర్థమయ్యేలా హదిస్‌లో కూడా పిలుపునిచ్చారు.

# వలస కూలీలకు నిత్యాన్నదానం

- మాజీ ఎంపీ కవిత దాతృత్వం
- లాక్‌డౌన్ రోజుల్లో అన్నదానం

**నమస్తే తెలంగాణ ప్రతినిధి, నిజామాబాద్:** నిరుపేదల ఆకలి తీర్చేందుకు నిజామాబాద్ మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత ముందుకొచ్చారు. కరోనాతో ఉపాధి కోల్పోయిన వలసకూలీల కడుపు నింపేందుకు నిత్యాన్నదానం ప్రారంభించారు. నగర శివారులోని రైస్‌మిల్లులు, ఇతర కంపెనీల్లో పనిచేసే కూలీలు, గంజ్‌లోని హమాలీల కోసం గురువారం ఉచిత భోజన కార్యక్రమాన్ని నగరంలోని లలితామహల్ టాకీస్ దగ్గర ప్రారంభించారు. నిత్యం 500మందికి తగ్గకుండా భోజనానికి ఏర్పాట్లు చేశారు. జాగృతి జిల్లా అధ్యక్షుడు అవంతిరావు, టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రాంకిషన్‌రావు, మేయర్ నీతూ కిరణ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాగా కవిత ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా దవాఖాన రోగులకు, వారి బంధువుల ఆకలి తీర్చేందుకు నిత్యాన్నదాన కార్యక్రమాన్ని గురువారం జెడ్పీ చైర్‌పర్సన్ వసంతతో కలిసి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ప్రారంభించారు.




గురువారం నిజామాబాద్ నగరంలోని లలితామహల్ థియేటర్ వద్ద కూలీలకు భోజనం వడ్డిస్తున్న మేయర్ నీతూ కిరణ్, జాగృతి నాయకులు



వనపర్తిలో బాలుడితో మాట్లాడుతున్న ఎస్పీ అపూర్వరావు

## కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

వ్యక్తిపై దురుసుప్రవర్తన • మంత్రి కేటీఆర్ ఆదేశాలతో చర్యలు

**వనపర్తి టౌన్:** నిత్యావసరాలు కొనుగోలు చేసేందుకు కొడుకుతో కలిసి వెళ్తున్న ఓ వ్యక్తితో దురుసుగా ప్రవర్తించిన కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటుపడింది. వనపర్తికి చెందిన మురళి తన కొడుకుతో కలిసి బుధవారం సాయంత్రం బైక్‌పై కొత్తబస్టాండ్‌కు వచ్చారు. విధుల్లో ఉన్న పోలీసులు వాహనాన్ని సీజ్ చేస్తున్నట్టు చెప్పారు. మురళి బతిమాలాడుతుండగా ఆవేశానికి గురైన కానిస్టేబుల్ అశోక్ అతడిని విచక్షణారహితంగా కొట్టాడు. అనంతరం మురళి, అతని కొడుకును స్టేషన్‌కు తరలించారు. ఓ వ్యక్తి ఈ ఘటన వీడియోను మంత్రి కేటీఆర్‌కు ట్విట్టర్‌లో పోస్ట్‌చేశారు. మంత్రి కేటీఆర్ సూచన మేరకు వనపర్తి ఎస్పీ అపూర్వరావు సదరు కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. అనంతరం ఆమె మురళి కొడుకుని కలిసి మాట్లాడారు.

# నిరుపేదలకు దన్నుగా..

- కొనసాగుతున్న బియ్యం వితరణ
- తెల్లరేషన్ కార్డుదారుల ఉదారత
- అనురాధ స్ఫూర్తితో నిండుతున్న డ్రమ్ములు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** పేదల ఆకలి దానిని అనుభవించిన మరో పేదకే తెలుసు.. తమ కడుపు సగం ఖాళీ ఉన్నా ఫర్వాలేదు.. తోటిపేద కడుపు సగమైనా నింపితేచాలు అనే 'తెల్ల'ని మనసుతో ముందుకొస్తున్నారు పలువురు. లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రభుత్వం అందజేస్తున్న బియ్యంలోనే కొంతమేర వలసకూలీలు, నిరుపేదలకు దానం చేస్తూ తెల్లరేషన్‌కార్డుదారులు ఉదారతను చాటుకుంటున్నారు. బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలం తుర్కపల్లిలో నిరుపేద, వింతతువు అనురాధ తనకొచ్చిన బియ్యంలో సగం దానంచేయడాన్ని స్ఫూర్తిగా తీసుకొని చాలామంది ముందుకొస్తున్నారు. శామీర్‌పేట తాసిల్దార్ గోవర్ధన్ ఆధ్వర్యంలో మండలంలోని అన్నిరేషన్ షాపుల వద్ద బియ్యం దానం చేసే దాతలకోసం డ్రమ్ములు ఏర్పాటుచేశారు. బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు అందులో కొంత 'కార్డులేని నిరుపేదలకు ఇవ్వండి' అంటూ డ్రమ్ములలో పోస్తున్నారు. కొందరు సగానికిపైగా అక్కడే ఇచ్చిపోతున్నారు. జిల్లాలోని ఘట్‌కేసర్, శామీర్‌పేట, కుత్బుల్లాపూర్ మండలాలపరిధిలో గురువారం ఒక్కరోజే 58 క్వింటాళ్ల బియ్యం దాతల నుంచి వచ్చాయని, ఇందులో 57 క్వింటాళ్లు కార్డులేని పేదలకు పంపిణీచేసినట్టు అడిషనల్ కలెక్టర్ విద్యాసాగర్ 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. అనురాధ స్ఫూర్తితో మేడ్చల్ మల్కాజిగిరితోపాటు ఇతర జిల్లాల్లోనూ బియ్యం దానం చేసేందుకు లబ్ధిదారులు ముందుకొస్తున్నారని చెప్పారు. సిరిసిల్ల, జగిత్యాల, జనగామ, నల్లగొండ తదితర జిల్లాల్లోనూ అధికారులు ఏర్పాట్లు చేసినట్టు అడిషనల్ కలెక్టర్ విద్యాసాగర్ తెలిపారు.



శామీర్‌పేటలోని రేషన్ దుకాణం వద్ద ఏర్పాటుచేసిన డ్రమ్ములో తమకొచ్చిన బియ్యం పోస్తున్న మహిళ

### పింఛన్ డబ్బులతో సరుకుల వితరణ

**ఎల్లారెడ్డిపేట:** లాక్‌డౌన్ నేపథ్యంలో మానతామూర్తులు తమ కు తోచిన రీతిన పేదలకు అండగా నిలుస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్టతండాకు చెంది న వృద్ధురాలు భూక్యా జగ్గవ్వ తన రెండు నెలల పింఛన్ డబ్బులతో 6వ వార్డులోని పేదలకు నిత్యావసర సరుకులను అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. పప్పు, చక్కెర, చాయ్‌పత్తిని కొనుగులు చేసి, వాటిని డబ్బాల్లో పెట్టి ఇంటింటికీ అందజేశారు. జగ్గవ్వ పెద్ద మనసును స్థానికులు అభినందించారు. 20 ఏండ్ల క్రితమే జగ్గవ్వ భర్త చనిపోగా, ఆమె ఆరుగురు కొడుకులు వేరుగా ఉంటున్నారు.




## ఆ అమ్మ సంకల్పం గొప్పది

### అనురాధకు కేటీఆర్ అభినందనలు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** తాను పేద అయినప్పటికీ మరో పేద కుటుంబానికి బియ్యం అందజేసిన శామీర్‌పేట మండలం తుర్కపల్లికి చెందిన అనురాధకు మంత్రి కేటీఆర్ ట్విట్టర్‌లో అభినందనలు తెలిపారు. 'అమ్మా నీకు వందనం' శీర్షికతో 'నమస్తే తెలంగాణ'లో గురువారం ప్రచురితమైన కథనాన్ని ట్విట్టర్‌లో షేర్ చేస్తూ బీపీఎల్ (దారిద్ర రేఖకు దిగువన) పరిధిలో ఉన్నప్పటికీ తనకొచ్చిన రేషన్‌లో సగం దానంచేయడం గొప్ప విషయమన్నారు. 'తన పిల్లలతో పాటు, పేద కుటుంబాలకు చెందిన వ్యక్తుల ఆకలి తీర్చాలనే అనురాధ సంకల్పం గొప్పది' అని కేటీఆర్ ట్వీట్‌చేశారు.

## 'శ్రీచైతన్య'లో ఆన్‌లైన్ తరగతులు

- రేపట్నుంచి ఐఐటీ-జేఈఈ, నీట్ విద్యార్థులకు టెలివిజన్ క్లాసులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లాక్‌డౌన్ నేపథ్యంలో తమ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఆటంకం లేకుండా ఆన్‌లైన్ తరగతులు ఇప్పటికే ప్రారంభించినట్టు శ్రీచైతన్య విద్యాసంస్థల యాజమాన్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ-ప్రజ్ఞా ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా వెబ్, ఆండ్రాయిడ్ మాధ్యమంతో మొబైల్, ట్యాబ్, పీసీలలో క్లాసులకు లక్షల మంది విద్యార్థులు హాజరవుతున్నారని పేర్కొన్నది. ఆన్‌లైన్ పరీక్షల్లో పాల్గొంటూ తమ ప్రతిభను తెలుసుకుంటున్నారని వెల్లడించింది. శనివారం నుంచి ఐఐటీ-జేఈఈ, నీట్‌కు ప్రిపేరయ్యే విద్యార్థుల కోసం విస్సా టీవీ, రాజ్‌న్యూస్‌లో టీవీ క్లాసులు మొదలవుతాయని వివరించింది. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరింది.



కరీంనగర్‌లో బియ్యం పంపిణీ చేస్తున్న మంత్రి గంగుల కమలాకర్

## ఇది అత్యంత కీలకదశ

### బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల

**కార్పొరేషన్, నమస్తేతెలంగాణ:** కరోనా వైరస్ వ్యాప్తిచెందకుండా ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి సహకరించాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ కోరారు. ప్రస్తుతం వైరస్ అత్యంత కీలకదశకు చేరుకున్నందున మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. గురువారం కరీంనగర్‌లోని 9వ డివిజన్‌లో ఉచిత బియ్యం, పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ప్రాణాలను లెక్క చేయకుండా వైద్య సేవలందిస్తున్న వైద్యులపై దాడి చేయడం సరికాదన్నారు.

- ఇంటికే ఉచిత బియ్యం..



లాక్‌డౌన్ నేపథ్యంలో కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం శేర్‌ఖాన్‌పల్లిలో గురువారం ట్రాక్టర్‌పై ఇంటింటికీ తిరుగుతూ రేషన్ బియ్యం పంపిణీ చేశారు.
- కామారెడ్డి ప్రతినిధి, నమస్తే తెలంగాణ

# జిందగీ

## మయూరానందం



**లాక్‌డౌన్** కారణంగా రోడ్లన్నీ నిర్మానుష్యం అవుతున్నాయి. దీంతో జంతువులు, పక్షులు వీధుల్లోకి వస్తున్నాయి. ఇది ముంబైలో మరీ ఎక్కువ. కొన్ని రోజులుగా అక్కడి రోడ్ల మీద నెమళ్లు కనువిందు చేస్తున్నాయి. ఆ దృశ్యాల్ని ప్రముఖ ఫొటోగ్రాఫర్ మానవ్ మంగ్లాని తన కెమెరాలో బంధించి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశాడు. 'నిజానికి ఈ భూగోళం మూగజీవాలది. మనిషి ఏకులా వచ్చి మేకై కూర్చున్నాడు. అతను బయట ఉన్నంతకాలం అవి లోపల తలదాచుకున్నాయి. అతను లోపలికే పరిమితం కావడంతో ధైర్యంగా బయటికొచ్చాయి' అంటాడు ఆయన.



# అంతర్జాలంలో...

**కరోనా తాకిడికి యావత్ ప్రపంచం బందీ అయిపోయింది. విచిత్రమైన పరిస్థితుల్లో సుదీర్ఘ సెలవులు వచ్చాయి. బయటకు వెళ్లడానికి లేదు. విందులు, వినోదాలు, విహారాలు అన్నీ బంద్. అందరూ ఇంట్లోనే.. అన్నీ ఇంట్లోనే. ఈ సమయంలో పిల్లలకూ.. పెద్దలకూ.. అన్నింటికీ ఆసరాగా నిలుస్తున్నది అంతర్జాలం. విద్య అయినా.. వైద్యమైనా.. వినోదమైనా.. విహారమైనా... ఇంటర్నెట్‌లోనే. హాస్పిటల్‌కు వెళ్లలేనివారికి ఆన్‌లైన్ ద్వారానే వైద్యసేవలు లభిస్తున్నాయి. విద్యా సంవత్సరం కోల్పోకుండా విద్యార్థులకు ఆన్‌లైన్ పాఠాలు మొదలయ్యాయి. పోటీ పరీక్షల కోచింగ్ సైతం ఇంటర్నెట్ ద్వారానే. ఆటపాటలకు, వంటింటి రుచులకు కూడా... అంతర్జాలమే దిక్కు. ఒక్కమాటలో చెప్పాలంటే.. కరోనా సెలవులను ఇంటర్నెట్ శాసిస్తున్నది.**

విద్య, వైద్యం, వినోదం, వ్యాయామం... ఒకటేమిటి?! ఆన్‌లైన్‌కు కాదేదీ అనర్హమన్నట్లుగా... కరోనా విసిరిన 'వల'తో ఇప్పుడు ప్రపంచమే ఇంటర్నెట్‌లో చిక్కుకుపోయింది. ఏ పనికైనా 'ఆన్‌లైన్' ఒక్కటే శరణ్యమైంది. కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించేందుకు దేశమంతా లాక్‌డౌన్ ప్రకటించడంతో అన్ని రంగాలూ స్తంభించిపోయాయి. దీంతో మార్కెటింగ్‌కు ఆన్‌లైన్ అస్త్రంగా మారింది. ఇ-సేవలకు డిమాండ్ పెరిగింది. మారుమూల పల్లెల్లోనూ ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులో ఉండటంతో... అష్టదిగ్బంధ సమయంలోనూ అందరినీ ఒకే తాటిపైకి తీసుకురావడం చాలా సులువైంది. వ్యాపార, వాణిజ్య, సాంస్కృతిక సంస్థలు ప్రత్యేక యాప్‌లతో వినియోగదారులకు మరింత చేరువవుతున్నాయి.

**ఇ-కచేరీలు...**

వివిధ ప్రైవేటు దవాఖానలు ప్రత్యేక యాప్‌లతో ఉచితంగా ఆన్‌లైన్‌లోనే వైద్యుడిని సంప్రదించే వెసులుబాటు కల్పిస్తున్నాయి. విద్య, వినోదం వంటి వాటిని కూడా అనేక సంస్థలు ప్రస్తుతానికి ఉచితమనో, ఒక రూపాయి చెల్లిస్తే చాలనో నామమాత్రపు ధరకే సేవలు మొదలుపెట్టాయి. ఇదంతా మార్కెటింగ్ టెక్నిక్‌లో భాగమే కావచ్చు. ప్రజలకు కూడా ప్రత్యామ్నాయం లేని పరిస్థితి. వ్యాయామ కోచ్‌లు, యోగా గురువులు ప్రత్యేక యాప్‌లు రూపొందించుకున్నారు. పదిమంది చొప్పున ఒక బ్యాచ్‌గా... ఆయా సమయాల్లో ఆన్‌లైన్‌లోనే యోగా, వ్యాయామ పాఠాలు చెప్తున్నారు. ముంబైలోని ఒక సాంస్కృతిక సంస్థ సంగీత, నృత్య ప్రదర్శనలను కూడా ఆన్‌లైన్‌లోనే అందుబాటులోకి తెచ్చింది. షో వివరాల్ని ముందుగానే ప్రకటిస్తారు. బుక్ చేసుకున్న వారికి ప్రత్యేకంగా ఐడీలు ఇస్తారు. సమయానికి లాగిన్ అయిపోయి... ప్రదర్శనల్ని ఆస్వాదించవచ్చు.

**వేడుకలకూ ...**

పుట్టినరోజు వేడుకలు, కిట్టీ పార్టీల వంటివి ఇప్పుడు ఆన్‌లైన్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. కరోనా వ్యాప్తి భయంతో వివాహాల వంటివి వాయిదా వేసుకోవడం సహజం. కానీ ఈ చిన్నపాటి వేడుకలను రద్దు చేసుకోవడం ఎందుకని... ఆన్‌లైన్‌లోకి బంధుమిత్రులను ఆహ్వానిస్తున్నారు. ఇటు పక్క కేక్ కట్‌చేయగానే... అటుపక్క ఆన్‌లైన్‌లో ఉన్న వారంతా 'హ్యాపీబర్త్‌డే' అంటూ కేరింతలు కొడుతున్నారు. ఇక కిట్టీ పార్టీల్లో మహిళలంతా ఆన్‌లైన్‌లోకి వచ్చి ముచ్చట్లు చెప్పుకోవడమే కాదు, అంత్యాక్షరితో హాయిగా కాలం గడుపుతున్నారు.

**ఆన్‌లైన్‌లో పాఠాలు...**

పదోతరగతి, ఇంటర్, వివిధ పోటీపరీక్షలకు సంబంధించిన కోచింగ్‌లు.. లాక్‌డౌన్‌లోనూ యథావిధిగా కొనసాగుతున్నాయి. విద్యార్థి ఇంట్లోనే కూర్చుని జూమ్ లైవ్‌లోకి ప్రవేశిస్తున్నాడు. వ్యక్తిగత ఐడీ నంబర్లు కేటాయిస్తున్నందున సంబంధిత విద్యార్థులే లాగిన్ అవుతున్నారు. ముందుగా జూమ్ యాప్‌ను ప్లేస్టోర్/యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో జాయిన్ మీటింగ్‌పై క్లిక్ చేసి కాలేజీ యాజమాన్యం ఇచ్చిన ఐడీ నంబరుతో లాగిన్ కావాలి. తరగతి గదిలో మాదిరిగానే లెక్చరర్ బోధన ప్రారంభిస్తారు. ఒకేసారి 300-400 మంది విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతానికి కేవలం బోధన మాత్రమే కొనసాగుతుంది. లాక్‌డౌన్ మరింత పొడిగిస్తే ఇంటరాక్టివ్ సెషన్స్ కోసం కూడా కొన్ని కాలేజీలు కసరత్తు చేస్తున్నాయి. పదో తరగతి విద్యార్థులకైతే గణితం, సైన్స్, ఇంగ్లిషు.. ఇంటర్మీడియట్ విద్యార్థులకు గణితం, జీవ-జంతు శాస్త్రాలతో పాటు రసాయన, భౌతికశాస్త్రాలు బోధిస్తున్నారు.

**వైద్యసేవలు కూడా...**

లాక్‌డౌన్ పరిస్థితుల్లో వైద్య సదుపాయాలు కూడా ఆన్‌లైన్‌లోకి వచ్చాయి. అనేక దవాఖానలు ప్రత్యేక యాప్‌లు, టోల్‌ఫ్రీ నెంబర్లు రూపొందించుకొన్నాయి. అపోలో దవాఖాన http//nmc.sg/cSDvR4 టెలీ మెడిసిన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే 24 గంటల పాటు ఆన్‌లైన్ వైద్య సేవలు పొందవచ్చు. రోగి అవసరానికి అనుగుణంగా సలహాలు ఇస్తారు. లేదంటే, ముందస్తు అపాయింట్‌మెంట్ ద్వారా వైద్యుడు వీడియోకాల్‌లో అందుబాటులోకి వస్తారు. కిమ్స్ దవాఖానకు చెందిన 040-44885000 నంబర్‌కు ఫోన్‌చేసి రోగులు తమ వివరాలిస్తే ఆన్‌లైన్‌లోనే సంబంధిత నిపుణులు వైద్య సలహాలిస్తారు. ఇందుకు రుసుము వసూలు చేస్తారు. యశోద దవాఖానలో.. 040-45674567 నంబర్‌కు ఫోన్ చేయడం ద్వారా కానీ www.yashodahospitals. com వెబ్‌సైట్ ద్వారా కానీ రోగులు తాము కోరుకున్న వైద్యుడి సేవల్ని పొందే అవకాశమున్నది. వైద్య సంప్రదింపులకు రుసుము ఉంటుంది. సన్‌షైన్ దవాఖానలో అయితే, 040-44550000 నంబర్‌కు ఫోన్‌చేసి అన్ని వివరాలిస్తే మన మొబైల్‌కు ఎం-ఫిన్ అనే హెల్ప్‌లైన్ లింకును పంపుతారు. దాన్ని క్లిక్ చేస్తే వైద్యులు అందుబాటులోకి వస్తారు. ప్రస్తుతం విపత్కర పరిస్థితుల దృష్ట్యా ఈ సేవల్ని ఉచితంగా అందిస్తున్నామని హాస్పిటల్ వర్గాలు తెలిపాయి. 'ఈ సమయంలో ఆన్‌లైన్ వైద్య సేవలు అందుబాటులోకి రావడం మంచి పరిణామం. వైద్యుడిని సంప్రదించడంలో ఆలస్యమైతే ఏమవుతుందోనని ఆందోళన పడిపోయే రోగులకు ఈ సేవల ద్వారా భరోసా లభిస్తుంది. విద్య, సాంస్కృతిక రంగాలనూ ఇవి ప్రభావితం చేయడం మంచి పరిణామమే' అంటారు హైదరాబాద్‌లోని హస్తినాపురానికి చెందిన కోట్ల వేణుగోపాల్. కొసమెరుపు ఏమిటంటే... బాలీవుడ్ భామ మాధురీదీక్షిత్ కూడా ఆన్‌లైన్‌లో డాన్స్ క్లాసులు ప్రారంభిస్తున్నారు. ఆసక్తి ఉంటే మీరూ చేరవచ్చు.

### ఎన్నో మార్గాలు...

**స్కైప్**

ఎమ్ఎన్‌సీలలో పనిచేసేవారికి ఈ యాప్ సుపరిచితమే. ఫోన్, ల్యాప్‌టాప్‌లలో ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఒకేసారి 50మందికి వీడియో, ఆడియో కాల్స్ చేయొచ్చు.

**గూగుల్ డ్యుయో**

ఈ వీడియో కాలింగ్ సేవలు వినియోగించడానికి ఫోన్ నంబరు ఉంటే చాలు. ఈ యాప్‌ని ఐఓఎస్, ఆండ్రాయిడ్ ఫోన్లలో ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఒకేసారి పన్నెండు మందితో గ్రూప్ వీడియోకాల్స్ చేసుకోవచ్చు. పెద్ద కుటుంబాలకు, చిన్న ఆఫీసు మీటింగ్‌లకూ బాగా పనిచేస్తుంది.

**గూగుల్ హ్యాంగవుట్స్**

ఫోన్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్.. ఎక్కడైనా దీన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. కావాల్సిందల్లా జీ మెయిల్ ఐడీ, పాస్‌వర్డ్. అవతలివారికి కూడా జీమెయిల్ అకౌంట్ ఉండాలి. ఒకేసారి కనీసం పదిమందితో వీడియోకాల్‌లో మాట్లాడొచ్చు.

**ఫేస్‌టైమ్**

ఆపిల్ ఫోన్ వాడేవాళ్లకి మాత్రమే ఈ యాప్ అందుబాటులో ఉంటుంది. ఐఓఎస్ 12 విడుదల కాకముందు వరకు, ఒకరితోనే మాట్లాడుకొనే అవకాశం ఉండేది. ఈ ఉచిత యాప్ ద్వారా ఇప్పుడు 32మందితో వీడియో కాల్‌లో కనెక్ట్ కావచ్చు.

**టాకీ**

ఈ యాప్ కోసం ప్రత్యేకించి సైన్‌అప్ అవ్వాల్సిన పన్లేదు. హోమ్ పేజీలో ఎంటరయితే చాలు. ఆడియో, వీడియో కాల్ సెట్టింగ్స్ చేసుకుంటే సరిపోతుంది. ఇది ఒక బ్రౌజ్ బేస్డ్ చాట్. సాఫ్ట్‌వేర్ అవసరం లేదు. దీని ద్వారా 15మందితో మాట్లాడొచ్చు.


## జలుబు ఉంది.. కరోనా టెస్టు చేయించాలా?

సందేహం సమాధానం



**నాకు 42 ఏండ్లు. రెండు రోజులుగా జలుబు . తలనొప్పి కూడా ఉంది. ఈమధ్య కాలంలో ఎక్కడికీ ప్రయాణం చేసింది లేదు. కానీ కూరగాయల కోసమో, మందుల కోసమో అడపాదడపా బయటకు వెళ్తున్నాను. జలుబు ఉంది కాబట్టి , ఇప్పుడు నేను కొవిడ్-19 పరీక్ష చేయించుకోవాలా?**
**- నీలిమ,** కామారెడ్డి

**కొవిడ్ -19కి** ఒక్కోదేశంలో ఒక్కో రకమైన లక్షణాలు కనిపిస్తున్నాయి. మన దేశంలో కరోనా ముఖ్యంగా జ్వరంతో మొదలవుతుంది. గొంతునొప్పి ఉంటుంది. ఆ తరువాత నిస్సత్తువ, నీరసం, ఒళ్లునొప్పులు ఉంటాయి. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవాళ్లు.. దగ్గుతో పాటు రెండు మూడు రోజుల్లో తీవ్రమైన ఆయాసంతో బాధపడుతారు. ఆక్సిజన్ శాతం తక్కువైపోయి ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడుతారు. ఇవి మన భారతీయుల్లో కొవిడ్ -19 లక్షణాలు. ఇలా కాకుండా కేవలం జలుబు మాత్రమే ఉండి, మిగతా లక్షణాలు, అంటే... దగ్గు, ఒళ్లునొప్పులు, నీరసం, ఆయాసం లాంటివేవీ లేకపోతే భయపడాల్సిన అవసరం లేదు. మనవాళ్లకు అలర్జిక్ రైనైటిస్, సైనస్ లాంటి సమస్యలు సర్వసాధారణం. అందువల్ల అలర్జీ వల్ల కూడా జలుబు లక్షణాలు కనిపించవచ్చు. మీరు కొవిడ్ పాజిటివ్ పేషెంట్లను కలిసి వున్నా, గత 14 రోజుల క్రితం వేరే దేశం నుంచి వచ్చినా, లేదా అక్కడి నుంచి వచ్చినవాళ్లను కలిసినా, అంతకుముందు ఏ అలర్జీలు లేకుండా ఇప్పుడు కొత్తగా దగ్గు, జ్వరం, గొంతునొప్పి మొదలైనా అనుమానించాలి. అయితే సివియర్ అక్యూట్ రెస్పిరేటరీ సింప్టమ్ ఇన్‌ఫెక్షన్ వేరే కారణాల వల్ల కూడా ఉండొచ్చు. అందువల్ల ముందుగా న్యుమోనియా, క్షయ, స్వైన్‌ఫ్లూ టెస్టులు చేసి, అవి లేకుంటే అప్పుడు కొవిడ్ ఉందేమోనని ఆ టెస్టు చేస్తారు. మనదేశంలో కొవిడ్ -19 ఇన్‌ఫెక్షన్ ఉన్నవాళ్లలో 90 శాతానికి పైగా జ్వరంతోనే మొదలవుతుంది. 85 శాతం మందిలో దగ్గుతో మొదలవుతుంది. అమెరికా లాంటి దేశాల్లో ఈ లక్షణాలేవీ రాకముందే వాసన, రుచి తగ్గడం కూడా కరోనా హెచ్చరికలుగా భావిస్తున్నారు. మీ విషయంలో జలుబు మాత్రమే ఉంది. జ్వరం, దగ్గు, గొంతునొప్పి లాంటివేవీ లేవు. విదేశీ ప్రయాణం చేసిందీ లేదు. కాబట్టి మీకు అలర్జీ వల్ల గానీ, రైనోవైరస్ వల్ల గానీ జలుబు వచ్చి ఉంటుంది. కాబట్టి, భయపడాల్సిన పని లేదు. ఇంటర్నెట్‌లోని సెల్ఫ్ అసెస్‌మెంట్స్ ద్వారా కొవిడ్ లక్షణాలు మీకు ఉన్నాయా అన్నది పరీక్షించుకోవచ్చు.



**డాక్టర్ ఎం.వి. రావు**
సీనియర్ జనరల్ ఫిజీషియన్
యశోద హాస్పిటల్స్
హైదరాబాద్

**మీ సందేహం... మా సమాధానం:** కరోనా వ్యాధి గురించి మీకు ఎటువంటి అనుమానాలు, భయాలు ఉన్నా ఆందోళన పడకండి. మీ ప్రశ్నలు మాకు వాట్సప్ చేయండి. నిపుణులతో మీకు సమాధానాలు ఇప్పిస్తాం. ప్రశ్నలు పంపవలసిన వాట్సప్ నెంబర్: 91827 77177

## పెండ్లికి.. పెద్ద దెబ్బ!



**పెండ్లంటే** పెద్ద సంబురం. బాజాలు, భజంత్రీలు..చుట్టాలు... ఇలా ఒక పండుగ వాతావరణమే ఉంటుంది. కానీ కరోనా పుణ్యమా అని వివాహాలు వాయిదా వేసుకోవాల్సి వస్తున్నది. ఆ జాబితాలో హీరో నితిన్ కూడా ఉన్నాడు. ఏ కారణం వల్ల వాయిదా పడినా ఆ ప్రభావం... వధూవరుల్ని ఒత్తిడికి గురిచేస్తుంది. 'ఇలాంటి సమయాల్లో కాబోయే భార్యాభర్తలు పాజిటివ్‌గా ఆలోచించాలి. ఒకర్ని ఒకరు అర్థం చేసుకోవడానికి ఇంకొంత సమయం దొరికినందుకు సంతోషించాలి' అని సలహా ఇస్తున్నారు మానసిక నిపుణులు. నిజానికి చుట్టూ భయంకరమైన నిశ్శబ్దం రాజ్యమేలుతున్న సమయంలో... మనం మాత్రమే ఎలా ఉత్సాహంగా ఉండగలం. ఎలాగోలా పెళ్లి జరిగినా.. మొక్కుబడి తంతులానే ముగిసిపోతుంది. జీవితానికి సంబంధించిన అతిపెద్ద వేడుకను అంత నిస్సారంగా ఎందుకు కానిచ్చేయాలి? కరోనా ప్రభావం పూర్తిగా పోయాక... ఆత్మీయుల ఆశీర్వాదాలతో ఒక్కటి కావచ్చు. అప్పటి వరకూ... ' కళ్లలో పెళ్లిపందిరి కనబడుతోంది...' అంటూ పాడుకోవడమే!

## పాటతో మేల్కొలుపుదాం..




**లాక్‌డౌన్‌ను** విజయవంతం చేయడానికి ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. ఇందులో భాగంగా కర్ణాటక రాజధానిలోని 'బెంగళూర్ కోరస్' మ్యూజిక్ సంస్థ వారు ఓ వినూత్న ప్రయత్నం చేశారు. వివిధ సంప్రదాయాలకు చెందిన గాయకులను ఆన్‌లైన్ ద్వారా ఏకం చేసి 'సాంగ్ ఆఫ్ హోప్' కార్యక్రమాన్ని నిర్వహించారు. 'ఇంట్లోనే ఉండండి...' అన్న అర్థం వచ్చేలా సాహిత్యాన్ని రాయించారు. ఈ బృందగానంలో 135 మంది పాల్గొన్నారు. 'ప్రస్తుతం లాక్‌డౌన్ కారణంగా మేమంతా ఇంట్లోనే ఉంటున్నాం.. పాటలతో జనాన్ని చైతన్యపరచడం మా బాధ్యత..' అంటున్నారు ఆ గాయకులు.

## గొప్ప మనసు..



**అత్యంత** విపత్కర పరిస్థితుల్లోనే... మంచి అనేది మంచిగంధంలా నలుగురికీ పరిచయం అవుతుంది. మధ్యప్రదేశ్‌కు చెందిన ఉస్కర్ వయసు 82 ఏండ్లు. తమ రాష్ట్రంలో విస్తరిస్తున్న కరోనా వైరస్ గురించి ఆమె పేపర్లలో చూసింది. ఇలాంటి సమయంలో తను కొంతైనా సాయం చేయాలని అనుకుంది. తన పెన్షన్ డబ్బుల్లో నుంచి లక్ష రూపాయలను సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఇచ్చి తనలోని మానవతను చాటుకుంది. ఏ టాటాలో ప్రకటించిన విరాళంతో పోలిస్తే ఆ మొత్తం చిన్నదే కావచ్చు, కానీ ఆమె మనసు పెద్దది.

## రాకెట్ వదిలి..రిమోట్ పట్టి..



**కెరీర్ ప్రారంభమైన దగ్గర్నుంచీ ఎప్పుడూ రెండు వారాలకుపైగా ఖాళీగా లేనని చెబుతున్నది బ్యాడ్మింటన్ స్టార్ సింధు. ప్రస్తుత గ్యాప్‌కు కారణం.. కరోనా. హైదరాబాద్‌లోని తన ఇంట్లో రెండు వారాలుగా నిర్బంధాన్ని పాటిస్తున్నదామె. ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ నుంచి తిరిగి వచ్చిన తర్వాత.. సింధు తన రాకెట్‌ను పక్కన పెట్టి.. టీవీ రిమోట్‌కు పనిచెప్పింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎన్ని సినిమాలు చూసిందో తనకే గుర్తులేదని చెబుతున్నది...**

**ఆల్** ఇంగ్లండ్ ఓపెన్ కోసం బర్మింగ్ హామ్‌లో అడుగుపెట్టినప్పటి నుంచే.. జాగ్రత్తలు తీసుకున్నది సింధు. ప్రతి 20 నిమిషాలకు ఒకసారి చేతులను శుభ్రంగా కడుక్కోవడం, ప్రాక్టీస్‌కు వెళ్లినప్పుడు జాగ్రత్తలు తీసుకోవడం.. ఎవరు కలిసినా మన సంప్రదాయం ప్రకారం నమస్కారం చెప్పడం అలవాటు చేసుకుంది. సింధు యూకేలో ఉన్నప్పుడు కరోనా పాజిటివ్ కేసులు అంతగా లేవు. కానీ, టోర్నీ ముగించుకొని వచ్చేనాటికి కరోనా అక్కడ కూడా విలయతాండవం చేస్తున్నది. ఇప్పుడు పరిస్థితి మరింత దిగజారిపోయింది. అందుకే మనం కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నది సింధు. కరోనాను అంతమొందించేందుకు తన వంతు సాయంగా తెలుగు రాష్ట్రాలకు రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. 'ఉదయం చాలా ఆలస్యంగా నిద్ర లేస్తున్నా. గంటన్నరకు పైగా వ్యాయామం చేస్తున్నా. తర్వాత కాసేపు నా మేనల్లుడితో వీడియోకాల్‌లో మాట్లాడుతున్నా.. వాడి అల్లరి చేష్టలు భలే ముద్దుగా ఉంటాయి. ఇక టీవీ ముందు కూర్చుంటే.. నెట్‌ఫ్లిక్స్‌ను మొత్తం తిరగేస్తున్నా. ఇప్పటికి చాలా సినిమాలే చూశా. ప్రస్తుతం ప్రిజన్ బ్రేక్ సిరీస్ చూస్తున్నా. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ దేన్నీ వదలడం లేదు. తాజాగా 'కాంటేజియన్' సినిమా చూశా. భలే ఉంది. ఒకరి నుంచి మరొకరికి వైరస్ ఎలా వ్యాపిస్తుందో బాగా చూపించారు. కరోనాతో కూడా ప్రజలు ప్రస్తుతం అంతే ఇబ్బంది పడుతున్నారు. టీవీ చూడడం కూడా బోర్ అనిపిస్తే.. కిచెన్‌లో అమ్మకు సాయంగా ఉంటా' అని చెబుతున్నది సింధు.






**టీచర్:** ఒరేయ్ సన్నీ.. నీటిలో రాయి వేస్తే ఏమవుతుందో చెప్పు చూద్దాం..?

**సన్నీ:** ఏమవుతుంది టీచర్.. తడుస్తుంది అంతే..!

***

**కొడుకు:** మమ్మీ.. అన్యాయం జరుగుతోంది. రేపటి నుంచి నేను స్కూలుకు పోనంటే పోను..


**తల్లి:** ఏం నాన్నా.. ఏం జరిగింది..?

**కొడుకు:** ఏం లేదు మమ్మీ.. మా టీచర్ పుస్తకం చూస్తూ పాఠం చెబుతుంది. మమ్మల్ని మాత్రం పుస్తకం చూడకుండా పాఠం అప్పచెప్పమని అంటుంది. అందుకే.. !!

## పువ్వులు – తుమ్మెదలు

పువ్వును చూడగానే ఏ కీటకమైనా వాలిపోతుంది. గాలి బాగా వీస్తే అక్కడి నుంచి ఎగిరిపోతుంది. కానీ తుమ్మెద అలా కాదు, పువ్వునే అతుక్కొని ఉంటుంది. ముఖ్యంగా పెటునియా, గులాబీ పువ్వులను తుమ్మెదలు అసలు విడిచిపెట్టవు. ఎందుకంటే.. ఆ పువ్వులలోని రేకుల్లో ఉండే కణాలు తుమ్మెదలను పడిపోకుండా చేస్తాయి. ముఖ్యంగా కానికల్ కణాలు. పువ్వుల మీద తుమ్మెద వాలిపోగానే ఆ కణాలు దూరం జరిగిపోతాయి. ఆ కణాల మధ్యలో తుమ్మెద కాళ్లు ఇరుక్కుపోతాయి. ఇక ఎంత గాలి వీచినా తుమ్మెదలు పడిపోవన్నమాట. అయితే పెటునియా పువ్వులకు మాత్రం ఈ కణాలు ఉండవు. అయినా కూడా తుమ్మెదలు వీటి మీద అలాగే ఉండిపోతాయి. ఈ పుష్పాలమీద జిగురులాంటి పదార్థం ఉండటమే కారణం.





### పెద్దల మాట

వేలకొద్దీ నీతులు బోధించే బదులు, ఒక్క మంచిపని చేసి చూపించడం మేలు.

\- మహాత్మాగాంధీ

### జనరల్ నాలెడ్జ్

1. టీవీని కనుగొన్నది ఎవరు?
2. డీఎన్ఏ అంటే ?
3. ప్రపంచ పంచదార గిన్నె (షుగర్ బౌల్ ఆఫ్ ద వరల్డ్) అని ఏ దేశానికి పేరు?
4. ప్రపంచంలోనే ఎత్తయిన రైలు మార్గాన్ని నిర్మించిన దేశం?
5. బంగారు నగల తయారీలో ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉన్న దేశం?



### చుక్కలు కలుపండి



## గుణపాఠం



**ఒక అడవిలో** బన్నీ అనే అందమైన కుందేలు ఉండేది. అన్ని జంతువులతోనూ స్నేహం చేసేది. తన స్నేహితులను చూసుకొని ఎంతో గర్వపడేది. ఏ కష్టమొచ్చినా తనకేం ఫర్వాలేదని ధైర్యంగా తిరిగేది. దాన్ని కొన్ని వేట కుక్కలు గమనించాయి. వెంటపడ్డాయి. బన్నీ చాలా భయపడింది. సాయం కోసం స్నేహితుడైన దుప్పి దగ్గరకు వచ్చింది. 'మిత్రమా! వేటకుక్కలు ఇటు వైపే వస్తున్నాయి. నీ కొమ్ములతో వెనక్కి పారిపోయేలా చెయ్యి'అని కోరింది. 'నిజమే! చేయగలను. కానీ ఇప్పుడు నేను పనిలో ఉన్నాను. ఎలుగుబంటిని అడుగు'అని చెప్పింది దుప్పి. బన్నీ అక్కడి నుంచి ఎలుగుబంటి దగ్గరకు పరిగెత్తింది. 'నువ్వు అందరిలోకి బలశాలివి. వేటకుక్కలు వెంటబడ్డాయి. వాటిని తరిమేసి నన్ను కాపాడు'అని ప్రాధేయపడింది. 'నన్ను క్షమించు, నేనిప్పుడు చాలా అలసిపోయాను. పైగా ఆకలి వేస్తోంది. ఆహారం వెతుక్కోవాలి. నీకు సహాయం చేయలేను'అంటూ ముందుకు వెళ్లిపోయింది ఎలుగుబంటి. తర్వాత కోతి దగ్గరకు వెళ్లి అడిగింది. 'అమ్మో! నేనా? ఆ కుక్కలు నీతో పాటు నన్ను కూడా పీకేస్తాయి. నేను రాను' అంది కోతి. ఏనుగు, పొట్టేలు, జింక.. ఇలా బన్నీ స్నేహితులేవీ రక్షించడానికి ముందుకు రాలేదు. బన్నీకి చాలా బాధేసింది. వేటకుక్కల బారినుంచి తనను తాను ఎలా రక్షించుకోవాలా? అని ఆలోచించింది. వెంటనే ఒక పొద లోపలకు దూరి కదలకుండా ఉండిపోయింది. కాసేపటికి వేటకుక్కలు అటువైపు వచ్చి బన్నీ దాక్కున్న పొదను దాటి ముందుకు వెళ్లిపోయాయి. ఎలాగైతేనేం ప్రాణాలు కాపాడుకుంది. దీంతో బన్నీ ఒక గుణపాఠం నేర్చుకుంది. ఆపదలో ఆదుకున్నవారే నిజమైన స్నేహితులని తెలుసుకుంది. అంతేకాక, తన వంతు ప్రయత్నం చేయకుండా ఇతరులపై ఆధారపడకూడదని గ్రహించింది.

**నీతి**


మన శక్తిని మనం గుర్తించాలి. అంతేకాక, అన్నింటికీ ఇతరుల మీద ఆధారపడకూడదు.

### గుర్తించండి




1.డాక్టర్ 2. పోలీస్ 3. జర్నలిస్ట్ 4. పారిశుద్ధ్య కార్మికులు

### దారి కనుక్కోండి



### జవాబులు

**జనరల్ నాలెడ్జ్**
1. జెఎల్ బయార్డ్
2. డీ ఆక్సీ రైబోన్యూక్లిక్ ఆసిడ్
3. క్యూబా
4. చైనా
5. ఇటలీ

**గుర్తించండి**
1.డాక్టర్ (C)
2.పోలీస్ (D)
3.జర్నలిస్ట్ (B)
4.పారిశుద్ధ్య కార్మికులు(A)

# చిత్రం

## అంతరాలను చెరిపేద్దాం



రెహమాన్

**క**రోనాపై పోరాటంలో ప్రాణాలకు తెగించి సేవలందిస్తున్న వైద్యులు, ఆరోగ్య సిబ్బందికి కృతజ్ఞతలు చెప్పారు ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్. ప్రాణాలను రిస్క్ చేస్తూ నిస్వార్థంగా దేశ సేవలో నిమగ్నమైన ధీరోదాత్తులు వారంటూ ఆయన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో దేశప్రజలందరు అన్ని అంతరాలను చెరిపివేసుకొని కనిపించని శత్రువుపై పోరాటం చేయాలని రెహమాన్ పిలుపునిచ్చారు. మానవత, ఆధ్యాత్మిక భావ పరిమళాలతో ప్రజలందరూ ఈ మహమ్మారిని ఎదుర్కోవడానికి కార్యోన్ముఖులు కావాలన్నారు. దేవుడు మన హృదయాల్లోనే ఉన్నాడని, ఈ సమయంలో మతపరమైన సమావేశాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రజలందరూ ప్రభుత్వ సూచనలను పాటించాలని, కొన్ని వారాల స్వీయ నిర్బంధం కొన్నేళ్ల జీవితాన్ని ప్రసాదిస్తుందని రెహమాన్ చెప్పారు.

'క్రాక్' చిత్రంలో శృతిహాసన్, రవితేజ



## కిరాక్ పోలీస్

**ర**వితేజ, శృతిహాసన్ జంటగా నటిస్తున్న చిత్రం 'క్రాక్'. గోపీచంద్ మలినేని దర్శకుడు. సరస్వతి ఫిల్మ్స్ డివిజన్ పతాకంపై బి.మధు నిర్మిస్తున్నారు. శ్రీరామనవమి సందర్భంగా చిత్ర బృందం కొత్త పోస్టర్‌ను విడుదలచేసింది. ఈ పోస్టర్‌లో శృతిహాసన్‌తో పాటు చిన్నారిని చేతులపై ఎత్తుకొని రవితేజ కనిపిస్తున్నారు. చిత్రీకరణ తుదిదశకు చేరుకున్నది. 'వాస్తవ ఘటనల స్ఫూర్తితో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. కుటుంబ విలువలకు ప్రాధాన్యముంటుంది. అన్యాయాల్ని ఎదురించే నిజాయితీపరుడైన పోలీస్ అధికారిగా రవితేజ కనిపించబోతున్నారు. రవితేజ, శృతిహాసన్ కలయికలో వచ్చే సన్నివేశాలు అలరిస్తాయి. ఇటీవల విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్, టీజర్‌కు చక్కటి స్పందన లభిస్తున్నది' అని చిత్రబృందం తెలిపింది. సముద్రఖని, వరలక్ష్మిశరత్‌కుమార్, దేవీప్రసాద్, పూజిత పొన్నాడ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఎస్.ఎస్. తమన్.

## ఆ విద్య తెలిస్తే చాలు



పూజా హెగ్డే

**లా**క్‌డౌన్ టైమ్‌ను తారలు ఏమాత్రం వృథా చేయడం లేదు. తమకు ఇష్టమైన వ్యాపకాల్ని ఆస్వాదిస్తూనే మరోవైపు సోషల్‌మీడియా ద్వారా అభిమానులతో ముచ్చటిస్తున్నారు. తాజాగా మంగళూరు బ్యూటీ పూజాహెగ్డే ట్విట్టర్‌లో అభిమానులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చింది. ఈ లాక్‌డౌన్ విరామాన్ని ఎలా గడుపుతున్నారని అడగ్గా...అధిక సమయాన్ని తినడం, సినిమాలు చూడటం, నిద్రపోవడం కోసమే కేటాయిస్తున్నానని పేర్కొంది. అయితే ఫిట్‌నెస్ విషయంలో ఏమాత్రం రాజీపడటం లేదని..శారీరకధారుడ్యం కోసం రోజువారి కసరత్తుల్ని ఇంట్లోనే చేస్తున్నానని చెప్పింది. మీ మోముపై చెదిరిపోని చిరునవ్వుకి కారణమేంటని ఓ అభిమాని ప్రశ్నించగా..'జీవితాన్ని అంత సీరియస్‌గా తీసుకొను. క్లిష్ట పరిస్థితులు ఎదురైతే గతంలో నన్ను బాగా సంతోషపెట్టిన సంఘటనల్ని తలచుకొని ధైర్యాన్ని తెచ్చుకుంటాను. ముఖ్యంగా ఎలాంటి సమస్యలున్నా ఇతరుల్ని నవ్వించే ప్రయత్నం మానను. ఆ విద్య తెలిస్తే చాలు మన బాధలన్నీ మరచిపోవడానికి' అని సమాధానమిచ్చింది. చివరగా తెలుగు అభిమానుల గురించి ఒక్క ముక్కలో చెప్పమని కోరగా 'వారే నా జీవితం' అని పేర్కొంది.



కంగనారనౌత్



కరిష్మాకపూర్

## కంగనా వితరణ 25లక్షలు



కరీనాకపూర్, సైఫ్అలీఖాన్

**క**రోనా బాధితుల సహాయార్థం తారల నుంచి ప్రభుత్వానికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. బాలీవుడ్ అగ్ర నాయిక కంగనారనౌత్ పీఎం కేర్స్‌కు ఇరవై ఐదు లక్షల విరాళాన్ని అందజేసింది. దినసరి వేతన కార్మికులకు నిత్యవసరాల్ని అందజేసినట్లు ఆమె సోదరి రంగోలి తెలిపింది. కంగనా రనౌత్ తల్లి ఆశ రనౌత్ నెల పెన్షన్‌ను ప్రధానమంత్రి సహాయనిధికి అందజేశారు. బాలీవుడ్ నటుడు అజయ్‌దేవ్‌గణ్ సినీ కార్మికులకు బాసటగా నిలిచారు. వెస్టర్న్ ఇండియా సినీ ఎంప్లాయిస్ ఫెడరేషన్‌కు 51 లక్షల వితరణను ఇచ్చారు. పదిహేను వేల మంది సినీ వర్కర్స్‌కు యశ్‌రాజ్ ఫిల్మ్ సంస్థ ఆర్థిక సహాయాన్ని అందజేయడానికి ముందుకొచ్చింది. అలాగే సైఫ్ అలీ ఖాన్, కరీనాకపూర్ దంపతులు పీఎం కేర్స్‌తో పాటు మహారాష్ట్ర రిలీఫ్‌ఫండ్‌కు విరాళాన్ని అందజేశారు. ఈ కఠిన సమయంలో సాయపడే చేతులతో పాటు ప్రతి రూపాయి విలువైనవేనని వారు పేర్కొన్నారు. ఎంత మొత్తాన్ని విరాళంగా ఇచ్చింది మాత్రం వెల్లడించలేదు. అలాగే కరీనా కపూర్ సోదరి కరిష్మాకపూర్ సైతం పీఎం కేర్స్‌కు తన పిల్లలతో కలిసి విరాళాన్ని అందజేసింది. మానవత్వంతో దేశం కోసం ప్రతి ఒక్కరూ సహాయం చేయడానికి ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. మరికొందరు తారలు తమకు తోచిన రూపాల్లో సహాయపడబోతున్నామని సోషల్‌మీడియాలో పేర్కొంటున్నారు.

## ఉప్పెనలా ముంచెత్తే ప్రణయం



కృతిశెట్టి

**వై**ష్ణవ్‌తేజ్, కృతిశెట్టి నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం 'ఉప్పెన'. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ పతాకాలపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బుచ్చిబాబు సానా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. విజయ్ సేతుపతి ప్రధాన పాత్రను పోషిస్తున్నారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని చిత్రబృందం గురువారం కొత్త పోస్టర్‌ను విడుదలచేసింది. ఈ పోస్టర్‌లో హీరోహీరోయిన్లు ఇద్దరూ సహజంగా కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. 'విభిన్నమైన ప్రేమకథతో దర్శకుడు సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. విజయ్ సేతుపతి పాత్రచిత్రణ, నటన ప్రధానాకర్షణగా నిలుస్తాయి. ఇటీవల విడుదలైన పాటలు శ్రోతల్ని అలరిస్తున్నాయి. దేవిశ్రీప్రసాద్ చక్కటి బాణీలను అందించారు' అని చిత్ర బృందం తెలిపింది. సాయిచంద్, బ్రహ్మాజీ ముఖ్య పాత్రల్ని పోషిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: శాందత్ సైనుద్దీన్, ఎడిటర్:నవీన్ నూలి,

# కల్యాణం.. నిరాడంబరం

- శ్రీరామనవమి వేడుకలకు 'లాక్‌డౌన్' ఎఫెక్ట్
- అర్చకులు, ఆలయ ఉద్యోగుల సమక్షంలో సీతారాముల కల్యాణోత్సవం
- వేములవాడ, ఇల్లందకుంట, ధర్మపురి, కొండగట్టులో కనులపండువలా ఘట్టం
- ప్రసార మాధ్యమాల్లో తిలకించిన భక్తజనం

**కరోనా వైరస్, లాక్‌డౌన్ ఎఫెక్ట్‌తో శ్రీరామనవమి వేడుకలను జిల్లాలో నిరాడంబరంగా జరిపారు. వేములవాడ, ఇల్లందకుంట, ధర్మపురి, కొండగట్టు క్షేత్రాలతోపాటు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సీతారాముల కల్యాణోత్సవాలను కనులపండువలా నిర్వహించారు. అర్చకులు, అధికారుల సమక్షంలోనే వివాహ తంతును ముగించగా, భక్తులు ఇండ్ల నుంచే ప్రసారమాధ్యమాల్లో తిలకించి పులకించారు.**


ఇల్లందకుంట : కల్యాణ తంతు జరుపుతున్న అర్చకులు

సిరిసిల్ల జిల్లాలో..

**వేములవాడ కల్చరల్ / బోయినపల్లి / గంభీరావుపేట/రుద్రంగి/సిరిసిల్ల కల్చరల్ / ముస్తాబాద్/చందుర్తి/ కోనరావుపేట :** దక్షిణకాశీగా బాసిల్లుతున్న వేములవాడ రాజన్న సన్నిధిలో శ్రీసీతారాముల కల్యాణోత్సవాన్ని ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమశంకర్ ఆధ్వర్యంలో అర్చకులు గురువారం నిరాడంబరంగా నిర్వహించారు. కన్యాదాతలుగా మరంగంటి విజయసారథి దంపతులు వ్యవహరించగా, వేద మంత్రోచ్చారణల నడుమ వివాహ ఘట్టాన్ని కనులపండువలా జరిపారు. వేములవాడ మున్సిపల్ తరఫున అధ్యక్షురాలు రామతీర్థపు మాధవిరాజు, వైస్‌చైర్మన్ మధు రాజేందర్, కమిషనర్ శ్రీనివాస రెడ్డి స్వామివారికి పట్టువస్ర్తాలను సమర్పించారు. ఆలయం ఎదుట కొందరు శివపార్వతులు తలువాలు పోసుకున్నారు. రాజన్న అనుబంధ ఆలయమైన కోనరావుపేట మండలం మామిడిపల్లి శ్రీసీతారామస్వామి ఆలయంలో కల్యాణాన్ని నిరాడంబరంగా నిర్వహించారు. ఇల్లంతకుంట మండల కేంద్రంతోపాటు రేపాక, రామోజీపేట గ్రామాల్లోని సీతారామాలయంలో నిర్వహించిన వేడుకల్లో జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ఎంపీపీ ఊట్కూరి వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. ముస్తాబాద్ మండలం పోతుగల్‌లో నిర్వహించిన వేడుకల్లో ఎంపీపీ శరత్‌రావు, ఆర్‌బీఎస్ కన్వీనర్ కల్వకుంట్ల గోపాల్‌రావు, సర్పంచ్ తన్నీరు గౌతంరావు, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల జిల్లాలో..

**జగిత్యాల/ధర్మపురి,నమస్తేతెలంగాణ/మల్యాల/ మారుతీనగర్ :** ధర్మపురి ఉగ్ర నరసింహుడి ఆలయ ప్రాంగణంలో కల్యాణాన్ని శాస్ర్తోక్తంగా జరిపించారు. ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థాన ఆలయ ప్రాకార మండపంలో రాముడు, సీతాదేవి ఉత్సవ మూర్తులకు తిరుమంజనం, నూతన వస్ర్తాలంకరణ చేసి, అర్ధ మండప వేదికపై కల్యాణ తంతు నిర్వహించారు. స్థానాచార్యులు జితేంద్ర ప్రసాద్, ప్రధానార్చకుడు రామకృష్ణ, ఉప ప్రధానార్చకుడు చిరంజీవి, అర్చకులు కపిలేందర్, అఖిల్, వేద పండితుడు పెద్దన్న శర్మ, ఏఈవో బుద్ధి శ్రీనివాస్ పాల్గొన్నారు. మెట్‌పల్లి కోదండ రామాలయంలో కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, సరోజన దంపతులు పాల్గొని స్వామివారికి పట్టువస్ర్తాలు, తలంబ్రాలు సమర్పించారు. జిల్లా కేంద్రంలోని భక్త మార్కండేయ ఆలయంలో అదనపు కలెక్టర్ బేతి రాజేశం దంపతులు, జగిత్యాల మున్సిపల్ అధ్యక్షురాలు బోగ శ్రావణి దంపతులు పూజలు చేశారు.

కరీంనగర్ జిల్లాలో..

**ఇల్లందకుంట/ చొప్పదండి/ కార్పొరేషన్/ రామడుగు/ హుజూరాబాద్‌టౌన్/ జమ్మికుంట/ గన్నేరువరం/ కరీంనగర్‌రూరల్ :** అపర భద్రాద్రిగా పేరొందిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో రాములోరి కల్యాణ వేడుక వైభవంగా జరిగింది. జడ్పీ అధ్యక్షురాలు విజయ, ఆలయ ఈవో సుధాకర్, పట్టు వస్ర్తాలు సమర్పించారు. అనంతరం అర్చకులు రామాచార్యులు, సీతారామాచార్యులు, వంశీధరాచార్యులు, నవీన్‌శర్మ, లోకాచార్యులు సీతారాముల కల్యాణాన్ని వేద మంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. కరీంనగర్‌లోని రాంనగర్‌లో గల శ్రీ రమాసహిత సత్యనారాయణస్వామి, అభయాంజనేయ స్వామి దేవాలయంలో జరిగిన కల్యాణానికి డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి హరిశంకర్ పట్టువస్ర్తాలు సమర్పించారు. గోపాల్‌రావుపేట సీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహించిన వేడుకలకు ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ హాజరయ్యారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, వైస్ చైర్‌పర్సన్ విజయలక్ష్మితో కలిసి చొప్పదండి రామాలయంలో పూజలు చేశారు. వెలిచాల లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సర్పంచ్ వీర్ల సరోజన, ప్రభాకర్‌రావు దంపతులు కల్యాణం జరిపించారు. హుజూరాబాద్ పట్టణంలోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో ఆలయ చైర్మన్‌తోపాటు, మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు గందె రాధిక-శ్రీనివాస్, జమ్మికుంట రైల్వేస్టేషన్ ఆవరణలోని రామాలయంలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు దంపతులు హాజరయ్యారు. గన్నేరువరం మండలం మాదాపూర్ సీతారాముల ఆలయంలో జడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. కొత్తపలి శివాలయంలోని సీతారామాంజనేయ సహిత సాయిబాబా ఆలయంలో మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, వైస్ చైర్మన్ బండ రాధ గోపాల్‌రెడ్డి కల్యాణం జరిపించారు.


వేములవాడ కల్చరల్: ఆలయం ఎదుట తలువాలు పోసుకుంటున్న శివపార్వతులు


వేములవాడ కల్చరల్: స్వామి వారికి పట్టువస్ర్తాలు తెస్తున్న మున్సిపల్ అధ్యక్షురాలు

పెద్దపల్లి జిల్లాలో..

**రాంమందిర్‌ఏరియా/ పెద్దపల్లిరూరల్ / ఓదెల/ కాల్వశ్రీరాంపూర్/యైటింక్లయిన్ కాలనీ:** గోదావరిఖని కోదండ రామాలయంలో అర్చకుడు మధుసూధనాచారి ఆధ్వర్యంలో, జిల్లాకేంద్రంలోని కోదండ రామాలయంలో పూజారులు కొండపాక శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో రాములోరి కల్యాణం నిర్వహించారు. ఓదెల మల్లన్న ఆలయంలో వేద పండితులు ఆరుట్ల శ్రీనివాసాచార్యులు, దూపం వీరభద్రయ్య, భవానీప్రసాద్ జరిపారు. జూనియర్ అసిస్టెంట్ కుమారస్వామి పట్టు వస్ర్తాలు సమర్పించారు. కాల్వశ్రీరాంపూర్ జగత్ మహామునీశ్వరస్వామి ఆలయంతోపాటు మంథని గోదావరి తీరంలోని రామాలయం, యైటింక్లయిన్ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో కల్యాణ తంతును నిర్వహించారు. ఆర్జీ-2 సివిల్ డీజీఎం రామకృష్ణ పాల్గొని స్వామివారికి పట్టువస్ర్తాలు సమర్పించారు.


ధర్మపురి : మంగళసూత్రాన్ని చూపుతున్న అర్చకుడు


కరీంనగర్: పట్టువస్ర్తాలు తీసుకువస్తున్న డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి హరిశంకర్ దంపతులు


ఓదెల : కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు


మల్యాల : కొండగట్టులో మంగళసూత్రాన్ని చూపిస్తున్న అర్చకులు


చొప్పదండి : పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్


మారుతీనగర్ : వేడుకల్లో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు దంపతులు


గోదావరిఖని : కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

## ❖ పార్కింగ్ కాదు.. పట్టుబడ్డవి!


స్వాధీనం చేసుకున్న వాహనాలు

*..పక్క చిత్రంలో కనిపిస్తున్న వందలాది బైకులు పార్కింగ్ చేసినవనుకుంటే పొరబడినట్లే.. లాక్‌డౌన్, కర్ఫ్యూ అమలులో భాగంగా ప్రభుత్వ ఆదేశాలు, నియమ నిబంధనలు ఉల్లంఘించి రోడ్లపై తిరిగిన ద్విచక్ర వాహనాలివి.. కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో కొన్ని రోజులుగా నిబంధనలు అతిక్రమించిన సుమారు 2,500 వాహనాలను సీజ్ చేసి కమిషనరేట్ మైదానంలో ఉంచారు.*

*– ఫొటో : కరీంనగర్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నమస్తే తెలంగాణ*

## ❖ రేషన్.. సోషల్ డిస్టెన్స్..


సామాజిక దూరం పాటిస్తూ సరుకుల కోసం క్యూలైన్‌లో ఉన్న వినియోగదారులు

లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రభుత్వం ఉచితంగా బియ్యం, నగదును పంపిణీ చేస్తున్నది. ప్రతిరేషన్ షాపు వద్ద ప్రజలు సామాజిక దూరాన్ని పాటిస్తున్నారు. వేములవాడ పట్టణంలోని 16వ వార్డులో రేషన్ షాపు వద్ద ఇలా క్యూలైన్లలో నిల్చొని సరుకులు తీసుకున్నారు. మరికొన్ని చోట్ల ఎండలు ఎక్కువగా ఉండడంతో చెప్పులను క్యూలైనులో పెట్టి తమ వంతు వచ్చే వరకూ కార్డుదారులు నీడలో నిల్చుంటున్నారు.

*– వేములవాడ, నమస్తేతెలంగాణ:*

## ❖ సర్పంచ్ స్వచ్ఛంద ప్రచారం..


మల్లారెడ్డిపల్లిలో ప్రచారం చేస్తున్న సర్పంచ్ ఎల్లారెడ్డి

కరోనాపై ఊరూరా ప్రచారం చేస్తూ ప్రజలకు స్వచ్ఛందంగా అవగాహన కల్పిస్తున్నారు మల్లారెడ్డిపల్లి సర్పంచ్ మ్యాకల ఎల్లారెడ్డి. సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆయన, సొంత ఖర్చులతో ఆటో, మైకు సెట్ అద్దెకు తీసుకొని గ్రామాల్లో తిరుగుతూ.. ప్రతి ఒక్కరూ లాక్‌డౌన్ పాటించాలని కోరుతున్నారు. ఆయనను ప్రజాప్రతినిధులు అభినందించారు.

*– వీణవంక*

## సంజయ్ హ్యాండ్‌వాష్


హ్యాండ్‌వాష్ చేసుకుంటున్న ఎమ్మెల్యే సంజయ్

**జగిత్యాల రూరల్ :** వ్యక్తిగత శుభ్రత పాటించడం వల్ల కరోనా వైరస్‌ను నిరోధించవచ్చని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ ఇచ్చిన 'సేఫ్ హ్యాండ్స్ చాలెంజ్'ను స్వీకరించి, గురువారం తన క్వార్టర్స్‌లో చేతులు శుభ్రం చేసుకున్నారు. అనంతరం జగిత్యాల, రాయికల్ మున్సిపల్ అధ్యక్షులు బోగ శ్రావణి, మోర హన్మాండ్లు, ఎంపీపీలకు చాలెంజ్ విసిరారు.

# ప్రజలు ఇళ్లలోనే ఉండాలి

- ఇది అత్యంత కీలక దశ
- వైద్యులపై దాడి సరికాదు
- మంత్రి గంగుల కమలాకర్
- 9వ డివిజన్‌లో బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ


పారిశుధ్య కార్మికులకు సరుకులు పంపిణీ చేస్తున్న మంత్రి గంగుల, మేయర్ సునీల్‌రావు

**కార్పొరేషన్, నమస్తే తెలంగాణ :** కరోనా వైరస్‌ను అరికట్టేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించి, ఇళ్లలోనే ఉండాలని రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్ కోరారు. గురువారం నగరంలోని 9వ డివిజన్‌లో ఉచిత బియ్యం, పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కరోనా ఇంకా సద్దుమణగలేదని, వైరస్ వల్ల తమకేమీ కాదన్న భావన సరికాదని సూచించారు. నగర ప్రజల సౌకర్యం కోసం అనేక కాలనీల్లో మినీ కూరగాయల మార్కెట్లు, మొబైల్ వాహనాలను ఏర్పాటు చేశామన్నారు. తమ ప్రాణాలను లెక్క చేయకుండా 24 గంటలు వైద్య సేవలందిస్తున్న డాక్టర్లపై దాడి చేయడం సరికాదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని, వైద్య సిబ్బంది భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. పేదలకు 12కిలోల ఉచిత బియ్యాన్ని కూపన్ల ద్వారా అందిస్తున్నామన్నారు. డీలర్లు, వర్కర్లు, సిబ్బంది, అధికారులు మాస్కులు, గ్లౌజులు వేసుకొని దూరం పాటిస్తూ పంపిణీ ప్రక్రియ చేపట్టాలన్నారు. బియ్యం కోటాలో పోర్టబిలిటీ కూడా ఉందని, ఇతర జిల్లాలకు చెందిన లబ్ధిదారులకు కూడా పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ వై సునీల్‌రావు, కార్పొరేటర్లు ఐలేందర్‌యాదవ్, స్వప్న, నాయకులు పాల్గొన్నారు.

# మరో ముగ్గురికి కరోనా పాజిటివ్

- వెల్లడించిన కలెక్టర్ కరీంనగర్ శశాంక
- స్వచ్ఛందంగా పరీక్షలు చేయించుకోవాలని విజ్ఞప్తి

**కరీంనగర్ ప్రతినిధి/హుజూరాబాద్; నమస్తే తెలంగాణ :** కరీంనరగర్ జిల్లాలో మరో మూడు కరోనా పాజిటివ్ కేసులు వెలుగుచూసినట్లు కలెక్టర్ శశాంక గురువారం రాత్రి ప్రకటించారు. వీరంతా ఢిల్లీలో జరిగిన మతపరమైన కార్యక్రమానికి హాజరై వచ్చిన వారేనని వెల్లడించారు. జిల్లాలోని హుజూరాబాద్ ప్రాంతానికి చెందిన ముగ్గురిని మూడు రోజుల కిందనే అదుపులోకి తీసుకున్న పోలీసులు, కరీంనగర్‌లోని ప్రభుత్వ దవాఖాన కు తరలించారు. వీరికి పరీక్షలు నిర్వహించగా ఇద్దరికి కరోనా పాజిటివ్ వచ్చినట్లు హుజూరాబాద్ తాసిల్దార్ తెలిపారు. మరొకరికి కూడా పాజిటివ్ వచ్చినట్లు రాత్రి కలెక్టర్ ప్రకటించారు. కాగా, ఢిల్లీలోని నిజాముద్దీన్ మర్కజ్‌కు వెళ్లి వచ్చిన వారిలో 19 మందిని గుర్తించి కరోనా పరీక్షలు నిర్వహించామని, వీరిలో 11 మందికి నెగెటివ్ వచ్చిందని, ముగ్గురికి పాజిటివ్ వచ్చిందని, ఇంకా ఐదుగురి రిపోర్ట్స్ రావాల్సి ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఢిల్లీలో జరిగిన మత పరమైన కార్యక్రమానికి హాజరై వచ్చిన వారిలో ఇంకా ఎవరైనా ఉంటే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన దవాఖానలో పరీక్షలు చేయించుకోవాలని, లేదంటే 104కు కాల్ చేయాలని కోరారు. ప్రస్తుతం కరోనా పాజిటివ్ వచ్చిన వారిలో ఇద్దరు మర్కజ్ వెళ్లి వచ్చిన వారు కాగా, మరొకరు రెండు రోజుల కింద కరోనా పాజిటివ్ వచ్చిన వ్యక్తితో సన్నిహితంగా ఉన్న వ్యక్తని స్పష్టం చేశారు. కాగా, కరోనా పాజిటివ్ వచ్చిన వారిని హైదరాబాద్‌లోని గాంధీ, కింగ్ కోటి దవాఖానలకు తరలిస్తున్నామని తెలిపారు. వీరి కుటుంబ సభ్యులను, వీరితో సన్నిహితంగా ఉన్న వారిని శాతవాహన క్వారంటైన్ కేంద్రానికి తరలిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి సుజాత మాట్లాడుతూ ఎవరికైనా దగ్గు, దమ్ము, జ్వరం, శ్వాసలో ఇబ్బందులు ఉన్నట్లయితే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పరీక్షలు చేసుకోవాలని కోరారు.

## ప్రతి గింజనూ కొంటాం

- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవిశంకర్

**చొప్పదండి, నమస్తే తెలంగాణ :** రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో గురువారం ధాన్యం కొనుగోళ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సారి నియోజకవర్గంలో ఐకేపీ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా మొత్తం 131 కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేసేందుకు కార్యాచరణ రూపొందించి, ప్రతిపాదనలు పంపించామని, తర్వలోనే కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. రైతులకు అధికారులు టోకెన్లు ఇస్తారని, వాటి ప్రకారమే తమ ధాన్యాన్ని అమ్ముకోవాలని సూ చించారు. విపత్కర పరిస్థితుల్లోనూ రైతులపై ఉన్న మమకారాన్ని చాటిచెప్పిన గొప్ప వ్యక్తి సీఎం కేసీఆర్ అని కొనియాడారు.

## మంత్రి ఈశ్వర్ ఆపన్నహస్తం

- వలస జీవులకు యాప్ ద్వారా ₹50వేలు సాయం


పెగడపల్లి : గూగుల్ పే ద్వారా పంపిన డబ్బును విజయవాడలో తీసుకుంటున్న వలస జీవులు

**పెగడపల్లి/ధర్మారం :** ధర్మపురి నియోజకవర్గంలోని పలు మండలాల వారు ఉపాధి కోసం ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలోని ముంబైకి వెళ్లి లాక్‌డౌన్ నేపథ్యంలో అక్కడే చిక్కుకుపోయారు. వారికి ఇచ్చిన భరోసా మేరకు మంత్రి కొప్పుల ఈశ్వర్ గూగుల్‌పే, ఫోన్ పే యాప్‌ల ద్వారా ₹50వేల ఆర్థిక సాయాన్ని గురువారం పంపించారు. వారికి ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూస్తానని హామీ ఇచ్చారు. తమను ఆదుకున్న మంత్రి ఈశ్వర్‌కు వలస జీవులు కృతజ్ఞతలు తెలిపారు.

# బాధ్యత ఉండక్కర్లేదా?

### రామగుండం సీపీ సత్యనారాయణ ఆగ్రహం


మంచిర్యాల : వాహనదారుడిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సీపీ సత్యనారాయణ

**మంచిర్యాల టౌన్, నమస్తే తెలంగాణ/జైపూర్/లక్షెట్టిపేట :** మంచిర్యాల జిల్లాకేంద్రంతోపాటు ఇందారం, లక్షెట్టిపేటలో సీపీ సత్యనారాయణ గురువారం లాక్‌డౌన్ పరిస్థితిని పరిశీలించారు. ఇందారం క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేసిన ఆయన అకారణంగా రోడ్లపై తిరుగుతున్న వాహనదారులనుద్దేశించి 'బాధ్యత ఉండక్కర్లేదా' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనరేట్ పరిధిలో నిబంధనలు ఉల్లంఘించిన 550 మందిపై కేసులు పెట్టామని, 4వేలకు పైగా వాహనాలను సీజ్ చేశామని చెప్పారు. ఆయన వెంట మంచిర్యాలలో డీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఏసీపీ లక్ష్మీనారాయణ, ఇందారంలో జైపూర్ ఏసీపీ నరేందర్, శ్రీరాంపూర్ సీఐ కోటేశ్వర్, ఎస్‌ఐలు గంగరాజగౌడ్, ప్రవీణ్‌కుమార్, లక్షెట్టిపేటలో డీసీపీ రవికుమార్, సీఐ నారాయణ్ నాయక్, ఎస్‌ఐ దత్తాద్రి ఉన్నారు.



జగిత్యాల దవాఖానలో అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

## దవాఖానల్లో 'జాగృతి' అన్నదానం

• మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత సౌజన్యంతో కార్యక్రమం

**జగిత్యాల రూరల్ /మెట్‌పల్లిటౌన్ :** మాజీ ఎంపీ, తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సౌజన్యంతో జగిత్యాల, మెట్‌పల్లి ప్రభుత్వ దవాఖానల్లో రోగులు, సహాయకులకు గురువారం ఉచితంగా భోజనం అందజేశారు. కల్వకుంట్ల కవిత సొంత ఖర్చులతో భోజన వసతి కల్పిస్తున్నట్లు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని దవాఖానలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని జడ్పీ అధ్యక్షురాలు దావ వసంతతో కలిసి ఆయన ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని అంగడి బజార్‌లో చేపట్టిన అన్నదాన కార్యక్రమంలోనూ ఎమ్మెల్యే పాల్గొన్నారు. అసహాయులకు పది రోజులుగా మైనార్టీ నాయకులు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. ఆయన వెంట జిల్లా దవాఖాన సూపరింటెండెంట్ సుదక్షిణా దేవి, ఆర్‌ఎంవో రామకృష్ణ, జాగృతి జగిత్యాల కన్వీనర్ నీలగిరి రాజేందర్, జాగృతి నేతలు ఉజగిరి జమున, వెంకట్, కౌన్సిలర్ కప్పల శ్రీకాంత్, లియాకత్ అలీ మోసిన్, అమీర్ హుస్సేన్, జకీర్ అహ్మద్, అబ్దుల్ రెహమాన్, అహ్మద్ పాల్గొన్నారు. మెట్‌పల్లి దవాఖానలో తెలంగాణ జాగృతి జగిత్యాల జిల్లా అధ్యక్షుడు చెర్లపల్లి అమర్‌దీప్‌గౌడ్ భోజనం అందించారు. లాక్‌డౌన్ పూర్తయ్యే దాకా రోజూ వంద మందికి అన్నం అందిస్తామని తెలిపారు. ఇక్కడ జాగృతి నియోజకవర్గ ఇన్‌చార్జి ఎండీ జావిద్, జిల్లా కో కన్వీనర్ వెల్ముల శ్రీనివాస్‌రావు, పట్టణాధ్యక్షుడు బిట్లుగ్ కార్తీక్ పాల్గొన్నారు.



మెట్‌పల్లి టౌన్ : భోజనం వడ్డిస్తున్న జాగృతి నాయకులు

## పకడ్బందీగా లాక్‌డౌన్ అమలు

• రాజన్న సిరిసిల్ల ఎస్పీ రాహుల్ హెగ్డే

**వేములవాడ, నమస్తే తెలంగాణ/ సిరిసిల్ల రూరల్:** కరోనా నియంత్రణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించిన లాక్‌డౌన్‌ను రాజన్న సిరిసిల్ల జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తున్నామని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే స్పష్టం చేశారు. తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలోని బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన క్వారంటైన్ సెంటర్‌ను, వేములవాడ పట్టణంలోని చెక్కపల్లి రహదారిలో ఏర్పాటు చేసిన ఐసోలేషన్ వార్డును ఆయన గురువారం పరిశీలించారు. ఆయాచోట్ల వైద్యాధికారులతో మాట్లాడారు. సమస్యలుంటే తమ దృష్టికి తేవాలని, ఎవరైనా సహకరించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ఇప్పటివరకు 250కిపైగా వాహనాలను సీజ్ చేశామన్నారు. డీఎస్పీలు చంద్రశేఖర్, చంద్రకాంత్, ఎస్‌ఐ అభిలాష్ ఉన్నారు. అదేవిధంగా ఎస్పీ ఆదేశాలతో సిరిసిల్లలోని పలు కిరాణా దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు.

## పేదల కోసమే బియ్యం పంపిణీ : బోగ శ్రావణి

**జగిత్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ :** నిరుపేదలను ఆదుకునేందుకే బియ్యం పంపిణీ చేస్తున్నట్లు జగిత్యాల మున్సిపల్ అధ్యక్షురాలు బోగ శ్రావణి అన్నారు. జగిత్యాల మున్సిపాలిటీలోని పలు రేషన్ దుకాణాల వద్ద గురువారం ఆమె బియ్యం పంపిణీ చేశారు. కౌన్సిలర్లు ఆల్లె గంగాసాగర్, నాయకులు బోగ ప్రవీణ్, పులి రాము పాల్గొన్నారు.

## తప్పడు పోస్టులు పెడితే కేసులు : అడిషనల్ ఎస్పీ

**జగిత్యాలక్రైం :** కరోనా వైరస్‌పై సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడితే సుమోటోగా తీసుకొని కేసులు నమోదు చేస్తామని జగిత్యాల అడిషనల్ ఎస్పీ దక్షిణామూర్తి హెచ్చరించారు. పట్టణ పరిధిలో మూడు రోజుల్లోనే ఏడు కేసులు నమోదు చేశామని చెప్పారు. జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోస్టులు పెట్టే వారితోపాటు గ్రూప్ అడ్మిన్లపైనా కేసులు తప్పవని, సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్, డెస్కటాప్‌లను సీజ్ చేస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరూ లాక్‌డౌన్ పాటించాలని, కారణంలేకుండా రోడ్లపైకి వచ్చే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. సమావేశంలో డీఎస్పీలు వెంకటరమణ, ప్రతాప్, టౌన్ సీఐ జయేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

## కరోనా కట్టడికి విరాళం



₹26వేల చెక్కును అందజేస్తున్న డాక్టర్ బీఎన్‌రావు

**కరీంనగర్ హెల్త్/ సిరిసిల్ల కలెక్టరేట్ :** కరోనా కట్టడికి నిరంతరం శ్రమిస్తున్న ప్రభుత్వం, అధికారులకు పలువురు తమకు తోచిన సాయం అందిస్తూ అండగా నిలుస్తున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది కోసం సీనియర్ డాక్టర్ బీఎన్‌రావు ₹26 వేల చెక్కును గురువారం దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ అజయ్‌కుమార్‌కు అందజేశారు. అలాగే సిరిసిల్ల కలెక్టరేట్‌లో కలెక్టర్ కృష్ణభాస్కర్‌కు వైఎస్ఆర్‌సీపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము ₹10 వేల చెక్కును అందజేశారు.



## అనాథ వృద్ధుడికి అభయం

ఖాదర్‌కు స్నానం చేయిస్తున్న పారిశుధ్య సిబ్బంది, కొత్త బట్టలతో ఖాదర్

**ఎల్లారెడ్డిపేట:** లాక్‌డౌన్‌తో దిక్కుతోచని స్థితిలో పడిపోయిన అనాథ వృద్ధుడిని గొల్లపల్లి గ్రామస్తులు అక్కున చేర్చుకున్నారు. కామారెడ్డికి చెందిన ఓ అనాథ వృద్ధుడు మహ్మద్ ఖాదర్ గొల్లపల్లి దర్గా వద్ద 20 ఏళ్ల నుంచి ఉంటున్నాడు. అక్కడే కందూరు చేసే వారి వద్ద తింటూ జీవనం సాగిస్తున్నాడు. లాక్‌డౌన్ కారణంగా కొద్దిరోజులుగా ఆకలితో అలమటించిపోతున్నాడు. వృద్ధుడిని చూసిన చలించిపోయిన పలువురు గ్రామస్తులు ముందుకువచ్చి అతనికి భరోసా ఇచ్చారు. లాక్‌డౌన్ పూర్తయ్యేవరకు వృద్ధుడికి భోజనం అందించేందుకు ఏర్పాట్లు చేశారు. అదీగాక గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికులు శామ్యూల్, నర్సయ్య, చంటి అతనికి స్నానం చేయించి కొత్తబట్టలు వేయించారు.

# మనసున్న మారాజులు..

• పేదలు, వలస కార్మికులకు భరోసా
• సర్కారు తరఫున రేషన్ బియ్యం, నగదు



ధర్మపురి : ఎల్‌ఎం కొప్పుల ట్రస్ట్ ఆధ్వర్యంలో యాచకులు, వలస కార్మికులకు అన్నదానం చేస్తున్న నాయకులు

**లాక్ డౌన్ నేపథ్యంలో పనిలేక సతమతమవుతున్న పేదలకు, వలస కార్మికులకు తెలంగాణ ప్రభుత్వంతోపాటు పలువురు అండగా నిలుస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పిలు పునందుకొని ముందుకొచ్చి వారికి చేయూతనిస్తున్నారు. తోచిన సాయం అందిస్తూ బాసటగా నిలుస్తున్నారు. నిత్యావసర సరుకులను, నగదును అందిస్తూ పెద్దమనసును చాటుకుంటున్నారు.**



సిరిసిల్ల టౌన్: నిత్యావసర సరుకులను అందజేస్తున్న అదనపు కలెక్టర్ అంజయ్య, మున్సిపల్ అధ్యక్షురాలు జిందం కళ

### కరీంనగర్ జిల్లాలో..

**హుజూరాబాద్ టౌన్/ జమ్మికుంట/ సైదాపూర్/ చొప్పదండి/ గంగాధర:** హుజూరాబాద్‌లోని ఆర్టీసీ డిపో క్రాస్‌రోడ్ వద్ద వడ్డెరకాలనీ కూలీలకు దాతల సహాయంతో ఏసీపీ శ్రీనివాస్‌రావు, టౌన్ సీఐ మాధవి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. విశ్వకర్మ కార్మికులకు నిత్యావసరాలు అందించేందుకు మున్సిపల్ మాజీ చైర్మన్ వడ్లూరి విజయ్‌కుమార్ ₹2 లక్షలు విరాళం అందజేశారు. ఈటల యువత వ్యవస్థాపకుడు ఇమ్మడి సతీశ్, టీఆర్‌ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్ 500 మందికి మాస్కులు, శానిటైజర్లు అందజేశారు. జమ్మికుంటలోని కాకతీయ విద్యాసంస్థల చైర్మన్ అవిర్నేని సుధాకర్‌రావు పట్టణ ప్రజలకు 10వేల మాస్కులను తయారు చేయించి, పట్టణ పోలీస్ స్టేషన్‌లో హుజూరాబాద్ ఆర్డీవో బెన్ షాలోం, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, తాసిల్దార్ డాక్టర్ నారాయణ, సీఐ సృజన్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. సైదాపూర్‌లో హృషికేశ్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు అనగోని శోభవీరన్నగౌడ్ తమ సిబ్బంది 13 మందికి ఒక్కొక్కరికీ ఉచితంగా 25కిలోల బియ్యాన్ని అందించారు. కరీంనగర్ మండలం చేగుర్తిలోని 290 మంది వలస కూలీలకు ఒక్కొక్కరికి 12 కేజీల చొప్పున బియ్యం, ₹500 పంపిణీ చేశారు. తీగలగుట్టపల్లిలోని నగర 2వ డివిజన్‌లో వలస కూలీలకు కార్పొరేటర్ కాశెట్టి లావణ్య శ్రీనివాస్ బియ్యం, నగదు అందజేశారు. కొత్తపల్లిలోని 10వ వార్డులో ఉచిత బియ్యం పంపిణీలో మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, వార్డు కౌన్సిలర్ రాంబాబు, చింత సత్యనారాయణ రెడ్డి, వీఆర్వో పాల్గొన్నారు. చొప్పదండికి చెందిన వెంకటేశ్వర మెడికల్ స్టోర్ నిర్వాహకుడు బొల్లం సాంబమూర్తి పలువురికి నిత్యావసరాలు, సందీప్ మెడికల్ స్టోర్ నిర్వాహకుడు అంజయ్య మాస్కులు పంపిణీ చేశారు. జగదాంబ జ్యోతిష్యాలయం వ్యవస్థాపకుడు ఆవునూరి నాగరాజుశర్మ మానకొండూర్‌లోని 15 నిరుపేద, వలస కార్మిక కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులను జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్ గౌడ్, సీఐ సంతోష్‌కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

### రాజన్న సిరిసిల్ల జిల్లాలో..

**సిరిసిల్లటౌన్/ కోనరావుపేట/ ఎల్లారెడ్డిపేట/ ముస్తాబాద్/ సిరిసిల్ల రూరల్/ రుద్రంగి/ బోయినపల్లి/ వేములవాడ, నమస్తే తెలంగాణ :** జిల్లా కేంద్రంలోని 3వ వార్డులో పలువురు పేదలకు విద్యానగర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను అదనపు కలెక్టర్ అంజయ్య, మున్సిపల్ అధ్యక్షురాలు జిందం కళ, టీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు చక్రపాణి అందించారు. వేములవాడ 19వ వార్డులోని ప్రజలకు కౌన్సిలర్ కుమ్మరి శిరీష శ్రీనివాస్ ఉచితంగా నిత్యావసర సరుకులను, కూరగాయలను అందజేశారు. కోనరావుపేటలోని 30 నిరుపేద కుటుంబాలకు అదే గ్రామానికి చెందిన యాస వంశ కుటుంబీకుల సహకారంతో నిత్యావసరాలను ఎస్‌ఐ పర్శరాములు పంపిణీ చేశారు. నిజామాబాద్‌లో 55మంది వలస కూలీలకు తాసిల్దార్ రమేశ్‌బాబు బియ్యం, నగదును అందించారు. బోయినపల్లి మండలం కొదురుపాకలో వసల కార్మికులకు టీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కత్తెరపాక కొండయ్యతో కలిసి తాసిల్దార్ ప్రసాద్ బియ్యం, నగదును అందజేశారు. రుద్రంగి మండలం మానాలలో సౌదీ సంఘం ఆధ్వర్యంలో ₹లక్షా 50 వేల విలువైన శానిటైజర్లను సర్పంచ్ అల్లూరి మానస అందించారు. ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్‌లోని వలస కూలీ కుటుంబాలకు ఏఎంసీ మాజీ చైర్మన్ అందె సుభాష్ సరుకులను అందించారు. గొల్లపల్లి లలితా కిరాణా దుకాణం వారు కూరగాయలను పంపిణీ చేశారు. గొల్లపల్లిలో రోడ్డుపక్కన ఓ వృద్ధుడికి రెవెన్యూ అధికారులు బియ్యం, ₹500 అందజేశారు. కరోనా విధుల్లో ఉన్న వారికి మానేరు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చింతోజు భాస్కర్ పులిహోర ప్యాకెట్లను అందజేశారు. కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి పులిహోర ప్యాకెట్ అందించారు.

### జగిత్యాల జిల్లాలో..

**ధర్మపురి, నమస్తేతెలంగాణ/ సారంగాపూర్/ గొల్లపల్లి/ కోరుట్ల టౌన్/ పెగడపల్లి/ మేడిపల్లి/ కథలాపూర్ :** ధర్మపురి క్షేత్రంలోని వలసకూలీలకు, యాచకులకు ఎల్‌ఎమ్ కొప్పుల ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. గోదావరి ఒడ్డున దాదాపు 100మందికి టీఆర్‌ఎస్ నాయకులు భోజనాన్ని అందించారు. మున్సిపల్ అధ్యక్షురాలు సంగి సత్తెమ్మ, జడ్పీటీసీ బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, ఏఎంసీ వైస్ చైర్మన్ అక్కనపల్లి సునీల్ పాల్గొన్నారు. సారంగాపూర్ మండలం లచ్చునాయక్ తండా అనుబంధ కీంనాయక్ తండాకు చెందిన హోంగార్డు భూక్య లక్ష్మణ్, తనకు ప్రభుత్వం నుంచి వచ్చిన 48కిలోల బియ్యాన్ని, పేదలకు పంచాలని పౌరసరఫరాల శాఖ అధికారి లక్ష్మి నర్సింహాచారికి అందించారు. గొల్లపల్లి మండలం ఇస్రాజ్‌పల్లిలో పారిశుధ్య కార్మికులకు సర్పంచ్ చిర్ర గంగాధర్ గ్లౌజులు, బూట్లు, డెటాల్, మాస్కులు పంపిణీ చేశారు. కోరుట్లలో 'అంబేద్కర్ మాదిగ యువజన సంఘం' ప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. రైల్వే స్టేషన్ సమీపంలో తలదాచుకుంటున్న పశ్చిమ బెంగాల్ వలస కార్మికులకు ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు రూ.5వేలు ఇవ్వగా మున్సిపల్ ఉపాధ్యక్షుడు గడ్డమీది పవన్, టీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్ అందజేశారు. పెగడపల్లిలో 50 పేద కుటుంబాలకు టీఆర్‌ఎస్ రాష్ట్ర నేత ఓరుగంటి రమణారావు యువసేన ఆధ్వర్యంలో నిత్యావసరాలను అందజేశారు. యువసేన అధ్యక్షుడు ఉయ్యాల రాజశేఖర్‌గౌడ్, సభ్యులు ఉయ్యాల రాజు, తిరుపతి, మహబూబ్, రాకేశ్, మనోజ్, కరుణాకర్, రంజిత్ పాల్గొన్నారు. మేడిపల్లి మండల కేంద్రంలోని వలస కూలీలకు మాజీ సర్పంచ్ బొంగోని రాజాగౌడ్ ఆధ్వర్యంలో జడ్పీ ఉపాధ్యక్షుడు వొద్దినేని హరిచరణ్‌రావు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేశవేని క్రిష్ణ కొడుకు సుశాంత్ పుట్టిన రోజు సందర్భంగా అన్నదాన ఖర్చులు అందజేశారు. దేశాయిపేటలో 250 నిరుపేద కుటుంబాలకు కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు అన్నాడి జలపతిరెడ్డి కూరగాయలు అందించారు. కథలా పూర్ మండలం సిరికొండకు చెందిన 50 మంది పేదలకు ఒక్కొక్కరికి 10 కిలోల చొప్పున ఐదు క్వింటాళ్ల సన్న బియ్యాన్ని కోరుట్లకు చెందిన వ్యాపారి కొత్త సురేశ్ ఉచితంగా పంపిణీ చేశారు.



సారంగాపూర్ : పౌరసరఫరాల శాఖ అధికారికి బియ్యన్ని తిరిగి ఇస్తున్న భూక్య లక్ష్మణ్



హుజూరాబాద్‌టౌన్ : ₹2లక్షలు విరాళం అందజేస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్



జమ్మికుంట: మాస్కులు అందజేస్తున్న అధికారులు

### ❖ ఇంటింటికీ ఉచితంగా కూరగాయలు



ముదిమాణిక్యంలో కూరగాయలు అందజేస్తున్న దాత భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ

చిగురుమామిడి సింగిల్‌విండో డైరెక్టర్ ఎడవెల్లి భాస్కర్‌రెడ్డి ఉదారత చాటుకున్నారు. తన స్వగ్రామమైన ముదిమాణిక్యంలో కుటుంబానికి 5 కిలోల చొప్పున 630 కుటుంబాలకు ఉచితంగా కూరగాయలు అందించారు. ఆయన వెంట ఎంపీపీ కొత్త వినీత, తాసిల్దార్ జహీద్‌పాషా, ఎంపీడీవో ఖాజా మొహినొద్దీన్, సర్పంచ్ జక్కుల రవి, ఎంపీటీసీ ఏలేటి రవీందర్‌రెడ్డి, కొత్త శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు. – చిగురుమామిడి

### ❖ ముమ్మరంగా స్ప్రే



కోరుట్ల టౌన్ : సోడియం హైపోక్లోరైట్ స్ప్రే చేయిస్తున్న సిబ్బంది

కొవిడ్–19 నియంత్రణకు కోరుట్ల మున్సిపల్ అధికారులు పట్టణంలో గురువారం ముమ్మరంగా సోడియం హైపోక్లోరైట్ ద్రావణాన్ని స్ప్రే చేయించారు. మున్సిపల్ అధ్యక్షురాలు అన్నం లావణ్య, సీఐ రాజశేఖర్‌రాజు, మున్సిపల్ ఉపాధ్యక్షుడు గడ్డమీది పవన్, కమిషనర్ ఆయాజ్, టీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్, అధికారులు పనులను పర్యవేక్షించారు. – కోరుట్లటౌన్

### ❖ ఇల్లే శ్రీరామ రక్ష



ఇంటి ముందు వేసిన ముగ్గుతో జ్యోతిరాణి

కరోనా మహమ్మారిపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు హుజూరాబాద్ పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త, అంగన్‌వాడీ టీచర్ కోటోజు జ్యోతిరాణి 'కలియుగ దీక్ష' పేరిట వినూత్న ప్రచారం చేస్తున్నారు. శ్రీరామ నవమి సందర్భంగా 'ఇల్లే శ్రీరామ రక్ష.. ఎవరూ ఇంటి నుంచి బయటకు రావొద్దు' అని వాకిట్లో వినూత్నంగా ముగ్గు వేశారు. పట్టణంలో పలువురు ఆమెను అనుకరించారు. – హుజూరాబాద్‌టౌన్

# అన్నార్తులకు 'అన్నపూర్ణ'

- మంత్రి కేటీఆర్ చొరవతో మొత్తం వ్యయాన్ని చెల్లించేందుకు ముందుకొచ్చిన సిరిసిల్ల మున్సిపాలిటీ
- వలస కూలీలకు, అనాథలకు ఉచిత భోజనం
- రోజూ 200 మందికి పంపిణీ చేసేందుకు నిర్ణయం



సామాజిక దూరం పాటిస్తూ క్యూలైన్‌లో బారులు తీరిన ప్రజలు

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తేతెలంగాణ :** కరోనా నియంత్రణకు స్వీయ నిర్బంధం అమలవుతున్న నేపథ్యంలో దిక్కుతోచని స్థితిలో పడిపోయిన అనాథలు, వలస కూలీలకు మంత్రి కేటీఆర్ బాసటగా నిలిచారు. ఆకలితో అలమటించకుండా వారి కడుపు నింపేందుకు చర్యలు చేపట్టారు. అమాత్యుడి సూచనలతో హరేరామ స్వచ్ఛంద సేవా సంస్థతో సంయుక్తంగా నిర్వహిస్తున్న అన్నపూర్ణ పథకం ద్వారా రాజ న్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఉచిత భోజనం అందజేసేందుకు అయ్యే మొత్తం వ్యయాన్ని మున్సిపల్ ముందుకొచ్చింది. దీని ద్వారా రోజూ 200 మందికి ఉచిత భోజనం అందించాలని నిర్ణయించింది. దీంతో పట్టణంలోని పేద కార్మికులతో పాటు వలసకూలీలు, అనాథలు, యాచకుల ఆకలి తీరుతున్నది. అదేవిధంగా భోజనశాల వద్ద తాగునీరు, శానిటేషన్ సౌకర్యాలపైనా మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. సామాజిక దూరం పాటించేలా క్యూలైన్లలో మనిషి మనిషికీ మీటరు దూరం ఉండేలా మార్కింగ్ వేశారు.

## జన్‌ధన్ ఖాతాల్లోకి ₹500

• నేటి నుంచి విత్‌డ్రా..
• 9 వరకు అవకాశం

**కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ :** కేంద్ర ప్రభుత్వ ప్రధాన మంత్రి కల్యాణ్, ప్రధానమంత్రి మహిళా జన్‌ధన్ యోజనా కింద మహిళా లబ్ధిదారుల ఖాతాలకు ₹500 చొప్పున జమ చేశారు. ఈ నగదును అకౌంట్ నంబర్ల వారీగా ప్రకటించిన తేదీల్లోగా ఈ నెల 3 నుంచి 9 వరకు విత్‌డ్రా చేసుకోవచ్చు. ఏప్రిల్ 3న అకౌంట్ నంబర్ చివర 0, 1 సంఖ్య ఉన్న వారు విత్‌డ్రా చేసుకోవచ్చు. 4న అకౌంట్ నంబర్ చివర 2, 3 ఉన్నవారు, 7న అకౌంట్ నంబర్ చివర 4, 5 ఉన్నవారు, 8న అకౌంట్ నంబర్ చివర 6, 7 ఉన్నవారు, 9న అకౌంట్ నెంబర్ 8, 9 నంబర్లు ఉన్న వారు నగదు విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పించారు. బ్యాంకు మిత్రలు, వినియోగదారుల సేవా కేంద్రాలు, బిజినెస్ కరస్పాండెంట్లు, ఏటీఎం నుంచి కూడా ఈ నగదు విత్‌డ్రా చేసుకోవచ్చు. నగదు బ్యాంకు పాయింట్లకు తీసుకువచ్చే వాహనాలను అనుమతి ఇవ్వాల్సిందిగా జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని అధికారులు కోరారు. అలాగే నగదు పంపిణీ కేంద్రాల వద్ద శానిటైజర్స్ ఏర్పాటు చేయాలని మున్సిపాలిటీలను కోరారు.

## 22 మందికి హోం క్వారంటైన్

**మానకొండూర్:** మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల ఢిల్లీ నిజాముద్దీన్ తబ్లిగీ జమాత్‌లోని మర్కజ్‌కు వెళ్లి వచ్చినట్లు అధికారులు గుర్తించగా, గురువారం ర్యాపిడ్ రెస్పాన్స్ టీం సభ్యులు అతని ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. సదరు వ్యక్తి కరీంనగర్ వెళ్లినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. దీంతో అతడి కుటుంబంతోపాటు ఇంట్లోపని చేసే వ్యక్తులు, సమీప బంధువులకు వైద్యసిబ్బంది పరీక్షలు నిర్వహించారు. 22 మందిని హోం క్వారంటైన్‌లో ఉంచామని ర్యాపిడ్ రెస్పాన్స్ టీం సభ్యులు తాసిల్దార్ రాజయ్య, సీఐ సంతోష్‌కుమార్, వైద్యాధికారి సంధ్యారాణి తెలిపారు.

## క్రైం కార్నర్

• తప్పుడు పోస్టుల ఎఫెక్ట్

### ప్రొఫెసర్ సుజాతపై కేసు

**కరీంనగర్ క్రైం :** కరోనా వైరస్ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాజిక మాధ్యమాల్లో వస్తున్న పుకార్లపై దృష్టి సారించాయి. ఈ క్రమంలో శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత కరోనా వైరస్‌పై సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. అవి మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఉన్నాయని గుర్తించిన వన్‌టౌన్ పోలీసులు, ఆమెపై కేసు నమోదు చేశారు. సామాజిక మాధ్యమాల వార్తల నియంత్రణ చట్టం కింద కేసు నమోదు చేసి, విచారణ జరుపుతున్నామని, గతంలో కూడా కరీంనగర్‌లోని పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయని వన్‌టౌన్ సీఐ విజయ్‌కుమార్ వెల్లడించారు.

### బీజేపీ కౌన్సిలర్ అరెస్ట్

**కోరుట్ల టౌన్:** కోరుట్ల పట్టణంలోని 22వ వార్డు బీజేపీ కౌన్సిలర్ మాడవేణి నరేశ్‌ను కోరుట్ల పోలీసులు గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ సురేందర్‌రెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం.. నరేశ్ కొద్ది రోజులుగా సోషల్ మీడియా వేదికగా ఫేస్‌బుక్, వాట్సాప్ గ్రూపుల్లో కరోనాపై అసత్యాలు, వదంతులు ప్రచారం చేస్తున్నాడని పేర్కొన్నారు. ఒక వర్గాన్ని టార్గెట్ చేస్తూ, మరో వర్గాన్ని రెచ్చగొట్టేలా కరోనా వైరస్‌పై తప్పుడు పోస్టులు పెడుతున్నాడని తెలిపారు. ఇతరుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తించిన కౌన్సిలర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు.

### కట్లకుంటలో యువకుడిపై..

**మేడిపల్లి :** కట్లకుంటకు చెందిన ఎండీ జుబేర్ అనే వ్యక్తి, మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టి ప్రచారం చేస్తున్నాడని వచ్చిన ఫిర్యాదు మేరకు అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. మత విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరించే వారిని సహించేది లేదని, ఇలాంటివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### సిరిసిల్లలో పలువురిపై..

**సిరిసిల్ల క్రైం:** ఆలయాల్లో పూజలు చేసి జనం గుమిగూడేలా చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటనర్సయ్య తెలిపారు. సిరిసిల్లలోని గణేశ్‌నగర్, తారక రామనగర్‌లోని హనుమాన్ ఆలయాల్లో పంతంగి రాజేశం, రఘువారి కాలనీల్లోని ఆలయాల్లో మందిని పోగు చేసి, పూజలు చేశారని వివరించారు. అదేవిధంగా ర్యాష్ డ్రైవింగ్‌తో భయభ్రాంతులకు గురిచేసిన పద్మానగర్‌కు చెందిన రెడ్డిమల్ల నవీన్‌కుమార్, గెంట్యాల శ్రీకాంత్, ఆడెపు రవి, అయిలవేణి అర్జున్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

| వెన్‌కాబ్ చికెన్ ధరలు (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 70.00 | రిటైల్ లైవ్ | 92.00 |
| డ్రెస్డ్ | 133.00 | స్కిన్‌లెస్ | 152.00 |

| గుడ్ల ధరలు (వందకు) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 335.00 | వరంగల్ | 338.00 |
| మెదక్ | 335.00 | కరీంనగర్ | 338.00 |
| రంగారెడ్డి | 335.00 | డజన్ ధర | 54.00 |


## పీఎం-కేర్స్ ఫండ్‌కు ఎన్టీపీసీ రూ.257 కోట్లు

- రూ.150 కోట్లిచ్చిన హెచ్‌డీఎఫ్‌సీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:** ప్రభుత్వ రంగ విద్యుదుత్పాదక దిగ్గజం ఎన్టీపీసీ పీఎం-కేర్స్ ఫండ్‌కు రూ.257.5 కోట్ల విరాళాన్ని ప్రకటించింది. కరోనా వైరస్‌పై పోరులో భాగంగా గురువారం ఈ భారీ నిధులను కేంద్ర ప్రభుత్వానికి అందజేయాలని నిర్ణయించింది. రూ.250 కోట్లు ఎన్టీపీసీ ఇస్తుండగా, సంస్థ ఉద్యోగులంతా కలిసి తమ ఒకరోజు వేతనాన్ని సాయం చేశారు. ఇది రూ.7.5 కోట్లుగా ఉన్నది. కాగా, రూ.11 కోట్లతో వివిధ ప్రాంతాల్లో సహాయక చర్యలను చేపడుతున్నట్లు ఎన్టీపీసీ తెలిపింది. ఇప్పటికే తమ దవాఖానలను కరోనా రోగులకు చికిత్స కోసం వాడుకోవచ్చని ఎన్టీపీసీ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇదిలావుంటే హెచ్‌డీఎఫ్‌సీ గ్రూప్ పీఎం-కేర్స్ ఫండ్‌కు రూ.150 కోట్ల విరాళాన్ని ప్రకటించింది. కరోనా వైరస్ కట్టడికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు సహాయంగా ఈ నిధులను ఇస్తున్నట్లు తెలిపింది.

## భవిష్యత్తుపై దృష్టి పెట్టండి

- ఉద్యోగులకు ఆనంద్ మహీంద్రా లేఖ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:** ప్రస్తుత సంక్షోభ సమయంలో తమ ఉద్యోగులకు మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా హితబోధ చేశారు. అంతా ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకోవాలని, ఈ కఠిన పరిస్థితుల అనంతరం భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలనైనా ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలని సూచించారు. ఈ విరామ సమయాన్ని నూతన ఆవిష్కరణలకు వినియోగించుకోవాలని, కొత్తకొత్త ఆలోచనలతో తమ జీవిత లక్ష్యాలను నెరవేర్చుకునేందుకు అవసరమైన బాటలు వేసుకోవాలని సలహా ఇచ్చారు. గతంలో ఏర్పడిన ప్రపంచ ఆర్థిక మాంద్యం అనుభవాలను, దాన్నుంచి నేర్చుకున్న పాఠాలను గుర్తుచేసుకుని ముందుకు సాగాలని 2 లక్షలకుపైగా ఉద్యోగులనుద్దేశించి రాసిన ఈ లేఖలో పేర్కొన్నారు.

## ప్రాజెక్టు రుణాల్ని రీస్ట్రక్చర్ చేయాలి


- నరెడ్కో అధ్యక్షుడు హీరానందానీ సూచన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తున్నదని, ఈ నేపథ్యంలో నిర్మాణ సంస్థలు తీసుకున్న ప్రాజెక్టు రుణాల్ని రీస్ట్రక్చర్ చేయాలని నరెడ్కో (నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) కోరింది. ఈ మేరకు నరెడ్కో సంఘం జాతీయ అధ్యక్షుడు డా. నిరంజన్ హీరానందానీ గురువారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశారు. 2008లో ఆర్థిక మాంద్యం తలెత్తినప్పుడు, అప్పటి కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్టు రుణాల్ని రీస్ట్రక్చర్ చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. నిలిచిపోయిన ప్రాజెక్టులకు ఆర్‌బీఐ 'లాస్ట్ మైల్ ఫండింగ్' ద్వారా ఆదుకునే పథకంలోకి గృహనిర్మాణ రంగాన్ని కూడా చేర్చాలని కోరారు. లాక్‌డౌన్ పూర్తయ్యాక రియల్ సంస్థలు ఎదుర్కొనే నగదు కొరతను తీర్చేందుకు అదనంగా రుణసౌకర్యాల్ని పెంపొందించాలని విజ్ఞప్తి చేశారు.

## డోమినోస్, ఊబర్ డోర్ డెలివరీలు

**న్యూఢిల్లీ/బెంగళూరు, ఏప్రిల్ 2:** లాక్‌డౌన్ నేపథ్యంలో ఇంటింటికి నిత్యావసరాలను సరఫరా చేసేందుకు సిద్ధం అవుతున్నాయి డొమినోస్, ఊబర్ సంస్థలు. ఇందుకుగాను ఐటీసీ ఫుడ్స్‌తో డొమినోస్ పిజ్జా, బిగ్‌బాస్కెట్‌తో ఊబర్ జట్టు కట్టాయి. కస్టమర్లకు హోం డెలివరీ కోసం సూపర్‌మార్కెట్లు, ఫార్మసీలతోనూ చర్చలు జరుపుతున్నామని ఊబర్ గురువారం తెలిపింది. హైదరాబాద్, బెంగళూరు, చండీగఢ్, నోయిడాల్లో సేవలుంటాయని చెప్పింది.

# చెదురుతున్న డాలర్ డ్రీమ్స్




**32%**
అమెరికా నిరుద్యోగ రేటు రికార్డు స్థాయిలో 32శాతానికి చేరుతుందని నిపుణులు అంచనా

### 4.7 కోట్ల ఉద్యోగాలకు ఎసరు!

యూఎస్‌లో దాదాపు 35 లక్షల మంది ఇప్పటి వరకు జాబ్‌లెస్ క్లెయిమ్స్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఒక అంచనా ప్రకారం, 67 మిలియన్ల అమెరికన్ల ఉద్యోగాలు హై రిస్క్‌లో ఉన్నాయి. ఇందులో దాదాపు 4.7కోట్లు మంది నిరుద్యోగులుగా మారొచ్చని అంచనా.

5 కోట్ల మంది ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం • అగ్రరాజ్య ఆర్థిక వ్యవస్థపై కరోనా దెబ్బ

హెచ్1బీ వీసాదారులపై తీవ్ర ప్రభావం • ఉద్యోగాలు పోయే స్థితిలో భారతీయులు

వీసా గడువు పెంచాలని ప్రభుత్వానికి వినతులు • పెంపు లేకుంటే స్వదేశం బాట

**కరోనా వైరస్ అగ్ర రాజ్యం అమెరికాను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. ఒకవైపు పెద్ద మొత్తంలో ప్రాణ నష్టం జరుగుతుంటే మరోవైపు ఆర్థిక మాంద్యం చాపకింద నీరులా విస్తరిస్తున్నది. అమెరికా ఆర్థిక వ్యవస్థకు గడ్డుకాలం రావడంతో భారీగా ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి నెలకొంది. ఇది హెచ్-1బీ వీసాతో పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు చేస్తున్న భారతీయులకు శాపంగా మారింది. నష్టాలను పూడ్చుకునేందుకు పలు కంపెనీలు ఉద్యోగులను తొలగిస్తుండటం, హెచ్1బీ వీసా కల్గిన ఉద్యోగులనే ముందుగా తొలగిస్తామని ప్రకటించడంతో భారతీయులు ఆందోళన చెందుతున్నారు.**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా దెబ్బకు డాలర్ కలలు చెదిరిపోతున్నాయి. ఇప్పుడు ఉద్యోగాలు కోల్పోతే నిర్ణీత 60 రోజుల్లో మరొక ఉద్యోగం పొందలేమని, తిరిగి స్వదేశాలకు వెళ్లలేక రోడ్డున పడతామని అమెరికాలోని భారతీయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై వైట్‌హౌజ్ స్పందన కోరుతూ పిటిషన్ క్యాంపెయిన్ ప్రారంభించారు. హెచ్-1బీ వీసాల ద్వారా నిపుణులైన విదేశీయులను ఉద్యోగాల్లో చేర్చుకునేందుకు అమెరికా కంపెనీలకు వీలు కలుగుతుంది. దీని ప్రకారం పెద్ద సంఖ్యలో భారతీయులు అక్కడ పని చేస్తున్నారు. ఏటా హెచ్-1బీ పొందుతున్న వారిలో 67 నుంచి 72 శాతం భారతీయులే ఉన్నారు. అయితే కరోనా వైరస్ వ్యాపించడంతో ప్రపంచ వ్యాప్తంగా వ్యాపారాలన్నీ స్తంభించాయి. ముఖ్యంగా అమెరికాలో కరోనా తీవ్రమైన ప్రభావం చూపుతుండటంతో ఆ దేశం భీకరంగా నష్టపోతున్నది. ఇప్పటికే పలు కంపెనీలు ఉద్యోగాల్లో కోత ప్రారంభించగా, మరికొన్ని కంపెనీలు ముందు జాగ్రత్తతో నష్టాల బారి నుంచి తప్పించుకునేందుకు కొలువులను తొలగిస్తున్నాయి. దీంతో ఈ ప్రతికూల ప్రభావం హెచ్1బీ వీసాపై ఉద్యోగాలు చేస్తున్న వారిపై పడనుంది. ప్రస్తుత ఫెడరల్ నిబంధన ప్రకారం, ఒకవేళ వీరిలో ఎవరు ఉద్యోగం కోల్పోయినా అమెరికాలో కేవలం 60 రోజులు మాత్రమే ఉండగలరు. అనంతరం వారి కుటుంబ సభ్యులతో సహా స్వదేశానికి తిరిగి రావాల్సిందే. అయితే ఈ కష్టకాలంలో తమను ఆదుకోవాలని అక్కడి విదేశీ ఐటీ నిపుణులు అమెరికా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. గడువును 60 నుంచి 180కి పెంచాలని కోరుతున్నారు.

**భారీ స్థాయిలో ఉద్యోగాలకు ఎసరు!**

అమెరికాలో కరోనా రోజురోజుకీ విస్తరిస్తుండటంతో రాబోయే రోజుల్లో ఆ దేశ ఆర్థిక పరిస్థితి మరింత దిగజారుతుందని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. యూఎస్‌లో ఇప్పటికే లక్షల మంది తమ ఉద్యోగాలను కోల్పోయారంటున్నారు. దాదాపు 35 లక్షల మంది ఇప్పటివరకు జాబ్‌లెస్ క్లెయిమ్స్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఒక అంచనా ప్రకారం 67 మిలియన్ల అమెరికన్ల ఉద్యోగాలు హై రిస్క్‌లో ఉన్నాయని, దాదాపు 47 మిలియన్ల (4.7కోట్లు) మంది నిరుద్యోగులుగా మారొచ్చని అంచనా వేస్తున్నారు. దీంతో దేశంలో నిరుద్యోగ రేటు రికార్డు స్థాయి లో 32 శాతానికి చేరుతుంద ని అమెరికా ప్రభు త్వ నిపుణులు అంచనా వేస్తున్నా రు. గడిచిన వందేండ్ల లో అమెరికా ఇంతటి ఆర్థిక దుస్థితిని ఎదుర్కోకపోవడం గమనార్హం.

### చుట్టుముడుతున్న కష్టాలు

హెచ్1బీ వీసాతో ఉన్న వారు నిరుద్యోగ ప్రయోజనాలకు అర్హులు కారు. ఈ ప్రయోజనం కోసం వారి జీతం నుంచి తగ్గింపులు ఉన్నప్పటికీ వారు సామాజిక భద్రతా ప్రయోజనాలు పొందలేరని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఈ క్రమంలో హెచ్1బీ వీసాదారులు ఉద్యోగాలు కోల్పోతే తీవ్ర ఇబ్బందుల్లో పడతారు. వేరే ఉద్యోగాలు వెతుక్కోవడం అసాధ్యమైన పని. దీంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా లాక్‌డౌన్ ఉన్న నేపథ్యంలో స్వదేశాలకు తిరిగి వెళ్లడం సాధ్యపడదు. కాబట్టి ఒకవేళ ఉద్యోగాలు కోల్పోతే ఉండేందుకు ఉన్న 60 రోజుల గడువును 180 రోజులకు పెంచాలని కోరుతున్నారు. దీని కోసం పిటీషన్ క్యాంపెయిన్ ప్రారంభించారు. వైట్ హౌజ్ సంప్రదించాలంటే కనీసం లక్ష సంతకాలు కావాలి కాబట్టి సోషల్ మీడియా వేదికగా ప్రచారం మొదలు పెట్టారు.

**67%**
ఏటా హెచ్-1బీ పొందుతున్న వారిలో 67 నుంచి 72శాతం భారతీయులే ఉన్నారు. అయితే కరోనా వైరస్ వ్యాపించడంతో ప్రపంచ వ్యాప్తంగా వ్యాపారాలన్నీ స్తంభించాయి. ముఖ్యంగా అమెరికా కంపెనీలు ముందు జాగ్రత్తతో నష్టాల బారి నుంచి తప్పించుకునేందుకు ఉద్యోగాల్లో కోత విధిస్తున్నాయి.

### పార్ట్‌టైం జాబ్స్ ఉండవ్

**ఉన్నత** చదువులకోసం అమెరికాకు వెళ్లిన భారతీయ విద్యార్థులకు కరోనా వైరస్ రూపంలో గట్టి ఎదురుదెబ్బలు తగిలాయి. ఎమ్మెస్సీ చదువడానికి అమెరికా వెళ్లిన దీపక్ పరిస్థితి మరి అధ్వాన్యంగా తయారైంది. ఇక్కడ బ్యాంకు వద్ద లక్షలాది రూపాయలు రుణం తీసుకొని ఎంచక్క అమెరికాకు వెళ్లి అక్కడ ఎమ్మెస్సీతోపాటు పార్ట్‌టైం ఉద్యోగం చేసి తను తీసుకున్న బ్యాంక్ రుణం తీర్చివేయాలని ఎంతో ఆశతో అమెరికా ఫ్లైట్ ఎక్కిన దీపక్ ఆశలకు కరోనా వైరస్ గండికొట్టింది. చదువు మాట దేవుడు ఎరుగు..ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నాడు. అటు పార్ట్‌టైం ఉద్యోగం పోయి, ఇటు తిండి లేక బయటకు వెళ్లుదామంటే ఎక్కడి నుంచి కరోనా వైరస్ చుట్టుకుంటుందోనని భయాల మధ్య జీవితాన్ని గడుపుతున్నారు. ఇది ఒక దీపక్ పరిస్థితి కాదు..తెలుగు రాష్ట్రాలతోపాటు భారత్ నుంచి అమెరికా వెళ్లి స్థిరపడి ఐటీ, ఇతర ఉద్యోగాలు, ఉన్నత చదువులు చదువుకుంటున్న ప్రతివారి పరిస్థితి ఇది. ప్రస్తుతం అక్కడి నిబంధనల ప్రకారం వారానికి 8 గంటల నుంచి 12 గంటల వరకు పార్ట్‌టైం ఉద్యోగం చేసుకునే వీలుంటుంది.




# రోజుకు రూ.35 వేల కోట్లు

- 21 రోజుల లాక్‌డౌన్‌తో రూ.7.44 లక్షల కోట్ల నష్టం
- అక్యూట్ రేటింగ్స్ అంచనా

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:** ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనా వైరస్ ప్రాణ నష్టాన్నేకాదూ.. ఆర్థిక నష్టాన్నీ భారీగానే కలిగిస్తున్నది. ఈ మహమ్మారి ధాటికి దేశంలో 21 రోజుల లాక్‌డౌన్ నడుస్తుండగా, దీనివల్ల జీడీపీకి పెద్ద దెబ్బే తగులుతున్నది. రోజుకు రూ.35,400 కోట్లు (సుమారు 4.64 బిలియన్ డాలర్లు) భారత్ నష్టపోతున్నదని అక్యూట్ రేటింగ్స్ అండ్ రిసెర్చ్ లిమిటెడ్ గురువారం అంచనా వేసింది. మొత్తం ఈ 21 రోజుల లాక్‌డౌన్ కాలంలో రూ.7.44 లక్షల కోట్ల (దాదాపు 98 బిలియన్ డాలర్లు) నష్టం వాటిల్లవచ్చని చెప్పింది. కరోనా దెబ్బకు మునుపెన్నడూలేని విపత్కర పరిస్థితులు చోటుచేసుకోగా.. వ్యాపారాలు, పారిశ్రామికోత్పత్తి, రవాణా వ్యవస్థ స్తంభించిన విషయం తెలిసిందే. దీంతో ఆర్థిక వ్యవస్థకు పెను నష్టం వచ్చిపడిందని క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ అక్యూట్ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ పరిస్థితి భారత్‌తోపాటు మొత్తం ప్రపంచ దేశాలన్నింటిపైనా ఉందన్నది. కాగా, ఈ ఆర్థిక సంవత్సరం (2020-21) ఏప్రిల్-జూన్ జీడీపీపై కరోనా ప్రభావం ఉంటుందని, జూలై-సెప్టెంబర్ త్రైమాసికంపైనా కనిపిస్తుందని అంచనా వేసింది. మొత్తానికి ఇప్పటికే ఆర్థిక మందగమనంతో సతమతమవుతున్న భారత్‌ను కరోనా పెద్ద దెబ్బే కొట్టింది.

**ప్రపంచ జీడీపీ 1 శాతం తగ్గొచ్చు**

కరోనా వైరస్ ఉధృతి కారణంగా ఈ ఏడాది ప్రపంచ జీడీపీ దాదాపు 1 శాతం పడిపోవచ్చని ఐక్యరాజ్య సమితి అంచనా వేసింది. ఇంతకు ముందు 2020లో గ్లోబల్ జీడీపీ 2.5 శాతంగా నమోదు కావచ్చని పేర్కొన్నది. అయితే వైరస్ విజృంభణ నేపథ్యంలో ఆ అంచనాను ఇప్పుడు 0.9 శాతం తగ్గించింది. 1.6 శాతానికి పరిమితం చేసింది. అంతర్జాతీయ వాణిజ్యాన్ని, రవాణా వ్యవస్థను ఈ విశ్వమారి దారుణంగా దెబ్బతీసిందని వెల్లడించింది. 2009లో ప్రపంచ ఆర్థిక మాంద్యం సమయంలో గ్లోబల్ జీడీపీ 1.7 శాతంగా ఉండగా, ఇప్పుడు అంతకంటే తక్కువకు చేరవచ్చన్న అంచనాలు వినిపిస్తుండటం గమనార్హం.

### అరబిందో-శాండోజ్ ఒప్పందం రద్దు

**హైదరాబాద్, ఏప్రిల్ 2:** అమెరికాకు చెందిన జనరిక్ ఓరల్ సాలిడ్స్ అండ్ డెర్మటాలజీ బిజినెస్ నిర్వహిస్తున్న శాండోజ్ ఇండస్ట్రీ కొనుగోలు ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్లు రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఫార్మా సంస్థ అరబిందో ఫార్మా గురువారం ప్రకటించింది. సెప్టెంబర్ 2018లో కుదిరిన 900 మిలియన్ డాలర్ల ఈ ఒప్పందం రెండేండ్ల తర్వాత రద్దుకావడం విశేషం. అమెరికా ఫెడరల్ ట్రేడ్ కమిషన్ విధించిన కాలపరిమితి లోపు ఈ ఒప్పందం పూర్తికాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని అరబిందో ఫార్మా బీఎస్‌ఈకి సమాచారం అందించింది.

# ఆట

## ఐదు వారాల ఐపీఎల్ మంచిది

- వాన్ కొత్త ఆలోచన



**లండన్:** కరోనా వైరస్ కారణంగా ఈ ఏడాది ఐపీఎల్ 13వ సీజన్ సందిగ్ధంలో పడిన నేపథ్యంలో ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైకేల్ వాన్ కొత్త ఆలోచనతో ముందుకొచ్చాడు. ఐదు వారాల వ్యవధిలో ఐపీఎల్ నిర్వహిస్తే బాగుంటుందని గురువారం ట్వీట్ చేశాడు. 'నా దగ్గర ఓ ఆలోచన ఉంది. అక్టోబర్ 18న ప్రారంభమయ్యే టీ20 ప్రపంచ కప్ కంటే ముందు.. ఐదు వారాల వ్యవధిలో ఐపీఎల్ నిర్వహిస్తే బాగుంటుంది. విశ్వకప్ కోసం ఆటగాళ్లకు సన్నాహకంగానూ ఉంటుంది. ప్రపంచకప్‌తో పాటు ఐపీఎల్ జరుగడం క్రికెట్‌కు ఎంతో ముఖ్యం' అని వాన్ పేర్కొన్నాడు. కరోనా వైరస్ కారణంగా మార్చి 29న ప్రారంభం కావాల్సిన ఐపీఎల్.. ఈ నెల 15వ తేదీకి వాయిదా పడిన సంగతి తెలిసిందే.

## 90లక్షల మంది చూశారట




**దుబాయ్:** వీక్షణల్లో మహిళల టీ20 ప్రపంచకప్ టోర్నీ భారత్‌లో రికార్డులు నెలకొల్పిందని అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసీసీ) తెలిపింది. మెల్‌బోర్న్ వేదికగా భారత్, ఆస్ట్రేలియా మధ్య విశ్వటోర్నీ ఫైనల్ గత నెల 8న జరిగిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌ను భారత్‌లో దాదాపు 90లక్షల మంది ప్రత్యక్ష ప్రసారం ద్వారా చూశారని ఐసీసీ తెలిపింది. ఈ మేరకు ప్రపంచకప్ వీక్షణ గణాంకాలను గురువారం విడుదల చేసింది. అలాగే టోర్నీ మొత్తానికి భారత్‌లో దాదాపు 540కోట్ల నిమిషాల వీక్షణలు వచ్చాయని తెలిపింది. ఎంత మంది, ఎన్ని మ్యాచ్‌లను ఎంత సమయం వీక్షించారనే విషయాలను గుణించి.. వీక్షణ నిమిషాలను లెక్కేసినట్టు ఐసీసీ తెలిపింది. 2018లో విండీస్ వేదికగా జరిగిన టీ20 ప్రపంచకప్‌తో పోలిస్తే ఈసారి వీక్షణలు 20రెట్లు పెరిగాయట.



## 'డక్‌వర్త్' సృష్టికర్త లూయిస్ మృతి

**లండన్:** పరిమిత ఓవర్ల క్రికెట్ వాతావరణం వల్ల ప్రభావితమైతే వినియోగిస్తున్న డక్‌వర్త్ లూయిస్ పద్ధతి సృష్టికర్తల్లో ఒకరైన టోనీ లూయిస్ మృతి చెందారు. ఈ విషయాన్ని ఇంగ్లండ్ వేల్స్ క్రికెట్ బోర్డు(ఈసీబీ) వెల్లడించింది. గణిత శాస్త్రజ్ఞుడైన టోనీ లూయిస్.. ఫ్రాంక్ డక్‌వర్త్‌తో కలిసి డక్‌వర్త్ లూయిస్ పద్ధతిని 1997లో ఆవిష్కరించారు. 1999 నుంచి ఐసీసీ ఈ విధానాన్ని వినియోగిస్తున్నది. కొన్నిసార్లు డక్‌వర్త్ లూయిస్ పద్ధతిపై తీవ్ర విమర్శలు వచ్చాయి.

## మోదీకి ఐవోసీ థ్యాంక్స్

**లుసానే:** టోక్యో ఒలింపిక్స్‌కు మద్దతు తెలిపినందుకు గాను భారత ప్రధాని నరేంద్ర మోదీకి అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ(ఐవోసీ) అధ్యక్షుడు థామస్ బాచ్.. కృతజ్ఞతలు తెలియజేశారు.'వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గత నెల జరిగిన జీ-20 సదస్సులో టోక్యో ఒలింపిక్స్‌కు మద్దతు తెలిపినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. కరోనా కట్టడికి ఐవోసీ చేయూతనిస్తున్నదన్న ప్రకటనకు సంతోషిస్తున్నాం' అని లేఖలో బాచ్ పేర్కొన్నాడు. కరోనా వైరస్ కారణంగా టోక్యో ఒలిపిక్స్ వచ్చే ఏడాదికి వాయిదా పడింది.

# టెస్టు క్రికెట్ నన్ను మార్చేసింది

- ఆ ఫార్మాట్‌లో సాధ్యమైనంత కాలం కొనసాగుతా
- రొనాల్డో అంటే ఇష్టం
- పీటర్సన్‌తో ఇంటర్వ్యూలో భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ

**న్యూఢిల్లీ:** టెస్టు క్రికెట్ తన వ్యక్తిత్వాన్ని మెరుగుపరిచిందని టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ అన్నాడు. ఆడగలిగినంత కాలం టెస్టుల్లో తప్పకుండా కొనసాగుతానని స్పష్టం చేశాడు. ఇన్‌స్టాగ్రామ్ లైవ్‌లో ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ కెవిన్ పీటర్సన్‌తో విరాట్ గురువారం మాట్లాడాడు. టెస్టు క్రికెట్‌పై తన ఇష్టాన్ని, కెరీర్‌లో ఎదురైన గడ్డు పరిస్థితులను, వేగన్‌గా మారేందుకు కారణాలను వెల్లడించాడు. ఇష్టమైన ఫార్మాట్ ఏదని పీటర్సన్ అడిగిన ప్రశ్నకు.. కోహ్లీ వరుసగా ఐదుసార్లు టెస్ట్ క్రికెట్ అనిచెప్పాడు. 'నేను ఐదుసార్లు చెప్పా. ఎందుకంటే టెస్టులకు ప్రాతినిధ్యం వహించడమే నా జీవితంలో గొప్ప విషయం. పరుగులు చేసినా చేయకపోయినా.. వేరే వాళ్ల బ్యాటింగ్‌కు చప్పట్లు కొట్టినా.. ఆ తర్వాత రూమ్‌కు వెళ్లాల్సిందే. తర్వాతి రోజుకు సిద్ధమవ్వాల్సిందే. నచ్చినా నచ్చకపోయినా ప్రతిరోజు దీన్ని అనుకరించాల్సిందే. సంప్రదాయ ఫార్మాట్ జీవితం లాంటిది. మొత్తంగా టెస్టు క్రికెట్ నా వ్యక్తిత్వాన్ని మెరుగుపరిచింది' అని కోహ్లీ బదులిచ్చాడు. అలాగే కెప్టెన్‌ను అయినంత మాత్రాన తాను దూకుడు తగ్గించుకోవాల్సిన అవసరం లేదని, ఎలా ఉన్నానో అలానే ఉంటానని చెప్పాడు. ఇప్పటి వరకు 86టెస్టులు ఆడిన కోహ్లీ 7240 పరుగులు చేసి, అత్యుత్తమ బ్యాట్స్‌మన్‌గా ప్రశంసలు అందుకుంటున్నాడు.

**డివిలియర్స్‌ను స్లెడ్జ్ చేయలేను**

ఐపీఎల్‌లో తన జట్టు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు సభ్యుడు, దక్షిణాఫ్రికా ఆటగాడు ఏబీ డివిలియర్స్ పట్ల తానెప్పుడూ దూకుడుగా ప్రవర్తించలేనని విరాట్ చెప్పాడు. ఏబీతో స్నేహం సుదీర్ఘంగా ఉంటుందని అన్నాడు. ఒకరినొకరు గౌరవించుకోవడం ఐపీఎల్ ఎక్కువగా నేర్పించిందని కోహ్లీ అభిప్రాయపడ్డాడు. మహేంద్ర సింగ్ ధోనీ, ఏబీల్లో ఎవరితో బ్యాటింగ్ చేయడం ఇష్టమని పీటర్సన్ అడుగగా... ఇద్దరితో వికెట్ల మధ్య పరుగెత్తడం అంటే తనకు చాలా ఇష్టమని విరాట్ సమాధానమిచ్చాడు.

**వేగన్‌గా మారింది అందుకే..**

2018 దక్షిణాఫ్రికా పర్యటనలో కడుపు, మెడ ఎముకల సంబంధిత సమస్య రావడం తాను వేగన్‌గా మారినట్టు విరాట్ వెల్లడించాడు. తన కెరీర్‌లో 2014 ఇంగ్లండ్ సిరీస్‌లో గడ్డు పరిస్థితులను ఎదుర్కొన్నానని చెప్పాడు. పరుగులు చేయడమే గగనమని ఆ సిరీస్‌లో అనిపించినట్టు.. కోహ్లీ చెప్పాడు. పోర్చుగల్ సాకర్ హీరో క్రిస్టియానో రొనాల్డో అంటే తనకెంతో ఇష్టమని అన్నాడు.



కోహ్లీ


## విరాళంగా రెండేండ్ల వేతనం

- మరోసారి ఉదారత చాటిన గౌతమ్ గంభీర్

**న్యూఢిల్లీ:** టీమ్‌ఇండియా మాజీ ఆటగాడు, తూర్పు ఢిల్లీ ఎంపీ గౌతమ్ గంభీర్.. కరోనాపై యుద్ధానికి మరోసారి విరాళం ప్రకటించాడు. మహమ్మారిపై యుద్ధానికి తన రెండేండ్ల వేతనాన్ని ప్రధానమంత్రి-కేర్స్ నిధికి విరాళంగా ఇచ్చాడు. అలాగే ప్రజలు సైతం ముందుకు రావాలని పిలుపునిచ్చాడు. దేశం మనకు ఏమిచ్చిందనేది కాకుండా.. మనం దేశానికి ఏం చేయగలమో ఆలోచించాలని గంభీర్ గురువారం ట్వీట్ చేశాడు. నెల వేతనంతో పాటు రూ.కోటి ఎంపీ ల్యాడ్స్ నిధులను ఇదివరకే పీఎం-కేర్స్ నిధికి గౌతీ అందజేశాడు. అంతకు ముందు రూ.50లక్షలకు పీఎం సహాయ నిధికి ఇచ్చాడు.

**శ్రీధర్ రూ.4లక్షలు**

టీమ్‌ఇండియా ఫీల్డింగ్ కోచ్, హైదరాబాద్ రంజీ జట్టు మాజీ ఆటగాడు ఆర్.శ్రీధర్ రూ.4లక్షలను విరాళంగా ప్రకటించాడు. 'భారత పౌరుడిగా గర్విస్తూ నా విధిని నిర్వర్తిస్తున్నా. రూ.2లక్షలను పీఎం కేర్స్ నిధికి, రూ.1.50లక్షలను తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి, రూ.50వేలను సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు అందజేస్తున్నా' అని శ్రీధర్ గురువారం ట్వీట్ చేశాడు.


గంభీర్

**షూటర్ అపూర్వి రూ. 5లక్షల విరాళం**

కామన్వెల్త్ స్వర్ణపతక విజేత, భారత షూటర్ అపూర్వి చండేల కరోనాపై యుద్ధానికి సాయం చేసేందుకు ముందుకొచ్చింది. రూ.3లక్షలను పీఎం-కేర్స్ నిధికి, రూ.2లక్షలను రాజస్థాన్ సీఎం సహాయ నిధికి అందించినట్టు గురువారం తెలిపింది.

## 'అందరి వల్లే గెలుపు'

**న్యూఢిల్లీ:** ప్రపంచకప్ గెలుపును గుర్తుచేసేందుకు.. ధోనీ కొట్టిన సిక్సర్‌నే ఓ క్రికెట్ వెబ్‌సైట్ ప్రధానంగా చూపించడంపై టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ గంభీర్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. మొత్తం జట్టు కృషి వల్లే టైటిల్ సాధించామంటూ ట్వీట్ చేశాడు. 'గుర్తు చేస్తున్నా. 2011 ప్రపంచకప్‌ను టీమ్‌ఇండియా, సహాయక సిబ్బందితో పాటు మొత్తం భారతదేశం గెలిచింది. కానీ ఒక్కసిక్సర్‌కే ఎక్కువ కాలంగా ప్రాధాన్యమిస్తున్నారు' అని ట్వీట్ చేశాడు. ప్రపంచకప్ ఫైనల్లో జట్టు కష్టాల్లో ఉన్న సమయంలో గంభీర్ 97పరుగులు చేసి విజయంలో ప్రధానపాత్ర పోషించాడు.

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.


epaper.ntnews.com

నమస్తే తెలంగాణ
నిపుణ
[ హైదరాబాద్ ]
శుక్రవారం 3 ఏప్రిల్ 2020

అంతరిక్షం.. మానవుడికి నిత్యం సవాలు విసిరే క్షేత్రం. ఆధునిక సాంకేతికత పెరిగేకొద్ది మానవుడి ఆలోచనలు భూమి మీద నుంచి అంతరిక్షంలోకి మళ్లుతున్నాయి. అంతరిక్ష శోధనతో మానవాళి జీవనాన్ని మరింత సుఖమయం చేయడానికి నిరంతరం అన్వేషిస్తున్నారు. ఇప్పటికి మనం సాధించింది రవ్వంత. సాధించాల్సింది అనంతమంత. ఈ రంగానికి ఉజ్వల భవిష్యత్ ఉందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. అంతరిక్ష రంగానికి సంబంధించిన కోర్సులు చేస్తే అవకాశాలు కూడా పుష్కలంగా ఉంటాయనడంలో సందేహం లేదు. దేశంలో అంతరిక్షానికి సంబంధించి ప్రామాణిక విద్యకు నెలవైన సంస్థ ఐఐఎస్టీ. ఆ సంస్థ అందించే కోర్సులు, ప్రవేశ విధానం, సీట్ల సంఖ్య తదితరాల గురించి నిపుణ పాఠకుల కోసం..

# అంతరిక్షమంత అవకాశాలు

## స్పేస్ ఇంజినీరింగ్ @ ఐఐఎస్టీ



### ఐఐఎస్టీ

- ఇది దేశంలో అంతరిక్ష విద్యను అందించడానికి ప్రారంభించిన మొదటి సంస్థ.
- దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ఐఐఎస్టీ ఒకటి. ఇది డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ పరిధిలో డీమ్డ్ యూనివర్సిటీ, అటానమస్ బాడీ కలిగిన విద్యా సంస్థ. కేరళలోని వలిమల (తిరువనంతపురం దగ్గర)లో 100 ఎకరాల్లో క్యాంపస్‌ను 2007, సెప్టెంబర్ 14న నాటి ఇస్రో చైర్మన్ డా. జీ మాధవన్ నాయర్ దీన్ని ప్రారంభించారు. ఈ సంస్థ స్థాపించడానికి మాధవన్ నాయర్, బీఎస్ సురేష్ ముఖ్యులు. ఆ తర్వాత సంస్థ మొదటి డైరెక్టర్‌గా డా. బీఎస్ సురేష్ వ్యవహరించారు. 2010లో సొంత భవనంలోకి సంస్థను మార్చారు.
- ఈ సంస్థకు మొదటి వైస్ చాన్స్‌లర్‌గా మాజీ రాష్ట్రపతి, ప్రఖ్యాత శాస్త్రవేత్త అబ్దుల్ కలామ్ వ్యవహరించడం విశేషం.
- ప్రస్తుతం ఈ సంస్థలో 98 మంది ఫ్యాకల్టీలు పనిచేస్తున్నారు. 23 శాతం మహిళా ఫ్యాకల్టీలు, 22 శాతం విద్యార్థినులు ఉండటం మరో విశేషం. దాదాపు 560 మంది అండర్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులు, 160 మంది ఎంటెక్/ఎంఎస్ విద్యార్థులు ఉన్నారు. 100కు పైగా పీహెచ్‌డీ స్కాలర్స్ ఉన్నారు. పశ్చిమ కనుమలకు దగ్గరలో ఉన్న ఈ క్యాంపస్ ఆహ్లాదకరంగా ఉంటుంది.
- ఈ సంస్థ బీటెక్, ఎంటెక్/ఎంఎస్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్‌ను ఆఫర్ చేస్తుంది. ముఖ్యంగా ఏరోస్పేస్, ఏవియానిక్స్, ఆస్ట్రానమి, ఆస్ట్రోఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎర్త్ సిస్టం సైన్సెస్, హ్యూమానిటీస్, మ్యాథ్స్, ఫిజిక్స్, రిమోట్‌సెన్సింగ్ విభాగాల్లో స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌గా కోర్సులను అందిస్తుంది.
- డ్యూయల్ డిగ్రీ చేసినవారికి బీటెక్ ఇంజినీరింగ్ ఫిజిక్స్‌తోపాటు ఎంఎస్/ఎంటెక్ (ఎన్నుకున్న సబ్జెక్టుల్లో) డిగ్రీలను ప్రదానం చేస్తారు.
- ఐదేండ్ల డ్యూయల్ డిగ్రీలో బీటెక్ (ఇంజినీరింగ్ ఫిజిక్స్) తర్వాత పీజీలో ఎంఎస్ ఇన్ సాలిడ్ స్టేట్ ఫిజిక్స్, ఎంఎస్ ఇన్ ఆస్ట్రానమి అండ్ ఆస్ట్రోఫిజిక్స్, ఎంఎస్ ఇన్ ఎర్త్ సిస్టం సైన్స్, ఎంటెక్ ఇన్ ఆప్టికల్ ఇంజినీరింగ్.

### ఎంపిక ఎలా

- ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ 2020 స్కోర్ ద్వారా


**నోట్:** ఐఐఎస్టీకి దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థుల జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంక్ ఆధారంగా కేటగిరీలవారీగా తుది ఎంపిక చేస్తారు.

### ఎవరు అర్హులు

- జనరల్/ఓబీసీ అభ్యర్థులు 1995, అక్టోబర్ 1 లేదా తర్వాత జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు 1990, అక్టోబర్ 1న లేదా తర్వాత జన్మించి ఉండాలి.
- ఇంటర్ (ఎంపీసీ)లో 75 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి.
- జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఐఐఎస్టీ నిర్దేశించిన మార్కులు సాధించాలి.
- తప్పనిసరిగా ఐఐఎస్టీకి దరఖాస్తు చేసుకొన్నవారు మాత్రమే అర్హులు.

### ఐఐఎస్టీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ)

- డీమ్డ్ యూనివర్సిటీ
- **చాన్స్‌లర్:** డా. బీఎన్ సురేష్
- **గవర్నింగ్ బాడీ ప్రెసిడెంట్:** డా. కే శివన్ (ఇస్రో చైర్మన్)
- **డైరెక్టర్:** డా. వినయ్ కుమార్ దద్వాల్
- క్యాంపస్ తిరువనంతపురానికి 20 కి.మీ. దూరంలో ఉంది.
- డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్, ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్స్ అఫిలియేషన్ ఉంది.



### ఆర్థిక సహాయం

- ఇంజినీరింగ్ కోర్సులో ప్రవేశం పొందిన అభ్యర్థులు మొదటి సెమిస్టర్‌లో 10 సీజీపీఏకు 7.5 సీజీపీఏ సాధిస్తే వారు రెండో సెమిస్టర్ ఫీజులు చెల్లించనవసరం లేదు. ప్రతి సెమిస్టర్‌లో నిర్దేశిత సీజీపీఏను సాధిస్తే సెమిస్టర్ ఫీజు ఇతర ఖర్చులను సంస్థ భరిస్తుంది.

### ఉద్యోగావకాశాలు

- నాలుగేండ్ల బీటెక్ లేదా ఐదేండ్ల డ్యూయల్ డిగ్రీని పూర్తిచేసుకొన్న అభ్యర్థులు కనీసం 7.5 సీజీపీఏ సాధిస్తే ఖాళీల సంఖ్యను బట్టి ఆర్డర్ ఆఫ్ మెరిట్‌లో ఇస్రో లేదా డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ కేంద్రాల్లో ఉద్యోగావకాశం కల్పించే అవకాశం ఉంది. అదేవిధంగా ఇస్రో నిర్దేశించిన శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
- సైంటిస్ట్/ఇంజినీర్ 'ఎస్‌సీ' స్థాయి ఉద్యోగాన్నిస్తారు. ఈ ఉద్యోగం కేంద్ర ప్రభుత్వ ఏడో పే కమిషన్ ప్రకారం లెవల్ 10 స్థాయికి చెందినది.
- ఉద్యోగంలో ప్రారంభవేతనం ఏడో పే కమిషన్ ప్రకారం నెలకు రూ.56,100 ఇస్తారు. వీటికి అదనంగా హెచ్‌ఆర్‌ఏ, టీఏ ఇస్తారు. వైద్య సౌకర్యం, గ్రూప్ ఇన్సూరెన్స్, ఎల్‌టీసీ, పెన్షన్ తదితర సౌకర్యాలు కల్పిస్తారు.
- ఇస్రో లేదా డీఓఎస్‌లో ఉద్యోగంలో చేరినవారు తప్పనిసరిగా మూడేండ్లు ఉద్యోగం చేస్తామనే బాండ్‌ను సమర్పించాలి.

### ముఖ్యతేదీలు

- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో మే 25 నుంచి
- **చివరితేదీ:** జూన్ 12
- అడ్మిషన్ బ్రోచర్ విడుదల: మే 1
- **వెబ్‌సైట్:** https://www.iist.ac.in

**నోట్:** కరోనా ఎఫెక్ట్‌తో దేశంలోని అన్ని ఎంట్రెన్స్ టెస్ట్ తేదీలు మారనున్నాయి. దరఖాస్తు, చివరితేదీ ఇతర విషయాల కోసం సంబంధిత వెబ్‌సైట్‌ను చూడవచ్చు.

... కేశవపంతుల వేంకటేశ్వరశర్మ



### అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులవారీగా సీట్ల వివరాలు

**బీటెక్ ప్రోగ్రామ్**

- **ఏరోస్పేస్ ఇంజినీరింగ్:** ఇది నాలుగేండ్ల కోర్సు. సీట్ల సంఖ్య – 60+6*
- **ఈసీఈ (ఏవియానిక్స్):** ఇది నాలుగేండ్లకోర్సు. సీట్ల సంఖ్య – 60+6*
- **డ్యూయల్ డిగ్రీ (బీటెక్‌తోపాటు ఎంటెక్/ఎంఎస్):** ఇది ఐదేండ్ల కోర్సు. సీట్ల సంఖ్య – 20+2*

**నోట్:** గతేడాది నుంచి ఎకనామికల్లీ వీకర్ సెక్షన్స్ (ఈడబ్ల్యూఎస్) కోటా కింద పెంచిన సీట్లు.



# విద్య, ఉద్యోగ సమాచారం

## 'అడ్వాన్స్‌డ్'కు ఐఐటీ ఖరగ్‌పూర్ ఫ్రీ ఆన్‌లైన్ క్లాసెస్

- కొవిడ్–19తో దేశమంతా లాక్‌డౌన్‌లో ఉంది. ఐఐటీలో ప్రవేశాల కోసం జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను నిర్వహిస్తారు. ఈ పరీక్షకు సిద్ధమవుతున్న వారి కోసం ఐఐటీ ఖరగ్‌పూర్ ఉచిత ఆన్‌లైన్ తరగతులను అందిస్తుంది. కరోనా మహ్మరితో జేఈఈ మెయిన్ పరీక్షలు వాయిదా పడిన విషయం విదితమే. దీంతో అడ్వాన్స్‌డ్ పరీక్షతేదీ (మొదట షెడ్యూల్ ప్రకారం మే 17న జరగాల్సి ఉంది) కూడా మారనున్నది. ఈ లాక్‌డౌన్‌తో విద్యార్థుల ప్రిపరేషన్‌కు ఎటువంటి ఆటంకం కలగకూడదని ఈ క్లాసెస్‌ను ఐఐటీకే అందిస్తుంది. ముఖ్యంగా కోచింగ్ తీసుకోలేనివారికి, గ్రామీణ, చిన్నచిన్న పట్టణాలకు చెందిన విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేలా ఐఐటీ ఖరగ్‌పూర్ ఆన్‌లైన్‌లో పాఠాలను అందుబాటులోకి తెచ్చింది. దీనిలో భాగంగా జేఈఈ మాడ్యూల్స్, నోట్స్‌ను ఉచితంగా అందిస్తుంది. ఈ క్లాసెస్‌ను నేషనల్ డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా ప్లాట్‌ఫాం ద్వారా అందిస్తుంది. ఈ సేవలను ఎన్‌డీఎల్ఐ వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్ ద్వారా పొందవచ్చు.

### ప్రత్యేక వెబ్‌సైట్

- ఈ వెబ్‌సైట్‌కు **'కరోనా అవుట్‌బ్రేక్ – స్టడీ ఫ్రమ్ హోమ్'** అని పేరు పెట్టారు.
- దీనిలో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలకు సంబంధించిన ప్రశ్నలు, సమాధానాలతోపాటు, ఆయా అంశాలవారీగా వీడియో పాఠాలు ఉన్నాయి. వీటితోపాటు పన్నెండేండ్ల జేఈఈ అడ్వాన్స్‌డ్ సాల్వ్ చేసిన పేపర్లనూ అందుబాటులో ఉంచారు. ఎటువంటి ఫీజు లేకుండా ఉచితంగా అందరూ దీన్ని ఉపయోగించుకోవచ్చు.
- **పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్:** https://ndl.iitkgp.ac.in/ లేదా https://www.ndl.gov.in చూడవచ్చు.
- ఈ క్లాసెస్, మెటీరియల్‌ను ఆయా సబ్జెక్టుల్లో నిపుణులు, సీనియర్ ఫ్యాకల్టీలు, పీహెచ్‌డీ స్కాలర్స్ రూపొందించారు. అంతేకాకుండా ఆయా సబ్జెక్టులకు సంబంధించిన రిఫరెన్స్ మెటీరియల్ ఇతర సమాచారం కూడా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంది.



### ఐఐఎఫ్‌టీలో ప్రవేశాలు

- భారత ప్రభుత్వ పరిధిలోని డీమ్డ్ యూనివర్సిటీ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టీ) కింది ప్రోగ్రామ్‌లో ప్రవేశాల కోసం ప్రకటన విడుదల చేసింది.
- **ప్రోగ్రామ్:** ఎగ్జిక్యూటివ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ఇంటర్నేషనల్ బిజినెస్ (ఈపీజీడీఐబీ)
- ఈ తరగతులు వారాంతంలో నిర్వహిస్తారు. ఇంటర్నేషనల్ స్టడీ టూర్ ఉంటుంది.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మే 15
- **వెబ్‌సైట్:** www.iift.edu

### కలినరీ కోర్సులు

**ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్ (ఐసీఐ) కింది కోర్సుల్లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.**

- **కోర్సు:** బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (బీబీఏ)
- **కాలవ్యవధి:** మూడేండ్లు
- **అర్హతలు:** ఇంటర్ ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2020, జూలై 1 నాటికి 22 ఏండ్లు మించరాదు.
- **కోర్సు:** మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ)
- **కాలవ్యవధి:** రెండేండ్లు
- **అర్హతలు:** డిగ్రీ/ తత్సమాన (కలినరీ ఆర్ట్స్/ హాస్పిటాలిటీ/ హోటల్ మేనేజ్‌మెంట్) కోర్సులు ఉత్తీర్ణత.
- **వయస్సు:** ఆగస్టు 1 నాటికి 25 ఏళ్లు మించరాదు.




**నోట్:** ఈ కోర్సులను తిరుపతి, నోయిడాలోని ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్, అమర్ కంటక్‌లోని ఇందిరాగాంధీ నేషనల్ ట్రైబల్ యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి.

- పై రెండు కోర్సులకు రాతపరీక్ష ద్వారా ఎంపిక చేస్తారు.
- **పరీక్షతేదీ:** మే 16
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 27
- **హార్డ్‌కాపీలను పంపడానికి చివరితేదీ:** ఏప్రిల్ 30
- **వెబ్‌సైట్:** http://www.ici.nic.in

# ఇంటిస్థలం వెల ఎంత?

అర్థమెటిక్

**1. ఒక సంఖ్యను 3తో భాగించి భాగఫలానికి 1 కలిపిన వచ్చే ఫలితం 3కు సమానమైనా ఆ సంఖ్య ఏది?**
ఎ. 12 బి. 10 సి. 6 డి. 9
**సమాధానం: సి**
**వివరణ**
- ఒక సంఖ్య x అనుకొనుము
- సంఖ్య x ను 3తో భాగించగా $x/3$ అవుతుంది.

$x/3$కు 1 కలుపగా ఫలితం 3కు సమానం
$(x/3) + 1 = 3$
$(x+3)/3 = 3$
$x+3 = 9$
$x = 9-3 = 6$
ఆ సంఖ్య = 6

**2. $x^0$, $(x+50)^0$, $(x+70)^0$ కోణాల మొత్తం $180^0$ అయిన ఆ కోణాల విలువలు వరుసగా?**
ఎ. 10, 60, 80
బి. 20, 70, 90
సి. 40, 90, 110
డి. 30, 80, 100
**సమాధానం: బి**
**వివరణ**
- త్రిభుజంలోని కోణాలు వరుసగా $x^0$, $(x+50)^0$, $(x+70)^0$

త్రిభుజంలోని కోణాల మొత్తం = $180^0$
$x^0$, $(x+50)^0$, $(x+70)^0$
$3x+120^0 = 180^0$
$3x = 180-120$
$x = 20^0$
- త్రిభుజంలోని కోణాలు $20^0$, $(20+50)^0$, $(20+70)^0$

$20^0$, $70^0$, $90^0$

**3. ఒక సరళ రేఖపై ఆసన్న కోణాలు $(3x+20)^0$, $(5x-40)^0$ అయిన వాటి విలువలు?**
ఎ. 95, 85 బి. 140, 160
సి. 85, 75 డి. 120, 130
**సమాధానం: ఎ**
**వివరణ**
- సరళ రేఖపై ఆసన్న కోణాల మొత్తం = $180^0$
- ఆసన్న కోణాల మొత్తం

$(3x+20)^0+(5x-40)^0 = 180^0$
$8x-20 = 180^0$
$8x = 180+20$
$x = 25$
సరళరేఖపై ఆసన్న కోణాలు = $(3(25)+20)^0$, $(5(25)-40)^0$
$= 95^0, 85^0$

**4. ఒక బాలుని వయస్సు తండ్రి వయస్సులో 3వ వంతు కలదు. ఇద్దరి వయస్సుల మొత్తం 80 ఏండ్లు. అయిన వారి విడివిడి వయస్సులు?**
ఎ. 20, 60 బి. 30, 90
సి. 25, 75 డి. 15, 45
**సమాధానం: ఎ**
**వివరణ**
- తండ్రి వయస్సు = x అనుకొనుము
- బాలుని వయస్సు తండ్రి వయస్సులో 3వ వంతు
- బాలుని వయస్సు = $x/3$ సం.లు

ఇద్దరి వయస్సుల మొత్తం = 80సం.లు
$x+(x/3) = 80$
$(3x+x)/3 = 80$
$4x = 80(3)$
$x = 60$
- తండ్రి వయస్సు = 60
- కొడుకు వయస్సు = $x/3 = 60/3 = 20$
- తండ్రి, కొడుకుల వయస్సు = 60, 20 సం.లు

**5. ఒక సమద్విబాహు త్రిభుజం చుట్టుకొలత 27సెం.మీ. భూమి పొడవు సమాన భుజాల కన్నా 3 సె.మీ.లు తక్కువ, త్రిభుజ భుజాల పొడవులు కనుగొనుము?**
ఎ. 10, 10, 8 బి. 8, 8, 5
సి. 9, 9, 6 డి. 10, 10, 7
**సమాధానం: డి**
**వివరణః**
- సమద్విబాహు త్రిభుజంలో రెండు భుజాలు సమానం.
- సమద్విబాహు త్రిభుజంలో రెండు భుజాలు = x, x అనుకొనుము.
- భూమి పొడవు సమాన భుజాలు x కన్నా 3 సెం.మీ.లు తక్కువ = $(x-3)$ అగును
- త్రిభుజ భుజాల మొత్తం

$= x+x+(x-3) = 27$
$3x-3 = 27$
$3x = 30$
$x = 10$
- త్రిభుజ భుజాల పొడవులు

$= 10, 10, (10-3)$
$= 10, 10, 7$

**6. గుడ్డు ఒకటి 40 పైసలకు కొని 55 పైసలకు అమ్మగా అతనికి రూ.1.80 లాభం వచ్చింది. అతను అమ్మిన గుడ్లు ఎన్ని?**
ఎ. 15 బి. 10 సి. 12 డి. 13
**సమాధానం: సి**
**వివరణ**
- గుడ్డు కొన్న వెల = 40పైసలు
- గుడ్డు అమ్మిన వెల = 55పైసలు
- గుడ్లు అమ్మగా వచ్చిన లాభం = అమ్మినవెల – కొన్నవెల

= 55–40 = 15పైసలు
- మొత్తం గుడ్లు అమ్మగా వచ్చిన లాభం = రూ.

= 180 పైసలు
- అమ్మిన గుడ్లు = మొత్తం గుడ్లు అమ్మగా వచ్చిన లాభం/ఒక గుడ్డు అమ్మగా వచ్చిన లాభం

= 180పైసలు / 15 పైసలు
= 12
- అమ్మిన గుడ్లు = 12

**7. 6 బిందువుల గుండా గీయగల రేఖల సంఖ్య 15. అయితే 12 బిందువుల గుండా గీయగల రేఖలు?**
ఎ. 120 బి. 25
సి. 78 డి. 66
**సమాధానం: డి**
**వివరణ**
- n బిందువుల గుండా గీయగల రేఖల సంఖ్య = $n(n-1)/2$
- 6 బిందువుల గుండా గీయగల రేఖల సంఖ్య = 15
- 12 బిందువుల గుండా గీయగల రేఖల సంఖ్య = $12(12-1)/2$

$= 12(11)/2 = 6(11) = 66$

**8. గదినేల దీర్ఘచతురస్రాకారంలో ఉంది. గది పొడవు 12మీ. వెడల్పు 10మీ., ఎత్తు 8మీ. ఆ గది కప్పుకు నాలుగు గోడలకు రంగు వేయడానికి 100చ.మీ.లకు రూ.12 అయిన ఎంత ఖర్చు అవుతుంది?**
ఎ. రూ.485.60 బి. రూ.48.56
సి. రూ.56.64 డి. రూ.560.64
**సమాధానం: సి**
**వివరణ**
- గది పొడవు (l) = 12మీ.
- వెడల్పు (b) = 10మీ.
- ఎత్తు (h) = 8మీ.
- గది నాలుగు గోడల వైశాల్యం

$= 2h(l+b)$
$= 2(8)(12+10)$
= 352చ.మీ.
- గది కప్పు వైశాల్యం = 12(10) = 120చ.మీ.
- రంగు వేయవలసిన భాగ వైశాల్యం = 352+120

= 472 చ.మీ.
- 100 చ.మీ.లకు రంగు వేయడానికి ఖర్చు రూ.12
- 472 చ.మీ.లకు రంగు వేయడానికి ఖర్చు = $(472/100)12 = 5664/100$

= రూ.56.64
- గది పై కప్పుకు, నాలుగు గోడలకు రంగు వేయడానికి అయ్యే ఖర్చు = రూ.56.64

**9. 1సెం.మీ. = 10కి.మీ. అయిన సూచిక భిన్నము?**
ఎ. 1/10,000
బి. 1/1,00,00,000
సి. 1/1,00,000
డి. 1/10,00,000
**సమాధానం: డి**
**వివరణ**
- 1 సెం.మీ. = 10కి.మీ.
- 1కి.మీ. = 1000మీ.
- 1మీ. = 100 సెం.మీ.
- సెం.మీ.లలోనికి మార్చగా
- 1సెం.మీ. = 10(1000)(100) సెం.మీ.
- సూచిక భిన్నం = 1/10,00,000

**10. ఒక ఇంటి స్థలం ఇప్పటి విలువ రూ. 15,00 ఒక సంవత్సరం తర్వాత దాని విలువ 10శాతం పెరుగుతుంది. రెండో సంవత్సరం చివర మొదటి సంవత్సరపు విలువపై 15శాతం పెరుగుతుంది. రెండో సంవత్సరం చివర ఆ ఇంటిస్థలం వెల ఎంత?**
ఎ. రూ.17,375 బి. రూ.15,225
సి. రూ.18,975 డి. రూ.16,500
**సమాధానం: సి**
**వివరణ**
- ఒక ఇంటి స్థలం విలువ

= రూ.15,000
- ఒక సంవత్సరం తర్వాత దాని విలువ 10శాతం తగ్గిన = 15000(10/100)

= రూ.1500
- ఒక సంవత్సరం తర్వాత ఇంటి స్థలం విలువ = రూ.15,000+1500

= రూ.16,500
- రెండో సంవత్సరం చివర మొదటి సంవత్సరం విలువపై 15 శాతం పెరిగిన = 16500(15/100)

= రూ. 2475
- రెండో సంవత్సరం చివర ఇంటి స్థలం వెల = మొదటి సంవత్సరం ఇంటి స్థలం విలువ + రెండో సం. చివర విలువ

= రూ. 16,500+ రూ. 2475
= రూ. 18,975

**11. ముగ్గురు విద్యార్థుల సగటు బరువు 40కి.గ్రా. వారిలో రంగా బరువు 46కి.గ్రా., మిగిలిన ఇద్దరు విద్యార్థులు రహీమ్, రేష్మాల బరువులు సమానం అయిన రహీమ్ బరువు ఎంత?**
ఎ. 43.3 కి.గ్రా. బి. 37.3కి.గ్రా.
సి. 20.3కి.గ్రా. డి. 28.3కి.గ్రా.
**సమాధానం: బి**
**వివరణ**
- రంగా బరువు = 46కి.గ్రా.
- రేష్మా బరువు = రహీమ్ బరువు =x కి.గ్రా. అనుకొనుము.
- సగటు = విద్యార్థుల బరువుల మొత్తం/ విద్యార్థుల సంఖ్య = 40కి.గ్రా.

$40 = (46+x+x)/3$
$40(3) = 46+2x$
$120-46 = 2x$
$x= 74/2 = 37$
రహీమ్ బరువు = 37కి.గ్రా

**12. 3 సంఖ్యల క.సా.గు 120 అయితే కిందివాటిలో ఏది H.C.F. అయి ఉండదు?**
ఎ. 8 బి. 10 సి. 12 డి. 25
**సమాధానం: డి**
**వివరణ**
- 25 అనేది 120 గుణిజం కాదు కాబట్టి.

**13. 132, 77లను ఏ గరిష్ఠ సంఖ్యతో భాగిస్తే ప్రతిసారీ 2 శేషం వస్తుంది?**
ఎ. 5 బి. 11 సి. 22 డి. 25
**సమాధానం: ఎ**



బీవీ రమణ
డైరెక్టర్ ఏకేఆర్ స్టడీ సర్కిల్, తాండూరు, వికారాబాద్
9441022571